www.akshratimes.com

తెలుగు దినపత్రిక


# అక్షర టైమ్స్

మా అక్షరం ప్రజల పక్షం

RNI.NO : APTEL/2022/90211

సంపుటి : 04 సంచిక : 82 పేజిలు : 08, వెల రూ. 1 రూ/ www.akshratimes.com గురువారం 09 - 07 - 2026

Published by ANANTAPURAM : Circulated in Anantapuram, Satya Sai, Vijayavada, Ysr Kadapa, Annamayya, Prakasham, Bapatla,Ntr, Karimnagar,Gunturu,East Godavari, West Godavari, Kakinada, Eluru, Sri Potti Sriramulu Nellore, Kurnool



విశాఖ తీరంలో విషాదం.. గల్లంతైన ఆరుగురు మత్స్యకారులు మృతి చెందినట్లు ప్రకటన



## ఏపీలో ఫుట్‌వేర్ హబ్‌కు అడుగులు

- బుసాన్‌లో హ్యోసంగ్ ప్రతినిధులతో లోకేశ్ భేటీ
- కుప్పంలో ఇంటిగ్రేటెడ్ ఫుట్‌వేర్ క్లస్టర్ ప్రతిపాదన
- ఏపీలో ఆర్‌అండ్‌డీ, ఇన్నోవేషన్ సెంటర్ కోరిన మంత్రి
- కుప్పంలో రూ.900 కోట్ల ప్లాంట్‌ను గుర్తు చేసిన హ్యోసంగ్
- ప్రభుత్వ ప్రతిపాదనలను పరిశీలిస్తామని కంపెనీ హామీ

**అమరావతి :** దక్షిణ కొరియా పర్యటనలో ఉన్న రాష్ట్ర విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేశ్.. ప్రముఖ హ్యోసంగ్ గ్రూప్ ఉన్నతస్థాయి ప్రతినిధులతో బుసాన్‌లో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్‌లో ఫుట్‌వేర్ తయారీ రంగాన్ని మరింత విస్తరించేలా పలు కీలక ప్రతిపాదనలు చేశారు.కుప్పంలో హ్యోసంగ్ ఫుట్‌వేర్ తయారీ యూనిట్‌ను ఏర్పాటు చేయడానికి ముందుకు వచ్చినందుకు కంపెనీ ప్రతినిధులకు లోకేశ్ కృతజ్ఞతలు తెలిపారు. అదే ప్రాంతంలో - మిగతా 2 లో

# బడుగు బలహీన వర్గాల విద్యార్థులకు ప్రభుత్వం తీపి కబురు

- హాస్టళ్లు, గురుకులాల మెస్ ఛార్జీల పెంపు
- ప్రస్తుతం ఇస్తున్న మెస్ ఛార్జీలను 10 శాతం పెంచుతూ సీఎం నిర్ణయం
- ఎంజేపీ పాఠశాలల శాశ్వత భవనాలకు రూ.500 కోట్లు మంజూరుకు ఆమోదం
- సంక్షేమ శాఖలపై ముఖ్యమంత్రి చంద్రబాబు సమీక్ష



**అమరావతి :** బడుగు బలహీన వర్గాల విద్యార్థులకు ప్రభుత్వం తీపి కబురు అందించింది. ప్రభుత్వ వసతిగృహాలు, గురుకులాల్లో చదువుతున్న విద్యార్థులకు చెల్లించే డైట్ ఛార్జీలను 10 శాతం పెంచాలని నిర్ణయించింది. ప్రస్తుతం ఇస్తున్న డైట్ ఛార్జీల్లో 10 శాతం పెంచాలని ఈ మేరకు ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశించారు.రాష్ట్ర సచివాలయంలో సంక్షేమ శాఖలపై ముఖ్యమంత్రి చంద్రబాబు సమీక్ష నిర్వహించారు. ఈ సమీక్ష సందర్భంగా విద్యార్థులకు డైట్ ఛార్జీలు పెంచాలని సీఎం అధికారులను ఆదేశించారు. ప్రస్తుతం ఆర్థిక ఇబ్బందులు ఉన్నాయని, వచ్చే ఏడాది నుంచి పెంచుదామని ఆర్థిక శాఖ అధికారులు సూచించినా, ఈ ఏడాది రెండో త్రైమాసికం నుంచే డైట్ ఛార్జీల పెంపు వర్తింపజేయాలని సీఎం స్పష్టం చేశారు. బలహీనవర్గాల విద్యార్థుల కోసం డైట్ ఛార్జీలు పెంచాల్సిన అవసరం ఉందని ముఖ్యమంత్రి వ్యాఖ్యానించారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీల జీవితాల్లో విద్య ద్వారానే మార్పు వస్తుందని తెలిపారు. దీనికి తగినట్టుగానే వారికి అన్ని రకాల అవకాశాలు కల్పించాలన్నారు.మెరుగైన విద్య, మౌలిక సదుపాయాలతో పాటు పౌష్టికాహారాన్ని అందించాల్సిన అవసరం ఉందని సీఎం చంద్ర బాబు అభిప్రాయపడ్డారు. - మిగతా 2 లో

## నాన్నా.. మీరే నా స్ఫూర్తి



- తన తండ్రి జయంతి సందర్భంగా నివాళి అర్పించిన జగన్, విజయమ్మ
- తన తండ్రి ఆశీస్సులే తన ధైర్యం అంటూ ట్వీట్
- మిస్ యూ నాన్నా అంటూ భావోద్వేగం
- వైఎస్సార్ జయంతిని రాష్ట్ర వ్యాప్తంగా ఘనంగా నిర్వహించిన వైసీపీ శ్రేణులు
- హాజరైన వైసీపీ నేతలు, అభిమానులు

**అమరావతి :** దివంగత వైఎస్ రాజశేఖర రెడ్డి 77వ జయంతి సందర్భంగా ఇడుపులపాయలోని వైఎస్సార్ ఘాట్ వద్ద వైసీపీ అధినేత జగన్ తన కుటుంబ సభ్యులతో కలిసి ఘనంగా నివాళు లర్పించారు. “మీరే నా స్ఫూర్తి.. మీ ఆశీస్సులే నా ధైర్యం.. మిస్ యూ నాన్నా” అంటూ జగన్ భావోద్వేగంతో కూడిన ట్వీట్ చేశారు. వైఎస్సార్ ఘాట్ వద్ద నివాళులర్పిస్తున్న ఫొటోలను పంచ ుకున్నారు.తెలుగు రాష్ట్రాల్లో - మిగతా 2 లో

## మోదీకి ఇండోనేషియా మరో అరుదైన గౌరవం



- ఇండోనేషియా నుంచి మోదీకి ఐదు యుద్ధ విమానాల ఎస్కార్ట్
- 3 రోజుల పర్యటన ముగించుకుని ఆస్ట్రేలియాకు బయలుదేరిన ప్రధాని
- విమానాశ్రయంలో అధ్యక్షుడు ప్రబోవో స్వయంగా వీడ్కోలు
- రక్షణ, సాంకేతిక రంగాల్లో కొత్త సహకారానికి మార్గం
- ఇండోనేషియా మోదీ కృతజ్ఞతలు

## ఇరాన్‌పై మరోసారి దాడి చేస్తాం.. ట్రంప్ సంచలన ప్రకటన



- గత రాత్రి ఇరాన్‌పై భారీ దాడులు నిర్వహించామన్న ట్రంప్
- అవసరమైతే అదే తరహాలో దాడులు చేస్తామని హెచ్చరిక
- ఇరాన్ తీరుతెన్నులు మారకపోవడమే కారణమని వివరణ
- టర్కీలో నాటో సదస్సు లో మీడియాతో మాట్లాడిన అధ్యక్షుడు

## వైఎస్సార్ కు మరణం లేదు

- ఏపీ కాంగ్రెస్ చీఫ్ షర్మిల
- తన తండ్రి జయంతి సందర్భంగా నివాళి అర్పించిన షర్మిల
- వైఎస్ అమలు చేసిన పథకాలు ప్రతి గడపకు అందాయని ప్రశంస
- ఆయన మరణం తట్టుకోలేక 700 మంది ఆయనతో పాటే వెళ్లిపోయారని వ్యాఖ్య



**అమరావతి :** తన తండ్రి, దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి జయంతి సందర్భంగా ఏపీ కాంగ్రెస్ చీఫ్ షర్మిల నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... ‘వైఎస్సార్ లెజెండరీ లీడర్. ఆయనకు మరణం లేదు’ అని షర్మిల అన్నారు. వైఎస్సార్ ముఖ్యమంత్రిగా కేవలం 5 ఏళ్లు మాత్రమే పని - మిగతా 2 లో

## కుండపోత వర్షం ఢిల్లీలో కుప్పకూలిన నాలుగంతస్తుల భవనం

- శిథిలాల కింద కొందరు చిక్కుకొని ఉంటారని భావిస్తున్న అధికారులు
- సహాయక చర్యలు చేపట్టిన అగ్నిమాపక, పోలీసు బృందాలు
- ప్రమాద సమయంలో భవనంలో కొనసాగుతున్న నిర్మాణ పనులు



## వివరణ ఎందుకు ఇస్తా?



- కొండా సురేఖ ఫిర్యాదుపై తీవ్రంగా స్పందించిన కడియం
- తన దేవాదాయ శాఖలో శ్రీహరి సమీక్ష నిర్వహించారంటూ సురేఖ ఫిర్యాదు
- చర్యలు తీసుకోవాలంటూ రేవంత్ ను కోరిన వైనం
- తానెప్పుడూ ప్రోటోకాల్‌కు లోబడే పని చేస్తానన్న శ్రీహరి
- అధికారులతో తాను సమీక్ష నిర్వహించలేదని వెల్లడి

**హైదరాబాద్ :** తనకు చెందిన దేవాదాయ శాఖ అధికారులతో అధికారిక సమీక్ష నిర్వహించారంటూ ఎమ్మెల్యే కడియం శ్రీహరిపై సీఎం రేవంత్ రెడ్డికి మంత్రి కొండా సురేఖ ఫిర్యాదు చేసిన సంగతి తెలిసిందే. కడియం శ్రీహరిని వివరణ కోరాలని... విచారణ - మిగతా 2 లో

### నాకు మంత్రి పదవి ఇవ్వండి..

## నీళ్లు తెచ్చి చూపిస్తా



- బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి హరీశ్ రావు
- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి మాజీ మంత్రి హరీశ్ రావు సవాల్
- మూడు నెలలు మంత్రి పదవి ఇస్తే కాళేశ్వరం నీళ్లు తెస్తానన్న హరీశ్
- విఫలమైతే రాజకీయాల నుంచి శాశ్వతంగా తప్పుకుంటానని ప్రకటన
- తుమ్మిడిహట్టి ప్రాజెక్టులో కాంగ్రెస్ అవినీతికి పాల్పడిందని ఆరోపణ

**హైదరాబాద్ :** కాళేశ్వరం ప్రాజెక్టు అంశంపై బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి హరీశ్ రావు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి బహిరంగ సవాల్ విసిరారు. తనకు మూడు నెలల పాటు నీటిపారుదల శాఖ బాధ్యతలు అప్పగిస్తే, కన్నెపల్లి పంపుహౌస్ - మిగతా 2 లో

# ‘మీరు ఇవ్వలేదు.. మేమే కొట్లాడి తెచ్చుకున్నాం’

- ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క
- తాడిచెర్ల-2 బొగ్గు గనులను వేలం లేకుండానే సింగరేణి సంస్థకు కేటాయించిన కేంద్రం
- అనుమతి ఇవ్వడం సంతోషకరమని వెల్లడించిన ఉపముఖ్యమంత్రి
- గోదావరి బెల్ట్ కోల్ బ్లాక్‌లను వేలం లేకుండా సింగరేణికి ఇవ్వాలని విజ్ఞప్తి
- యూపీఏ హయాంలోనే తాడిచర్ల-2ను సింగరేణికి కేంద్రం కేటాయించిందని వెల్లడి



**హైదరాబాద్ :** సింగరేణికి తాడిచర్ల-2 కేటాయింపు సంతోషకరమని ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క పేర్కొన్నారు. వాస్తవాలను మరుగునపరిచి తప్పుదోవ పట్టించడం సరికాదన్నారు. 2013లో సింగరేణికి కేంద్ర ప్రభుత్వం లేఖ రాసిందని గుర్తు చేశారు. యూపీఏ హయాంలోనే తాడిచర్ల-2ను సింగరేణికి కేంద్రం కేటాయి ంచిందని వెల్లడించారు. తాడిచెర్ల-2 బొగ్గు గనులను వేలం లేకుండానే సింగరేణి సంస్థకు కేటాయించినట్లు కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డి ప్రకటించిన నేపథ్యంలో భట్టి విక్రమార్క ఈ విధంగా వ్యాఖ్యానించారు.గిరిజన ప్రాంతాల్లోని బొగ్గును ప్రభుత్వ సంస్థలు తప్ప మరొకరు చేయకూడదని ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అన్నారు. సింగరేణి - మిగతా 2 లో

# సంపాదకీయం

## వరదకష్టాల్లో ముంబై



ఎప్పటి మాదిరే ముంబై మహానగరం భారీ వర్షాలతో తడిసి ముద్దయింది. గత ఆరు రోజుల కుంభవృష్టితో 13 మంది మరణించారు. జనావాసాలు వరద నీట మునగడం, చెట్లు కూలడం, రోడ్ల ఆచూకీ తెలియకుండా పోవటం, ట్రాఫిక్ పూర్తిగా స్తంభించి వాహనదారులు దిక్కుతోచని స్థితికి చేరటం, రైళ్లన్నీ ఎక్కడికక్కడ నిలిచిపోవటం, విద్యాసంస్థలన్నీ మూతపడటం, పరీక్షలు వాయిదాలు పడటం... ఇవన్నీ దాదాపు ప్రతియేటా ముంబై ప్రజలకు రివాజుగా మారాయి. ఒక పిటిషన్ విచారణ సందర్భంగా మంగళవారం బృహన్ముంబై కార్పొరేషన్(బీఎంసీ)ని అనవసరంగా నిందించవద్దని బొంబాయి హైకోర్టు ధర్మాసనం వ్యాఖ్యానించింది. భూదురాక్రమణలకు పాల్పడటం, పేవ్‌మెంట్లు ఆక్రమించటం, చెత్తను ఎక్కడికక్కడ మురికి కాల్వల్లోకి తోసేయటం వంటి ధోరణులే సమస్యల్ని సృష్టిస్తున్నాయని తెలిపింది. అది నిజమే కావొచ్చుగానీ... అలాంటి ధోరణులను అరికట్టే బాధ్యత కూడా బీఎంసీదే. ఆ విషయంలో అది విఫలం కావటంవల్లనే ప్రతియేటా సమస్యలు తప్పడంలేదు. వానాకాలం వచ్చిందంటే ముంబైలో పెనుగాలులు, కుంభవృష్టి ఏకకాలంలో విరుచుకుపడుతుంటాయి. భౌగోళికంగా ముంబై ఉన్న స్థానం అటువంటిది గనుక ఇది అనివార్యమైన పరిస్థితి. అయితే దాన్ని దృష్టిలో పెట్టుకుని చేయాల్సిందేమిటన్న అంశంపై సమగ్ర దృష్టి సారిస్తే పరిష్కారం లభించకపోదు. ప్రభుత్వాలు ఆ పని చేయవు. బీఎంసీ ఒత్తిడి తీసుకురాదు. ముంబై ఒకప్పుడు ఏడు దీవుల సమాహారం. వాటిమధ్య 1784 నుంచి 1845 వరకూ మట్టి నింపుతూ పోవటం వల్ల ఇప్పుడున్న భౌగోళిక రూపం వచ్చింది. సముద్ర మట్టానికి ఈ నగరం కేవలం 14 మీటర్ల ఎత్తులో ఉంటుంది. కొన్నిచోట్ల ఒకటి, రెండు మీటర్లకు మించి లేదు. ముంబై వరదనీట కోసం నాలుగు నదులున్నాయి. నాలాలున్నాయి. వీటి ద్వారా నీరంతా సముద్రంలో కలుస్తుంది. కానీ వర్షాల తీవ్రత వుండి, సముద్రపు పోటు అధికంగా ఉంటే ఇవి అక్కరకు రావు. భూ మాఫియాల పుణ్యమా అని తీరాన ఉన్న మడ అడవులు, చిత్తడి నేలలు మాయమై రియల్ ఎస్టేట్ వ్యాపారంగా మారుతుంటే నిలువరించే వ్యవస్థలు లేవు. బ్రిటిష్ కాలంనాటి డ్రెయినేజీ వ్యవస్థ, కాంక్రీట్ నిర్మాణాలు, మరోపక్క వలసలు సమస్యను మరింత జటిలం చేస్తున్నాయి.నీటితో కలిసి జీవించటం అలవాటు చేసుకుంటే, అందుకనుగుణమైన జీవన విధానం అలవరుచుకుంటే ఇంత చేటు సమస్య ఉండదు. టోక్యో నగరం ఇందుకు ఉదాహరణ. అక్కడ ప్రతియేటా తుపాన్లు తప్పవు. పర్యవసానంగా వరదనీరు ముంచె త్తుతుంది. దీన్ని అధిగమించటం కోసం 2006లో ప్రపంచంలోనే అతి పెద్ద భూగర్భ వరద నీటి మళ్లింపు వ్యవస్థను నిర్మించింది. నగరం కింద 50 మీటర్ల లోతులో 6.3 కిలోమీటర్ల పొడవునా భారీ టన్నెళ్లు ఏర్పరిచారు. భారీ వరద నీరు ముంచెత్తినప్పుడు అదంతా ఆ టన్నెళ్లకూ, అక్కడినుంచి అయిదు అతి పెద్ద బావుల్లోకీ... వాటినుంచి భారీ భూగర్భ ట్యాంకుల్లోకీ పోతుంది. అక్కడినుంచి శక్తిమంతమైన జెట్ ఇంజన్ పైపులతో ఆ నీటిని తోడి నగరం ఆవలి భాగంలోని ఎడొగావా నదిలోకి పంపుతారు. చైనాలోనూ స్పాంజ్ సిటీల పేరుతో నీటిని ఎప్పటికప్పుడు భూమిలోకి పంపే రంధ్రాలున్న రోడ్లు నిర్మించారు. నగరాల చుట్టూ కృత్రిమంగా చిత్తడి నేలలు ఏర్పరిచారు. ఇవన్నీ వర్షపు నీటిని పీల్చుకుని భూగర్భ జలాలుగా మారుస్తాయి. సాధారణ రోజుల్లో పిల్లలకు ఆట స్థలాలుగా, భారీ వర్షాల సమయంలో తాత్కాలిక చెరువులుగా మారే వాటర్ స్క్వేర్‌లు నిర్మించి రోటర్‌డ్యామ్ నగరాన్ని నెదర్లాండ్స్ ప్రభుత్వం కాపాడుకుంది.ముంబై నగరాన్ని ప్రకృతి దయాదాక్షిణ్యాలకు వదిలిపెట్టడం కాక, అందుబాటులోని సాంకేతికతల సాయంతో తగిన ప్రణాళికలు రచించుకుంటే అక్కడి ప్రజలకు ప్రతియేటా ఈ తిప్పలు తప్పుతాయి. మాఫియాలను నియంత్రించటం, మౌలిక సదుపాయాలు... ముఖ్యంగా రవాణాను మెరుగుపరచటం వంటివి చేస్తే నగరం కిక్కిరిసిపోయే పరిస్థితిని నివారించవచ్చు. బ్రిడ్జిల నిర్మాణం, రోడ్ల వెడల్పు పేరుతో భారీ ప్రాజెక్టులు చేపట్టి అవి ఏళ్లతరబడి కొనసాగించటంవల్ల జనజీవనం స్తంభించిపోతోంది. వర్షాకాలం ఇదంతా అనేక రెట్లు పెరుగుతోంది. ఇప్పటికైనా మహారాష్ట్ర ప్రభుత్వం మేల్కొనాలి.

# బడుగు బలహీన వర్గాల విద్యార్థులకు ప్రభుత్వం తీపి కబురు

**మొదటిపేజీ తరువాయి -** ఈ మేరకు డైట్ ఛార్జీలు పెంచుతున్నామని వెల్లడించారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలకు లబ్ది చేకూర్చే విషయంలో వారికి కలిగే ప్రయోజనాన్ని పరిగణనలోకి తీసుకోవాలని సీఎం అన్నారు. సంక్షేమ శాఖలకు చెందిన విద్యాసంస్థల్లో చదివే విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలని స్పష్టం చేశారు. అందులోభాగంగా రాష్ట్రంలో పెద్ద ఎత్తున గురుకులాల నిర్మాణం చేపట్టాలని ఆదేశించారు. ప్రభుత్వ విద్యా సంస్థలను కార్పొరేట్‌కు ధీటుగా తీర్చిదిద్దాలని వ్యాఖ్యానించారు. హాస్టళ్ల స్థానంలో గురుకులాల నిర్మాణం చేపట్టేందుకు పెద్దపీట వేయాలని సీఎం ఆదేశించారు. రెసిడెన్షియల్ స్కూళ్లల్లో నెట్‌జీరో విధానాన్ని అమలు చేయడం వల్ల ఎలాంటి ఉపయోగాలు ఉన్నాయో విశ్లేషించాలన్నారు. బయో డైవర్సిటీ పార్కుల తరహాలో గురుకులాలను నిర్వహించాలని సూచించారు. మెరుగైన వసతులు, మౌలిక సదుపాయాలతో గురుకులాలను నిర్మిద్దామన్నారు. అన్ని రెసిడెన్షియల్ స్కూళ్లు, హాస్టళ్ల మెయింటెనెన్స్ గ్రాంట్ ఇవ్వాలని స్పష్టం చేశారు. దీని నిమిత్తం రూ.100 కోట్లు కేటాయిస్తున్నామని వెల్లడించారు.హాస్టళ్లు, గురుకులాల్లో చదివే విద్యార్థులను ఉన్నత విద్య, పోటీ పరీక్షలకు ప్రిపేర్ చేసేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఐఐటీ, ఎన్‌ఐటీ, నీట్ వంటి పోటీ పరీక్షల్లో ప్రతిభ కనబరిచేలా శిక్షణ ఇప్పించాలని తెలిపారు. పోటీ పరీక్షలకు గురుకులాల్లో చదువుతోన్న విద్యార్థులను సిద్ధం చేయాలన్నారు. విద్యతో సమానంగా శిక్షణ అందించాలని తెలిపారు. బెస్ట్ టీచర్స్ నియమించి క్వాలిటీ ట్రైనింగివ్వాలని ఆదేశించారు. హాస్టళ్లు, గురుకులాల్లో చదువుకుంటూ ప్రతిభ కనబరిచే ఇంటర్ విద్యార్థుల కోసం ప్రత్యేక శిక్షణ కేంద్రాలను ఏర్పాటు చేయాలన్నారు. ఈ మేరకు పైలెట్ ప్రాజెక్టు కింద కొన్ని ప్రత్యేక శిక్షణ కేంద్రాలు ప్రారంభించాలని అన్నారు.ఐటీఐ, పాలిటెక్నిక్ కాలేజీలను మ్యాపింగ్ చేసి నైపుణ్యం పెంచి పారిశ్రామిక అవసరాలకు వర్క్‌ఫోర్స్ సిద్ధం చేయాలన్నారు. హాస్టళ్లు, గురుకులాలు, ఆశ్రమ పాఠశాలల్లో విద్యార్థుల ఆరోగ్యాన్ని ఎప్పటికప్పుడు పర్యవేక్షించేలా ఓ వైద్య విభాగాన్ని ఏర్పాటు చేయాలని ఆదేశించారు. సంక్షేమ హాస్టళ్లను ఎన్ఆర్ఐలు అడాప్ట్ చేసుకునేలా వారితో సంప్రదింపులు జరపాలని సూచించారు. సంక్షేమ హాస్టళ్లు, రెసిడెన్షియల్ స్కూళ్లు గురుకులాలు, ఆశ్రమ పాఠశాలల్లో పూర్వ విద్యార్థుల నెట్ వర్కింగ్ చేయాలని తెలిపారు. రెసిడెన్షిల్ స్కూళ్లు, గురుకులాల్లో స్వచ్ఛంధంగా ముందుకు వచ్చి విద్యా, వైద్య సేవలు అందించే వాళ్లకి అవకాశం కల్పించాలని ముఖ్యమంత్రి సూచించారు.పేదలు, బలహీన వర్గాలకు సంక్షేమం అందించడమే కాదు, వారి జీవనోపాధిని మెరుగు పరిచి మరింత ఆదాయాలు సమకూర్చేందుకు అన్ని మార్గాలను అన్వేషించాలని ముఖ్యమంత్రి సూచించారు. ప్రభుత్వం వైపు నుంచి అందించే సంక్షేమం, మెప్మా, డ్వాక్రా పథకాల ద్వారా ఉపాధి కల్పించడంతోపాటు, పీ4 ద్వారా సాయం అందాలని తెలిపారు. వ్యవసాయం, ఉద్యానరంగం, పాడి పరిశ్రమ, జీ రామ్ జీ సహా వివిధ సంక్షేమ పథకాల ద్వారా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు మేలు చేకూర్చాలన్నారు. సాస్కి, పూర్వోదయ, జీ రామ్ జీ వంటి పథకాల లబ్ది బడుగు వర్గాలకు దక్కేలా చూడాలని ఆదేశించారు. ఉద్యాన, రబ్బర్, కాఫీ, పసుపు వంటి పంటల సాగును ప్రోత్సహించి ఆ వర్గాల రైతులకు లబ్ధి కలిగేలా చూడాలని అన్నారు. ఇప్పటికే కొన్ని విధానాల ద్వారా వారి జీవన స్థితిగతులను మెరుగు పరిచేలా పాలసీలు తీసుకున్నట్లు వివరించారు.లిక్కర్ షాపుల్లో కల్లుగీత వృత్తిదారులకు, క్వారీల్లో వడ్డెర్లకు కోటా పెట్టామని వెల్లడించారు. నాయీ బ్రహ్మణులు, మత్స్యకారులు, చేనేత కార్మికులకు ఇలా వివిధ వర్గాలకు ఆర్థికంగా సాయం చేస్తున్నామన్నారు. ప్రభుత్వ పరంగా అందించే సాయమే కాకుండా వారి అభివృద్ధికి ఏమేం చర్యలు తీసుకోవానే అంశంపై ప్రతిపాదనలు సిద్దం చేయాలనీ తెలిపారు. ఈ మేరకు వివిధ కుల కార్పొరేషన్ల బై లాస్ మార్చే అంశాన్ని పరిశీలిం చాలన్నారు.బ్రాహ్మణ కార్పొరేషన్ విధానాలను మిగిలిన కార్పొరేషన్లు కూడా అవలంబించేలా చర్యలు తీసుకోవాలన్నారు. జీ రామ్ జీ ద్వారా అంగన్వాడీ భవనాలను నిర్మించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ సమీక్ష సందర్భంగా సంక్షేమ శాఖల్లో తాము తీసుకున్న చర్యలను మంత్రులు, అధికారులు వివరించారు. కొందరు విద్యార్థు లు హోం సిక్‌కు గురవుతున్నారని అలాంటి విద్యార్థుల కోసం తల్లిదండ్రులతో మాట్లాడేలా స్మార్ట్ కార్డ్ బేస్డ్ టెలిఫోన్ వ్యవస్థ ఏర్పాటు చేశామని తెలిపారు. తల్లిదండ్రులతో రోజులో 4 నిమిషాలు మాట్లాడుకునే సదుపాయం కల్పించామని తెలిపారు.సాస్కి కింద సోషల్ వెల్ఫేర్, ట్రైబల్ వెల్ఫేర్ స్కూళ్లలో రూ.120 కోట్లతో ఆర్వో ప్లాంట్లు, టాయిలెట్స్ సహా ఇతర మౌలిక వసతులను కల్పించే పనులు చేపట్టామని అధికారులు వివరించారు. ఆర్వో ప్లాంట్ల ఏర్పాటు పూర్తి చేశామని ఈ నెలాఖరు నాటికి టాయిలెట్ల నిర్మాణం పూర్తి చేస్తామని అన్నారు. సమీక్షలో మంత్రులు డీబీవీ స్వామి, సవిత, సంధ్యారాణి,ఎన్ఎండీ ఫరూక్,మైనార్టీ సంక్షేమ సలహాదారు మహ్మద్ షరీఫ్ సహా వివిధ సంక్షేమ శాఖల ఉన్నతాధికారులు హాజరయ్యారు.

## మోదీకి ఇండోనేషియా మరో అరుదైన గౌరవం

**మొదటిపేజీ తరువాయి -** మూడు రోజుల అధికారిక పర్యటన ముగించుకుని ఇండోనేషియా నుంచి ఆస్ట్రేలియాకు బయలుదేరిన ప్రధాని నరేంద్ర మోదీకి ఆ దేశం నుంచి అరుదైన గౌరవం దక్కింది. మోదీ ప్రయాణిస్తున్న ప్రత్యేక విమానానికి ఇండోనేషియా వైమానిక దళానికి చెందిన ఐదు యుద్ధ విమానాలు ఎస్కార్ట్‌గా వెళ్లాయి. రెండు దేశాల మధ్య బలపడుతున్న సంబంధాలకు ఇది ప్రతీకగా నిలిచింది. ఇండోనేషియా గగనతలంలో మోదీ విమానంతో పాటు యుద్ధ విమానాలు సమాంతరంగా ప్రయాణించిన దృశ్యాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. మోదీ జకార్తాకు చేరుకున్న సమయంలోనూ ఆయన విమానానికి ఇండోనేషియా ఫైటర్ జెట్లు ఎస్కార్ట్‌గా వచ్చి స్వాగతం పలికాయి.పర్యటన ముగిసిన తర్వాత ఇండోనేషియా అధ్యక్షుడు ప్రబోవో సుబియాంటో స్వయంగా విమానాశ్రయానికి వచ్చి మోదీకి వీడ్కోలు పలికారు. విమానంలోకి ఎక్కే ముందు ఇద్దరు నాయకులు ఆత్మీయంగా ఆలింగనం చేసుకున్నారు.ఈ పర్యటనతో భారత్, ఇండోనేషియా మధ్య పలు కీలక రంగాల్లో సహకారానికి కొత్త అవకాశాలు ఏర్పడ్డాయని ప్రధాని మోదీ తెలిపారు. రక్షణ, భద్రత, సముద్ర సహకారం, కృత్రిమ మేధ, డిజిటల్ ఇన్నోవేషన్ వంటి రంగాల్లో కలిసి పనిచేసే దిశగా కీలక అడుగులు పడ్డాయని పేర్కొన్నారు.తనకు ఆత్మీయ స్వాగతం పలికిన ఇండోనేషియా ప్రజలకు, అధ్యక్షుడు ప్రబోవో సుబియాంటోకు మోదీ కృతజ్ఞతలు తెలిపారు. ఇరు దేశాల భాగస్వామ్యాన్ని మరింత ఉన్నత స్థాయికి తీసుకెళ్లేందుకు ఆయన చూపిన వ్యక్తిగత చొరవను ప్రత్యేకంగా అభినందించారు.

## కుండపోత వర్షం ఢిల్లీలో కుప్పకూలిన నాలుగంతస్తుల భవనం



**మొదటిపేజీ తరువాయి -** దేశ రాజధాని ఢిల్లీని కుండపోత వర్షాలు అతలాకుతలం చేస్తున్నాయి. బుధవారం సాయంత్రం కురిసిన భారీ వర్షం ధాటికి వాయువ్య ఢిల్లీలోని రోహిణి ప్రాంతంలో ఒక నాలుగంతస్తుల భవనం కుప్పకూలింది. ఈ ప్రమాద సమయంలో శిథిలాల కింద పలువురు చిక్కుకొని ఉండవచ్చని అధికారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం ఘటనా స్థలంలో సహాయక చర్యలు ముమ్మరంగా కొనసాగుతున్నాయి.రోహిణి సెక్టార్-16లోని ఒక ఎంసీడీ పాఠశాల సమీపంలో బుధవారం సాయంత్రం ఈ ఉదంతం చోటుచేసుకుంది. సమాచారం అందిన వెంటనే ఢిల్లీ అగ్నిమాపక శాఖకు చెందిన నాలుగు సహాయక బృందాలు ఘటనా స్థలానికి చేరుకున్నాయి. కూలిపోయిన భవనం అత్యంత పురాతనమైనదని, ప్రమాద జరిగిన సమయంలో అక్కడ కొన్ని నిర్మాణ పనులు కూడా జరుగుతున్నట్లు ప్రాథమికంగా తెలిసింది. భారీ వర్షం కారణంగానే ఈ భవనం కూలిపోయి ఉంటుందని అధికారులు భావిస్తున్నారు.అగ్నిమాపక సిబ్బందితో పాటు పోలీసులు, పౌర సరఫరాల అధికారులు కూడా సహాయక చర్యల్లో నిమగ్నమయ్యారు. శిథిలాలను తొలగిస్తూ, లోపల ఎవరైనా చిక్కుకున్నారేమోనని గాలింపు చర్యలు చేపట్టారు. అయితే, ఈ ప్రమాదంలో చిక్కుకున్న వారి సంఖ్య గానీ, మృతులు లేదా గాయపడిన వారి వివరాలు గానీ ఇప్పటివరకు అధికారికంగా వెల్లడి కాలేదు.

# తెలంగాణపై ప్రేమ ఉంటే గోదావరి బెల్ట్ కోల్‌బ్లాక్‌లు సింగరేణికి కేటాయించాలి

**మొదటిపేజీ తరువాయి -** అవసరాల దృష్ట్యా కేంద్రానికి లేఖ రాస్తే కేంద్రం కేటాయించిందని చెప్పుకొచ్చారు. గతంలోనే కేటాయిస్తే 2013 నుంచి ఇప్పటివరకు పెండింగ్‌లో పెట్టారని భట్టి విక్రమార్క పేర్కొన్నారు. బ్లాక్ కేటాయింపు జరిగిందని అయితే మైనింగ్ లీజు కోసం అనుమతి ఇవ్వలేదని తెలిపారు.కొత్త చట్టం ప్రకారం తాడిచర్ల-2 సింగరేణికి ఇవ్వబోమని ఆయన అన్నారు. యాక్టు రావడానికి ముందే సింగరేణికి తాడిచర్ల-2 కేటాయించారని తెలిపారు. ప్రధానిని, కేంద్రమంత్రులను కలిసి వాస్తవాలను వారి ముందుంచామన్నారు. మైనింగ్ లీజు పెండింగ్ పెట్టడం వల్ల సింగరేణికి నష్టమని వివరించామని చెప్పారు. గోదావరి బెల్ట్ కోల్ బ్లాక్‌లను వేలం లేకుండా సింగరేణికి ఇవ్వాలని కిషన్‌రెడ్డిని కోరామన్నారు. వేలం లేకుండా ఇస్తే కొత్త బ్లాక్‌లు కేటాయించినట్లు అవుతుందని తెలిపారు.2022లో గిరిజన ప్రాంతంలో వేలం వేసి ప్రైవేటుకు అప్పగించారని ప్రస్తావించారు. గిరిజన ప్రాంతంలో మైనింగ్ ప్రక్రియను గిరిజనులు లేదా ప్రభుత్వ సంస్థలు మాత్రమే చేయాలనేది చట్టమని గుర్తు చేశారు. 2022లో కోయగూడెం బ్లాక్-3 వేలం వేసి ప్రైవేటు సంస్థకు అప్పగించారని అన్నారు. నాటి నుంచి బ్లాక్-3లో మైనింగ్ చేయడానికి వీలులేదన్నారు. ఈ నేపథ్యంలో ఇది పెండింగ్‌లో ఉందన్నారు. సింగరేణికి తాడిచర్ల-2 అప్పగించక



పోవడం వల్ల వేల కోట్లు నష్టం వచ్చిందని భట్టి విక్రమార్క అన్నారు. సీఎం ఒత్తిడికి స్పందించి మైనింగ్ అనుమతి ఇవ్వడం సంతోషకరమని చెప్పారు. మైనింగ్ అనుమతించారు అయితే కోల్‌బ్లాక్ కేటాయించామనడం సరికాదని ఆయన అన్నారు. తెలంగాణపై ప్రేమ ఉంటే గోదావరి బెల్ట్ కోల్‌బ్లాక్‌లు సింగరేణికి కేటాయించాలని కోరారు.తాడిచెర్ల-2 బొగ్గు గనులను వేలం లేకుండానే సింగరేణి సంస్థకు కేటాయిస్తున్నట్లు కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి జి కిషన్ రెడ్డి వెల్లడించారు. ఎమ్మెల్యేలు, ఎంపీలు, కార్మిక సంఘాలు అలాగే సింగరేణి యాజమాన్యం నుంచి విజ్ఞప్తులు వచ్చాయని ఆయన పేర్కొన్నారు. ఈ మేరకు ప్రధానమంత్రి నరేంద్ర మోదీతో పలుమార్లు చర్చించినట్లు వివరించారు. చివరగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆయన వెల్లడించారు. 2020 తర్వాత ప్రభుత్వ రంగ సంస్థకు వేలం లేకుండా బొగ్గు గనులను కేటాయించడం ఇదే తొలిసారని ఆయన తెలిపారు. సమగ్ర న్యాయపరమైన సలహాలు తీసుకున్న తర్వాతే తాడిచెర్ల-2 గనుల ఫైల్‌పై సంతకం చేసినట్లు ఆయన వివరించారు.గతంలో ప్రధానమంత్రిగా మన్మోహన్ సింగ్ ఉన్న సమయంలో అప్పటి ఉమ్మడి రాష్ట్ర ముఖ్యమంత్రులు తాడిచెర్ల-2 గనులను సింగరేణికి కేటాయించాలని కేంద్రానికి లేఖలు రాశారు. అయినా అప్పట్లో కేంద్రం నుంచి ఎలాంటి స్పందనా రాలేదు, ఎటువంటి చర్యలూ తీసుకోలేదు. కానీ నేడు తమ ప్రభుత్వం ఆ పనిని పూర్తి చేసిందని కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి జి కిషన్ రెడ్డి పేర్కొన్నారు. సింగరేణిలో ఉత్పత్తి తగ్గుతోందని ప్రస్తావించారు. ఉపాధి అవకాశాలు తగ్గుముఖం పట్టాయన్నారు. వీటితో పాటు అప్పుల భారం కూడా పెరుగుతోందని చెప్పుకొచ్చారు. ఈ నేపథ్యంలో వేలం ద్వారా కాకుండా నామినేషన్ పద్ధతిలో తాడిచెర్ల-2 బొగ్గు గనులను కేటాయించడం సంతోషకరమైన విషయమని ఆయన పేర్కొన్నారు.

# నాన్నా.. మీరే నా స్ఫూర్తి

**మొదటిపేజీ తరువాయి -** వైసీపీ శ్రేణులు, కాంగ్రెస్ నాయకులు ఆయనకు ఘనంగా నివాళులర్పిస్తున్నారు.కుటుంబ సభ్యులతో కలిసి వైఎస్సార్ ఘాట్‌ను సందర్శించి, అక్కడ జరిగిన ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు. అనంతరం తన తండ్రి సమాధి వద్ద పుష్పగుచ్ఛాలు ఉంచి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో వైఎస్ విజయమ్మ, వైఎస్ భారతితో పాటు వైసీపీకి చెందిన ముఖ్య నేతలు, మాజీ ప్రజాప్రతినిధులు, అభిమానులు పెద్ద సంఖ్యలో హాజరై అంజలి ఘటించారు.నిరుపేదల సంక్షేమం, ఉచిత విద్య, వైద్యం, ఉచిత విద్యుత్, సాగునీటి ప్రాజెక్టుల ద్వారా వైఎస్సార్ చేసిన సేవలను ఈ సందర్భంగా నేతలు కొనియాడారు. ప్రజల హృదయాల్లో నిలిచిన నేతగా రాజన్న ఎప్పటికీ స్ఫూర్తిదాయకుడని వారు స్మరించుకున్నారు. వైఎస్సార్ జయంతి సందర్భంగా రాష్ట్రంలోని వైసీపీ నేతలు, కార్యకర్తలు వైఎస్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. పలు చోట్ల రక్తదాన శిబిరాలు, అన్నదాన కార్యక్రమాలు, ఉచిత వైద్య శిబిరాలు, మొక్కలు నాటే కార్యక్రమాలను నిర్వహించారు.

# వైఎస్సార్ కు మరణం లేదు

**మొదటిపేజీ తరువాయి -** చేసినా... ఆయన చేసిన అభివృద్ధి, అమలు చేసిన పథకాలు రెండు తెలుగు రాష్ట్రాల్లోని ప్రతి గడపకు అందాయని ప్రశంసించారు. ఆరోగ్యశ్రీ, ఫీజు రీయింబర్స్‌మెంట్, ఉచిత విద్యుత్, జలయజ్ఞం వంటి పథకాలను వైఎస్సార్ మనసు పెట్టి అమలు చేశారని తెలిపారు. ఆయన మరణాన్ని తట్టుకోలేక ఆ సమయంలో 700 మంది ఆయన వెంటే వెళ్లిపోయారని అన్నారు.

## ఇరాన్‌పై మరోసారి దాడి చేస్తాం.. ట్రంప్ సంచలన ప్రకటన

**మొదటిపేజీ తరువాయి -** అమెరికా మరోసారి ఇరాన్‌పై దాడులకు సిద్ధమవుతోందని అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించారు. గత రాత్రి భారీ దాడులు నిర్వహించామని తెలిపారు. అవసరమైతే మరోసారి కూడా అదే స్థాయిలో దాడులు చేస్తామని స్పష్టం చేశారు. ఇరాన్ తీరుతెన్నులు మారకపోవడంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించారు.టర్కీలోని అంకారాలో నాటో సదస్సు సందర్భంగా మీడియాతో మాట్లాడిన ట్రంప్.. ఇరాన్‌పై మరోసారి సైనిక చర్య చేపట్టే అవకాశాన్ని ప్రస్తావించారు. గత రాత్రి తీవ్ర స్థాయిలో దాడులు నిర్వహించామని, అవసరమైతే ఈ రాత్రి కూడా అదే తరహా దాడులు చేస్తామని చెప్పారు. హర్మూజ్ జలసంధిలో వాణిజ్య నౌకలపై ఇరాన్ దాడులు కొనసాగుతుండటమే దీనికి కారణమని ఆరోపించారు.ఇరాన్ అమెరికా సైనిక స్థావరాలపై దాడులు చేసిన తర్వాత కాల్పుల విరమణ కొనసాగబోదని ట్రంప్ వ్యాఖ్యానించారు. తన దృష్టిలో చర్చలు జరపడం వృథా అని అభిప్రాయపడ్డారు. అయినప్పటికీ చర్చలు కొనసాగించేందుకు అమెరికా సిద్ధంగా ఉంటుందని తెలిపారు. అయితే వాటి ఫలితాలపై మాత్రం సందేహం వ్యక్తం చేశారు.తాజా పరిణామాలతో పశ్చిమాసియాలో మరోసారి యుద్ధం ముదిరుతుందన్న ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. ట్రంప్ వ్యాఖ్యలతో పరిస్థితి మరింత ఉద్రిక్తంగా మారింది. అంతర్జాతీయ మార్కెట్‌లో బ్రెంట్ ముడి చమురు ధరలు ఐదు శాతానికి పైగా పెరిగాయి. స్టాక్ మార్కెట్లు కుప్పకూలాయి.

## ఏపీలో ఫుట్‌వేర్ హబ్‌కు అడుగులు

**మొదటిపేజీ తరువాయి -**

ఇంటిగ్రేటెడ్ ఫుట్‌వేర్ కాంపోనెంట్, మెటీరియల్ మ్యానుఫ్యాక్చరింగ్ ఫెసిలిటీని కూడా ఏర్పాటు చేయాలని కోరారు. దీంతో దిగుమతులపై ఆధారపడటం తగ్గడంతో పాటు ఉత్పత్తి వ్యయాలు తగ్గుతాయని వివరించారు.ప్రీమియం బ్రాండ్ల కోసం పెర్ఫార్మెన్స్ టెక్నాలజీ, ఏఐ ఆధారిత కస్టమైజేషన్, సస్టెయినబుల్ మెటీరియల్స్‌పై పరిశోధనలు జరిగే నెక్స్ట్ జనరేషన్ అథ్లెటిక్ ఫుట్‌వేర్ ఆర్అండ్‌డీ, ఆసియా-పసిఫిక్ ఇన్నోవేషన్ సెంటర్‌ను కూడా ఆంధ్రప్రదేశ్‌లో ఏర్పాటు చేయాలని సూచించారు.ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్ణాటక, తమిళనాడుకు సేవలందించేలా సమగ్ర దక్షిణ భారత తయారీ క్లస్టర్‌ను అభివృద్ధి చేయాలని లోకేశ్ ప్రతిపాదించారు. ఇందులో కుప్పంలో ప్రధాన కార్యాలయం, తిరుపతిలో విడిభాగాల తయారీ కేంద్రం, విశాఖపట్నంలో డిజైన్, కార్పొరేట్, లాజిస్టిక్స్ విభాగాలను ఏర్పాటు చేయాలని సూచించారు. అలాగే హ్వాసంగ్ ఫుట్‌వేర్‌కు చెందిన టైర్-1, టైర్-2 విక్రేతలతో ఏపీలో సప్లయర్ సమావేశం నిర్వహించాలని కోరారు.సమావేశంలో హ్వాసంగ్ కార్పొరేషన్ బిజినెస్ సీఈవో హెయో సియోంగ్-రియోంగ్ స్పందించారు. కుప్పంలో రూ.900 కోట్ల పెట్టుబడితో గ్రీన్‌ఫీల్డ్ నాన్-లెదర్ ఫుట్‌వేర్ ప్లాంట్‌ను ఇప్పటికే ప్రకటించినట్లు తెలిపారు. అడిడాస్‌తో పాటు పలు అంతర్జాతీయ బ్రాండ్లకు ఓఈఎం సరఫరాదారుగా ఉన్న ఈ ప్లాంట్‌లో ఏడాదికి 2 కోట్ల జతల స్పోర్ట్స్ షూలను తయారు చేయనున్నట్లు చెప్పారు. మొదట ఎగుమతులను లక్ష్యంగా పెట్టుకుని ఉత్పత్తి ప్రారంభిస్తామని, తర్వాత దేశీయ మార్కెట్‌కు కూడా విస్తరిస్తామని వెల్లడించారు. పుణే, చెన్నై, అనంతపురం జిల్లా గూడపల్లిలో ఆటో విడిభాగాల తయారీ కార్యకలాపాలు కొనసాగుతున్నాయని చెప్పారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం చేసిన తాజా ప్రతిపాదనలను పరిశీలిస్తామని స్పష్టం చేశారు.

# వివరణ ఎందుకు ఇస్తా?

**మొదటిపేజీ తరువాయి -** జరిపి చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రిని ఆమె కోరారు. సురేఖ చేసిన ఫిర్యాదుపై కడియం శ్రీహరి తీవ్రంగా స్పందించారు. "నేను ఏ తప్పూ చేయలేదు. అలాంటప్పుడు ఎవరికీ వివరణ ఇవ్వాల్సిన అవసరం నాకు లేదు" అని ఆయన తేల్చిచెప్పారు. తాను ఎప్పుడూ ప్రోటోకాల్‌కు లోబడే పనిచేస్తానని స్పష్టం చేసిన



కడియం... ఇదంతా కేవలం అవగాహన లోపం వల్లనే జరుగుతోందని అన్నారు.దేవాదాయ శాఖపై సమీక్ష నిర్వహించే హక్కు తనకు లేదనే విషయం ఒక ప్రజాప్రతినిధిగా తనకు తెలుసని కడియం శ్రీహరి అన్నారు. "నా నియోజకవర్గంలోని పలు ఆలయాల సమస్యల పరిష్కారం కోసం మాత్రమే సంబంధిత శాఖ కమిషనర్, అధికారులు, ఆలయ చైర్మన్లను కలిశాను. అక్కడ ఎలాంటి అధికారిక సమీక్ష నిర్వహించలేదు. కేవలం క్షేత్రస్థాయి సమస్యలను మాత్రమే వారి దృష్టికి తీసుకెళ్లాను" అని వివరించారు. దేవాదాయ శాఖలో నిధులు లేవని చెప్పడంతో... ఆలయాల అభివృద్ధికి సంబంధించిన ఎస్టిమేషన్‌లను (అంచనాలను) మాత్రమే కోరినట్లు వెల్లడించారు.ఈ వివాదంపై కొండా సురేఖను ఉద్దేశించి కడియం శ్రీహరి పరోక్షంగా ఘాటు వ్యాఖ్యలు చేశారు. "రాజకీయాల్లో కొందరు కొత్త అలవాట్లు నేర్చుకున్నారు. నిత్యం ఏదో ఒక కాంట్రవర్సీ క్రియేట్ చేస్తూ... వార్తల్లో ఉంటూ ప్రజల మధ్య బతకాలని చూస్తున్నారు" అని ఎద్దేవా చేశారు. తన నియోజకవర్గ సమస్యల పరిష్కారం కోసం తాను ఎవరినైనా కలుస్తానని... అవసరమైతే మంత్రులను, ముఖ్యమంత్రిని కూడా కలిసి నిధులు సాధించుకుంటానని స్పష్టం చేశారు.

# నాకు మంత్రి పదవి ఇవ్వండి.. నీళ్లు తెచ్చి చూపిస్తా

**మొదటిపేజీ తరువాయి -** మోటార్లను ఆన్ చేసి ఎల్లంపల్లికి నీటిని తరలిస్తానని ఆయన పేర్కొన్నారు. ఒకవేళ ఈ ప్రక్రియలో విఫలమైతే తాను రాజకీయాల నుంచి శాశ్వతంగా తప్పుకుంటానని సంచలన ప్రకటన చేశారు.మంగళవారం తెలంగాణ భవన్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో హరీశ్ రావు పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా పలు అంశాలను వివరించారు. తుమ్మిడిహట్టి ప్రాజెక్టులో కాంగ్రెస్ నేతలు రూ.2,328 కోట్ల అవినీతికి పాల్పడ్డారని ఆయన ఆరోపించారు. బ్యారేజీని 152 మీటర్ల ఎత్తులో నిర్మించేందుకు మహారాష్ట్ర ప్రభుత్వం గతంలోనే అనుమతినిచ్చిందని, ఆ ఒప్పంద పత్రాలను ప్రభుత్వం బహిర్గతం చేయాలని డిమాండ్ చేశారు. తాను చెబుతున్న విషయాలు అబద్ధమని తేలితే తన పదవికి రాజీనామా చేస్తానని స్పష్టం చేశారు.రాష్ట్రంలోని ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వంపై హరీశ్ రావు తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. నదుల్లో నీటి లభ్యత ఉన్నప్పటికీ జలాశయాలను నింపడం లేదని, దేవాదుల పంపులను నడపడంలో ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని మండిపడ్డారు. వరంగల్ జిల్లాలో 90 శాతం చెరువులు ఎండిపోవడం ప్రభుత్వ నేరపూరిత నిర్లక్ష్యానికి నిదర్శనమని ఆయన ధ్వజమెత్తారు.నిపుణుల సలహాలు, కేంద్ర ప్రభుత్వ అనుమతులతోనే తాము కాళేశ్వరం ప్రాజెక్టును నిర్మించామని, ఇందులో ఎలాంటి రాజకీయ కోణం లేదని హరీశ్ రావు సమర్థించుకున్నారు. తమ ప్రభుత్వంపై కాంగ్రెస్ అసత్య ప్రచారం చేస్తోందని విమర్శించారు. కాళేశ్వరం ప్రాజెక్టులో అవకతవకలు జరిగాయని, దీనికి కేసీఆర్, హరీశ్ రావులే బాధ్యులని జ్యుడీషియల్ కమిషన్ నివేదిక ఇవ్వడం,



అలాగే సీబీఐ విచారణకు డిమాండ్ వస్తున్న నేపథ్యంలో హరీశ్ రావు ఈ విధంగా ఎదురుదాడికి దిగారు.

# కనీస మద్దతు ధరకు పొగాకు కొనాల్సిందే

**రైతుల్ని ఇబ్బంది పెట్టే కంపెనీలపై కఠిన చర్యలు**

**టొబాకో బోర్డుపైనా సీఎం చంద్రబాబు అసంతృప్తి**

**ఇండెంట్‌కు మించి సాగుతో ధర తగ్గిందన్న అధికారులు**





అమరావతి,**జులై 08 .అక్షర టైమ్స్ :** (ఏపీ స్టేట్ బ్యూరో, షేక్. కరిముల్లా) రైతుల్లో నమ్మకం, ధైర్యం కల్పించేలా వెంటనే పొగాకు కొనుగోళ్లు పెద్దఎత్తున జరపాలని, ఇందుకోసం వేలం ప్రక్రియను వేగవంతం చేయాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పొగాకు కంపెనీలకు స్పష్టం చేశారు. ట్రేడర్లు కొనుగోళ్లు తగ్గించడం సరికాదని, కర్నాటకలో తలెత్తని సమస్య ఏపీలో ఎందుకు ఉత్పన్నం అవుతోందని సీఎం ప్రశ్నించారు. టొబాకో బోర్డు పనితీరుపైనా అసంతృప్తి వ్యక్తం చేశారు. రైతులను ఇబ్బందిపెట్టేలా నడుచుకుని కంపెనీలు గుడ్ విల్ పోగొట్టుకోవద్దని, కఠిన చర్యలు తీసుకోవాల్సి వస్తుందని హెచ్చరించారు. రైతులు ప్రత్యామ్నాయ పంటలకు మళ్లితే... తలెత్తే పరిస్థితి గురించి పొగాకు కంపెనీలు ఆలోచన చేయాలన్నారు. సచివాలయంలో బుధవారం పొగాకు కొనుగోళ్ల ప్రస్తుత స్థితిపై అధికారులు, ట్రేడర్లతో ముఖ్యమంత్రి సమీక్ష నిర్వహించారు. మొత్తం 28 కంపెనీలు సమర్పించిన ఇండెంట్ వివరాలు, ప్రస్తుతం జరిపిన కొనుగోళ్ల శాతాన్ని సమీక్షలో ముఖ్యమంత్రి పరిశీలించారు. ఇండెంట్ ఇచ్చి కొనుగోలు చేయకుండా ప్రభుత్వానికి సహకరించకపోతే సహించేది లేదని హెచ్చరించారు. రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిన కనీస మద్దతు ధర కిలోకు రూ.200 తగ్గకుండా, మొత్తం కొనుగోళ్లు జరిపితీరాలన్నారు. ముఖ్యంగా అతిపెద్ద మాన్యుఫ్యాక్చరింగ్ కంపెనీలు అయిన ఐటీసీ లిమిటెడ్, గాడ్ ఫ్రే ఫిలిప్స్ (ఐ) లిమిటెడ్, వీఎస్టీ ఇండస్ట్రీస్ 95.50 మిలియన్ మెట్రిక్ టన్నుల పంట కొనుగోళ్లకు ఇండెంట్ ఇవ్వగా... ఇప్పటివరకు కేవలం 17.6 మిలియన్ మెట్రిక్ టన్నుల పొగాకు మాత్రమే కొనుగోలు చేయడాన్ని తప్పుబట్టారు. ఈ సీజన్లో ఐదవ సారి ఇదే అంశంపై సమీక్ష నిర్వహించాల్సి వచ్చిందంటే కంపెనీల నిర్లక్ష్యం స్పష్టంగా కనిపిస్తోందన్నారు. రైతులు డిమాండ్‌కు మించి పొగాకు సాగు చేయడం ప్రస్తుత సమస్యకు కారణమని ట్రేడర్లు సీఎంకు వివరించారు. ఇప్పటికే అవసరానికి మించి కొనుగోళ్లు చేశామని... దానికి తోడు ఎగుమతులు కూడా తగ్గాయని తెలిపారు. అయినప్పటికీ కొనుగోళ్లు కొనసాగిస్తామని కంపెనీల ప్రతినిధులు వెల్లడించారు. పొగాకు బహిరంగ మార్కెట్ లేకపోవడం సమస్యను తీవ్రం చేశాయని అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. అలాగే కంపెనీలు 142 మిలియన్ కేజీలకు ఇండెంట్ ఇవ్వగా, రైతులు 232 మిలియన్ కేజీల పొగాకు ఉత్పత్తి చేశారన్నారు. దీంతో ధర పతనం కావడం, కొనుగోళ్లు లేకపోవడం జరిగిందని తెలిపారు. ఈ సమీక్షలో మంత్రులు అచ్చెన్నాయుడు, ఆనం రామనారాయణ రెడ్డి, గొట్టిపాటి రవికుమార్, డోలా బాలవీరాంజనేయ స్వామి, ఉమ్మడి ప్రకాశం జిల్లా ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## హాస్టళ్లలో ఉంటున్న విద్యార్థులను తమ సొంత బిడ్డలుగా భావించాలి: కలెక్టర్ పి. రాజాబాబు





ఒంగోలు,**జులై 08 .అక్షర టైమ్స్ :** ప్రభుత్వ హాస్టళ్లలో ఉంటున్న విద్యార్థుల సంక్షేమం, విద్య, ఆరోగ్యం పట్ల ఎంత మాత్రమూ నిర్లక్ష్యం ఉండకూడదని జిల్లా కలెక్టర్ పి.రాజాబాబు స్పష్టం చేశారు. కేవలం విద్యార్థులుగా కాకుండా తమ సొంత బిడ్డలుగా భావించి వారి సర్వతోముఖాభివృద్ధికి అధికారులు దృష్టి సారించాలని ఆయన దిశా నిర్దేశం చేశారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, దివ్యాంగ, సాంఘిక సంక్షేమ రెసిడెన్షియల్ విద్యా సంస్థలలో పనిచేస్తున్న అధికారులు, సిబ్బందితో బుధవారం ప్రకాశం భవనంలో ఆయన ప్రత్యేక సమావేశం నిర్వహించారు. శాఖాపరంగా తీసుకుంటున్న చర్యలను, గత విద్యా సంవత్సరం పదవ తరగతి పరీక్షలలో సాధించిన ప్రగతిని సంబంధిత ఉన్నతాధికారులు ఈ సందర్భంగా కలెక్టరుకు వివరించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ సంక్షేమ హాస్టళ్లలో పేద బిడ్డలు ఉంటున్నారని, వారి పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే ఊరుకోనని స్పష్టం చేశారు. ప్రవర్తన, పనితీరు సక్రమంగా లేకపోతే కఠిన చర్యలు తీసుకుంటానని ఆయన హెచ్చరించారు. హాస్టళ్ల నిర్వహణపై ప్రభుత్వం ఐ.వి.ఆర్.ఎస్. ఫోన్ కాల్స్ ద్వారా ప్రజల అభిప్రాయాలు సేకరిస్తున్నందున సానుకూల అభిప్రాయం కనీసం 90 శాతానికి తగ్గకుండా వచ్చేలా సిబ్బంది, అధికారులు పనిచేయాలని కలెక్టర్ ఆదేశించారు. విద్యార్థుల తల్లిదండ్రులతో తరచుగా మాట్లాడుతూ విద్య, ఆరోగ్యపరమైన విషయాలలో వారి బిడ్డల పురోగతిని వివరించాలన్నారు. గత ఏడాది ‘ వన్ ఆఫీసర్ – వన్ ఇన్స్టిట్యూట్ ‘ కార్యక్రమం ద్వారా పదో తరగతిలో మంచి ఫలితాలు సాధించామన్నారు. ఈ విద్యా సంవత్సరంలో మరింత మెరుగైన ఫలితాలు రాబట్టేలా ఇప్పటి నుంచే దృష్టి పెట్టాలని అధికారులకు కలెక్టర్ చెప్పారు. హాస్టళ్లలో ప్రవేశాలు పెరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. మౌలిక వసతులను కల్పించడంపై ప్రత్యేక దృష్టి సారించాలని, దాతల సహాయం తీసుకోవాలని ఆయన చెప్పారు. కొన్నిచోట్ల వంట మనుషుల కొరత ఉందని అధికారులు ఈ సందర్భంగా కలెక్టర్ దృష్టికి తెచ్చారు. ఈ సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని రాజాబాబు హామీ ఇచ్చారు. ఉన్నతాధికారులు కూడా ఫీల్డ్ విజిట్ చేయటం ద్వారా క్షేత్రస్థాయి పరిస్థితిని నిరంతరం పరిశీలిస్తూ ఉండాలని కలెక్టర్ చెప్పారు. ఈ సమావేశంలో జిల్లా సాంఘిక సంక్షేమ అధికారి లక్ష్మానాయక్, గిరిజన సంక్షేమ అధికారి వరలక్ష్మి, బీసీ సంక్షేమ అధికారి నిర్మల జ్యోతి, దివ్యాంగుల సంక్షేమ శాఖ సహాయ సంచాలకులు సువార్త, సాంఘిక సంక్షేమ రెసిడెన్షియల్ పాఠశాలల కోఆర్డినేటర్ జయ, ఏపీ ఈడబ్ల్యుఐడీసీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ భాస్కర్ బాబు, ఆయా శాఖల మండల స్థాయి సంక్షేమ అధికారులు, హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్లు, రెసిడెన్షియల్ పాఠశాలల ప్రిన్సిపాళ్లు పాల్గొన్నారు.

## గోకవరంలో ఘనంగా దివంగత నేత డాక్టర్ వైఎస్ రాజశేఖర్రెడ్డి జయంతి వేడుకలు







గోకవరం,**జులై 08 .అక్షర టైమ్స్ :** మండల కేంద్రమైన గోకవరం పాత బస్టాండ్ వద్ద ఉన్న డాక్టర్ వైయస్ రాజశేఖర్ రెడ్డి విగ్రహం వద్ద ఎంపీపీ సుంకర శ్రీవల్లి వీరబాబు ఆధ్వర్యంలో దివంగత నేత డాక్టర్ వైయస్ రాజశేఖర్ రెడ్డి 77వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మాజీమంత్రి, జగ్గంపేట నియోజకవర్గం వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ తోట నరసింహం తనయులు ఉభయగోదావరి జిల్లాల వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ విద్యార్థి విభాగం వర్కింగ్ ప్రెసిడెంట్ తోట శ్రీ రాంజీ పాల్గొని డాక్టర్ వైయస్ రాజశేఖర్ రెడ్డి విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. నాయకులు కార్యకర్తలు అభిమానుల సమక్షంలో భారీ కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. డాక్టర్ వైయస్ రాజశేఖర్ రెడ్డి పుట్టినరోజు సందర్భంగా గోకవరం ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు, గర్భిణీ,బాలింతలు రొట్టెలు, పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా తోట శ్రీరాంజీ మాట్లాడుతూ డాక్టర్ వైయస్ రాజశేఖర్ రెడ్డి ముఖంలో చెరగని చిరునవ్వు, నడకలో తెలుగుదనం ఉట్టి పడే రాజసం, పేదల గుండెల్లో ఎప్పటికీ జరగని జ్ఞాపకం మన అభివృద్ధి ప్రదాత డాక్టర్ వైయస్ రాజశేఖర్ రెడ్డి అని కొనియాడారు. ప్రజా సంక్షేమ పాలనకు సరికొత్త భాష్యం చెప్పిన డాక్టర్ వైయస్ రాజశేఖర్ రెడ్డి అని ఆయన చేసిన అభివృద్ధి పేదవాడి గుండెల్లో చిరస్థాయిగా నిలిచిందని తెలిపారు. లక్షలాది మంది ప్రాణాలు కాపాడిన ఆరోగ్యశ్రీ పథకం సృష్టికర్త డాక్టర్ వైయస్ రాజశేఖర్ రెడ్డి అనికొనియాడారు. ఈ కార్యక్రమంలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు దాసరి చినబాబు, సుంకర రమణ, పాటి రాంబాబు, అక్షింతల రాజా, నరాల శెట్టి నరసయ్య, మడికి మైనర్ బాబు,నున్నం రాంబాబు, రౌతు జోగేశ్వరరావు, అంబటి అబ్రహం, బిజ్జి రాజు, జాజుల ప్రసాద్, కూరాకుల సుమంగళి, బాడితబోయిన చిన్న, మచ్చ మురళి, మత్తి రాజేశ్వరి, జాలెం రాము, దంగేటి వెంకటరత్నం, అడబాల అబ్బులు, తొట్ట సత్యనారాయణ, కాటమస్వామి, నందూరి బుజ్జి, బొర్రా శేఖర్, షేక్ నాగూర్ వల్లి బాబా, దివానం తదితరులు వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఫుట్‌పాత్ ఆక్రమిస్తే చర్యలు తప్పవు ట్రాఫిక్ పోలీసుల స్పష్టమైన హెచ్చరిక




కుషాయిగూడ,**జులై 08 .అక్షర టైమ్స్ :** ప్రతినిధి గోపగాని పాండు) హైదరాబాద్ నగరంలో ట్రాఫిక్‌ను సాఫీగా కొనసాగించడంతో పాటు ప్రజల భద్రతకు ఎలాంటి ఆటంకాలు కలగకుండా చర్యలు చేపడుతున్న మల్కాజ్‌గిరి పోలీసు కమిషనరేట్ ఉప్పల్ ట్రాఫిక్ విభాగం బుధవారం ప్రత్యేక తనిఖీలు నిర్వహించింది. ఉప్పల్ ట్రాఫిక్ విభాగం (ట్రాఫిక్-2) సహాయ పోలీసు కమిషనర్ కె. సంపత్ కుమార్ ఆధ్వర్యంలో సాయంత్రం రాధిక కూడలి నుంచి ఎస్.ఆర్. రావు నగర్ మీదుగా కెనరా కూడలి వరకు విస్తృత స్థాయిలో తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా ఫుట్‌పాత్‌లు, ప్రధాన రహదారులను ఆక్రమించి ట్రాఫిక్‌కు ఆటంకం కలిగిస్తున్న నిర్మాణాలు, వ్యాపార సామగ్రి, ఇతర అడ్డంకులను తొలగించారు. అలాగే నిషేధిత పార్కింగ్ ప్రాంతాల్లో, ప్రధాన రహదారులపై నిర్లక్ష్యంగా వాహనాలు నిలిపిన వారిపై కేసులు నమోదు చేసి చట్టపరమైన చర్యలు చేపట్టారు.తనిఖీల సందర్భంగా సహాయ పోలీసు కమిషనర్ కె. సంపత్ కుమార్ ఫుట్‌పాత్ వ్యాపారులు, దుకాణాలు, వాణిజ్య సంస్థల యజమానులతో ప్రత్యేకంగా మాట్లాడారు. ప్రజల నడకకు ఉద్దేశించిన ఫుట్‌పాత్‌లను ఎట్టి పరిస్థితుల్లోనూ ఆక్రమించరాదని, దుకాణాల ముందు లేదా ప్రధాన రహదారులపై వస్తువులు ఉంచి ట్రాఫిక్‌కు ఆటంకం కలిగించవద్దని సూచించారు. అలాగే తమ దుకాణాలకు వచ్చే వినియోగదారులు, సందర్శకులు నిషేధిత ప్రాంతాల్లో వాహనాలు నిలపకుండా యజమానులు బాధ్యత వహించాలని ఆదేశించారు. రహదారిపై అక్రమ పార్కింగ్ కారణంగా ట్రాఫిక్ సమస్యలు తీవ్రమవడంతో పాటు అత్యవసర సేవలకు కూడా ఇబ్బందులు ఎదురవుతాయని వివరించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, ట్రాఫిక్ నియమాలను ఉల్లంఘించే వారిపై హైదరాబాద్ నగర పోలీసు చట్టంలోని సంబంధిత నిబంధనల ప్రకారం కఠిన చర్యలు కొనసాగుతాయి. ఆక్రమణలు, అక్రమ పార్కింగ్, ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించే కార్యకలాపాలను ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోమని స్పష్టం చేశారు. నగర ప్రజల సౌకర్యార్థం రేపటి నుంచి ఇలాంటి ప్రత్యేక తనిఖీలు నిరంతరాయంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. ట్రాఫిక్ క్రమశిక్షణ పాటించడం ప్రతి పౌరుడి సామాజిక బాధ్యత అని పేర్కొన్న పోలీసులు, రహదారులపై వాహనాలను నిబంధనలకు అనుగుణంగా నిలపాలని, ఫుట్‌పాత్‌లను పాదచారులకే వదిలివేయాలని, ట్రాఫిక్ పోలీసులకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ట్రాఫిక్ సాఫీగా సాగితేనే ప్రమాదాలు తగ్గడంతో పాటు ప్రజలు గమ్యస్థానాలకు వేగంగా చేరుకునే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. ఈ ప్రత్యేక తనిఖీల్లో డెల్టా-1, డెల్టా-2 బృందాలు, ఉప నిరీక్షకులు, ట్రాఫిక్ పోలీసు సిబ్బంది పాల్గొని విస్తృతంగా నిబంధనల అమలు చర్యలు చేపట్టారు. అధికారులు హెచ్చరికలను పట్టించుకోకుండా నిబంధనలు ఉల్లంఘించే వారిపై ఇకపై మరింత కఠిన చర్యలు కొనసాగనున్నాయని స్పష్టం చేశారు.

## నాచారంలో బాలామృతం నూతన కేంద్రం ప్రారంభం సీఎంతో నెమలి అనిల్ కుమార్ ప్రత్యేక భేటీ



నాచారం**జులై 08 .అక్షర టైమ్స్ :** (ప్రతినిధి గోపగాని పాండు) నాచారంలోని తెలంగాణ ఫుడ్స్ సంస్థలో రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా ఏర్పాటు చేసిన నూతన బాలామృతం తయారీ కేంద్రం ప్రారంభోత్సవ కార్యక్రమం ఘనంగా జరిగింది. చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు మరింత నాణ్యమైన పోషకాహారం అందించాలనే లక్ష్యంతో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో ఏర్పాటు చేసిన ఈ కేంద్రాన్ని తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా గ్రేటర్ కాంగ్రెస్ నేత, ఉమ్మడి మల్లాపూర్ డివిజన్ నాయకుడు నెమలి అనిల్ కుమార్ ముఖ్యమంత్రిని మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా నెమలి అనిల్ కుమార్ మాట్లాడుతూ, రాష్ట్రంలోని అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా లక్షలాది మంది చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు అందించే బాలామృతం నాణ్యతను మరింత మెరుగుపరచడమే కాకుండా, పెరుగుతున్న అవసరాలకు అనుగుణంగా ఉత్పత్తి సామర్థ్యాన్ని విస్తరించేందుకు ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం ఎంతో అభినందనీయమని పేర్కొన్నారు. ప్రజల ఆరోగ్యాన్ని, ముఖ్యంగా చిన్నారుల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం చేపడుతున్న ప్రతి సంక్షేమ కార్యక్రమం సమాజ నిర్మాణంలో కీలక పాత్ర పోషిస్తోందన్నారు.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో తెలంగాణ ప్రభుత్వం సంక్షేమం, పారిశ్రామిక అభివృద్ధి, మహిళా శిశు సంక్షేమం, ప్రజారోగ్యం, విద్య, ఉపాధి, మౌలిక సదుపాయాల అభివృద్ధికి సమాన ప్రాధాన్యత ఇస్తూ ముందుకు సాగుతోందని ఆయన అన్నారు. రాష్ట్రంలో ప్రజలకు నేరుగా ప్రయోజనం చేకూర్చే పథకాల అమలు, ప్రభుత్వ రంగ సంస్థల ఆధునీకీకరణ, నాణ్యమైన సేవల విస్తరణ వంటి అంశాల్లో ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు ప్రజల్లో విశ్వాసాన్ని పెంచుతున్నాయని పేర్కొన్నారు. బాలామృతం తయారీ కేంద్రం ప్రారంభం ద్వారా అంగన్‌వాడీ కేంద్రాలకు మరింత నాణ్యమైన పోషకాహారం వేగంగా అందే అవకాశం కలుగుతుందని, దీనివల్ల చిన్నారుల ఆరోగ్య పరిరక్షణతో పాటు మహిళా శిశు సంక్షేమ రంగం మరింత బలోపేతం అవుతుందని నెమలి అనిల్ కుమార్ అభిప్రాయపడ్డారు. భవిష్యత్తులో కూడా ప్రజల సంక్షేమాన్ని కేంద్రబిందువుగా చేసుకుని ప్రభుత్వం మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టాలని ఆకాంక్షించారు.ఈ సందర్భంగా ముఖ్యమంత్రికి మరోసారి శుభాకాంక్షలు తెలియజేసిన నెమలి అనిల్ కుమార్, రాష్ట్ర ప్రజలకు మరింత మెరుగైన సంక్షేమ ఫలాలు అందించేలా ప్రభుత్వం విజయవంతంగా ముందుకు సాగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మంత్రులు, ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు, తెలంగాణ ఫుడ్స్ సంస్థ ప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజాప్రతినిధులు తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొని నూతన బాలామృతం తయారీ కేంద్రం ప్రారంభాన్ని స్వాగతించారు.

www.akshratimes.com
తెలుగు దినపత్రిక అక్షర టైమ్స్
మా అక్షరం ప్రజల పక్షం

## ప్రకాశం, బాపట్ల, పల్నాడు జిల్లా

## ఘనంగా వైఎస్ ఆర్ 77వ జయంతి వేడుకలు



దర్శి,**జులై 08 .అక్షర టైమ్స్ :** మాజీ ముఖ్యమంత్రి దివంగత డాక్టర్ వైఎస్ రాజశేఖర్ రెడ్డి 77వ జయంతి సందర్భంగా దర్శి పట్టణంలోని గడియార స్తంభం వద్ద ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో దర్శి ఎమ్మెల్యే మరియు ప్రకాశం జిల్లా వైఎస్సార్సీపీ అధ్యక్షులు బూచేపల్లి శివప్రసాద్ రెడ్డి వైఎస్సార్ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి కేక్ కట్ చేసి జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మతో పాటు వైఎస్సార్సీపీ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని వైఎస్సార్ సేవలను స్మరించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన సంక్షేమ పాలన, ప్రజలకు అందించిన సేవలను గుర్తుచేసుకుంటూ నివాళులు అర్పించారు.

## మైక్రో క్రెడిట్ ప్లాన్ లకు ఆమోదం తెలపడంలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన బ్యాంకు మేనేజర్లపై చర్యలు తీసుకుంటాం

**కలెక్టర్ పి. రాజాబాబు**






ఒంగోలు,**జులై 08 .అక్షర టైమ్స్ :** స్వయం సహాయక సంఘాల మహిళలకు బ్యాంకు లింకేజీ రుణాలను సత్వరం మంజూరు చేయాలని కలెక్టర్ పి.రాజాబాబు స్పష్టం చేశారు. బ్యాంకులకు సమర్పించిన మైక్రో క్రెడిట్ ప్లాన్ లను పెండింగ్ లేకుండా ఆమోదించాలన్నారు. బుధవారం ప్రకాశం భవనంలో డి.ఆర్.డి.ఏ. – వెలుగు శాఖపై కలెక్టర్ ప్రత్యేక సమావేశం నిర్వహించారు. బ్యాంకుల ద్వారా స్వయం సహాయక సంఘాలకు అందుతున్న రుణాలు, రికవరీ, ఉన్నతి, పీఎం – ఏ.జె.ఏ.వై, ట్రై కార్, స్త్రీ నిధి, జీవనోపాధి పథకాల అమలుపై ఆయన సమీక్షించారు. డిఆర్డిఏ అధికారులు ఆయా విభాగాల వారీగా సాధించిన పురోగతిని కలెక్టరుకు వివరించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ స్వయం సహాయక సంఘాలలోని మహిళలు కచ్చితంగా సమావేశాలకు హాజరు కావాల్సిందేనని స్పష్టం చేశారు. మైక్రో క్రెడిట్ ప్లాన్ లకు ఆమోదం తెలపటంలో నిర్లక్ష్యంగా వ్యవహరించే బ్యాంకు మేనేజర్లపైనా చర్యలు తీసుకుంటానని హెచ్చరించారు. ప్రతి కుటుంబం నుంచి ఒక పారిశ్రామికవేత్త రావాలనే లక్ష్యంపై ప్రభుత్వం దృష్టి సారించినందున బ్యాంకర్లు కూడా సత్వరం స్పందించాల్సిన అవసరం ఉందని కలెక్టర్ పునరుద్ఘాటించారు. ఈ సమావేశంలో డిఆర్డిఏ పిడి నారాయణ, ఏపీఎంఐపి పిడి శ్రీనివాసులు, పశుసంవర్ధక శాఖ జెడి వెంకటేశ్వరరావు, మత్స్యశాఖ జెడి శ్రీనివాసరావు, ఎల్.డి.ఎం. రమేష్, జిల్లా పరిశ్రమల కేంద్రం జనరల్ మేనేజర్ శ్రీనివాసరావు, డి.ఆర్.డి.ఏ. డిపిఎంలు, ఉద్యాన శాఖ అధికారులు పాల్గొన్నారు.

## గొడవలు పడిన కేసులు జాతీయ లోక్ అదాల ద్వారా పరిష్కరించుకోండి: ఎస్సై జి. కోటయ్య




కురిచేడు,**జులై 08 .అక్షర టైమ్స్ :** జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు కురిచేడు మండలంలోని నాయుడుపాలెం పంచాయతీ లో గల వీ వై ఎ కాలనీలో బుధవారం కురిచేడు ఎస్సై జి కోటయ్య వారి సిబ్బంది ఆధ్వర్యంలో అక్కడ ప్రజలతో మరియు మహిళలతో సమావేశం ఏర్పాటు చేయడం జరిగినది. ఈ సమావేశంలో ఈ మధ్యకాలంలో జరుగుతున్న నేరాల గురించి ముఖ్యంగా మహిళలపై, చిన్నపిల్లలపై జరుగు ఆకృత్యాల గురించి – తీసుకోవాల్సిన జాగ్రత్తలు, సైబర్ నేరాలు పట్ల అవగాహన కల్పించడం , అదేవిధంగా రోడ్డు ప్రమాదాలు జరిగినప్పుడు బాధిత కుటుంబాలు ఎదుర్కొంటున్న ఇబ్బందుల గురించి, క్షణికావేశంలో గొడవలు చేసుకుని సమయాన్ని మరియు ఆర్థికంగా నష్టపోతు కోర్టుల చుట్టూ తిరుగుతూ ఎలా నష్టపోతున్నారు వివరిస్తూ, ఏదైనా గతంలో గొడవలు పడిన కేసులు ఉంటే ఈ నెల 11న జరుగు జాతీయ లోక్ అదాలత్ సందర్భంగా ఆ కేసులను ఇరువర్గాల అంగీకారంతో రాజీ చేసుకోవాలని ఈ సందర్భంగా వారికి తెలియజేయడం జరిగింది.

## వివాహ వేడుకలలో పాల్గొన్న శిద్ధా రాఘవరావు దంపతులు



దర్శి,**జులై 08 .అక్షర టైమ్స్ :** దర్శి మాజీ టిడిపి టౌన్ పార్టీ అధ్యక్షుడు యాదగిరి వాసు, అనురాధ దంపతుల కుమార్తె భాగ్యమణిలక్ష్మి వివాహం ప్రసాద్ తో ఘనంగా జరిగింది. ఈ వివాహ వేడుకకు రాష్ట్ర మాజీ మంత్రి శిద్ధా రాఘవరావు, ఆయన సతీమణి రాష్ట్ర ఆర్యవైశ్య మహిళా సంఘ అధ్యక్షురాలు శిద్ధా లక్ష్మి పద్మావతి ప్రత్యేకంగా హాజరయ్యారు. నూతన వధూవరులను ఆశీర్వదించి, వారి వైవాహిక జీవితం ఆనందమయం, ఆయురారోగ్యాలతో, సిరిసంపదలతో కళకళలాడాలని ఆకాంక్షించారు. అనంతరం యాదగిరి వాసు కుటుంబ సభ్యులను ఆప్యాయంగా పలకరించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ వివాహ మహోత్సవంలో పలువురు ప్రజాప్రతినిధులు, రాజకీయ నాయకులు, ఆర్యవైశ్య సంఘ ప్రతినిధులు, బంధుమిత్రులు పాల్గొని నూతన దంపతులను ఆశీర్వదించారు.

www.akshratimes.com
తెలుగు దినపత్రిక
అక్షర టైమ్స్
మా అక్షరం ప్రజల పక్షం
గ్రేటర్ హైదరాబాద్, ఈస్ట్ గోదావరి,
కాకినాడ జిల్లా, వెస్ట్ గోదావరి, ఏలూరు జిల్లా

## బండ్లగూడలో ఉత్సాహంగా ఓటరు నమోదు కార్యక్రమం






బండ్లగూడ,**జులై 08 .అక్షర టైమ్స్ :** ప్రతినిధి ఎం.వీరేష్ పటాన్చెరు కార్పొరేటర్ మెట్టుకుమార్ యాదవ్ మార్గనిర్దేశంలో, స్థానిక హనుమాన్ ఆలయం వద్ద ప్రత్యేక ఓటరు నమోదు మరియు ఓటర్ సెర్చ్ కార్యక్రమం ఘనంగా జరిగింది. జేపీ కాలనీ డివిజన్ అధ్యక్షుడు భరత్ కుమార్ సారథ్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో, ఓటరు జాబితాలో పేర్ల పరిశీలనతో పాటు నూతన ఓటర్ల నమోదును చేపట్టారు. ఈ సందర్భంగా ఓటరు జాబితాలో పేరు లేని అర్హుల వివరాలను సేకరించి, దరఖాస్తులను నింపడంలో స్థానికులకు అవసరమైన సాయాన్ని అందించారు. ప్రతి పౌరుడు తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని, జాబితాలో పేరు ఉందో లేదో సరిచూసుకోవాలని నాయకులు కోరారు. అర్హులైన ఎవరూ ఓటు హక్కును కోల్పోకూడదనే ఉద్దేశంతో ఈ ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు వారు పేర్కొన్నారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటు అత్యంత శక్తివంతమైన ఆయుధమని, బాధ్యత కలిగిన ప్రతి ఒక్కరూ ఇందులో భాగస్వాములు కావాలని వారు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు కృష్ణ యాదవ్, లక్ష్మణ్ యాదవ్, సురేష్ రెడ్డి, అఫ్జల్, ఊర్మిళ, షాబెర తదితరులు పాల్గొన్నారు.

## కొండాపూర్ ఏరియా ఆసుపత్రిలో సంపత్ యాదవ్ ప్రథమ వర్ధంతి సందర్భంగా అన్నదాన కార్యక్రమం







కొండాపూర్,**జులై 08 .అక్షర టైమ్స్ :** ప్రతినిధి రిపోర్టింగ్ ఎం.ఈరన్న దివంగత మరబోయిన సంపత్ యాదవ్ ప్రథమ వర్ధంతి సందర్భంగా మరబోయిన కుటుంబ సభ్యులు కొండాపూర్ ఏరియా ఆసుపత్రిలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా మరబోయిన రవి యాదవ్, కుటుంబ సభ్యులు, బీఆర్ఎస్ నాయకులు కలిసి సంపత్ యాదవ్ చిత్రపటానికి పూలమాలలు వేసి, పుష్పాంజలి ఘటించి ఘనంగా నివాళులర్పించారు.అనంతరం ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రోగులు, వారి సహాయకులకు భోజనం, పండ్లు పంపిణీ చేశారు. సేవా కార్యక్రమాల ద్వారా సమాజానికి అండగా నిలవడం దివంగత సంపత్ యాదవ్‌కు నిజమైన నివాళి అని ఈ సందర్భంగా పేర్కొన్నారు.

## ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావును కలిసిన బీఆర్ఎస్ ముఖ్య నాయకులు






శేర్లింగంపల్లి,**జులై 08 .అక్షర టైమ్స్ :** ప్రతినిధి ఎం.ఈరన్న కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావును బీఆర్ఎస్ నాయకులు ఈరోజు మర్యాదపూర్వకంగా కలిశారు. శేరిలింగంపల్లి బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు మారబోయిన రవి యాదవ్, చందానగర్ బీఆర్ఎస్ సీనియర్ నాయకురాలు సుప్రజా ప్రవీణ్ నేతృత్వంలో ఈ సమావేశం జరిగింది. బలమైన సంస్థాగత నిర్మాణం, ఐక్య నాయకత్వంతో ప్రజల పక్షాన నిలబడి ముందుకు సాగుతామని ఈ సందర్భంగా నాయకులు స్పష్టం చేశారు. కార్యక్రమంలో పాల్గొన్న ఇతర నాయకులు: కొమిరిశెట్టి సాయిబాబా (గచ్చిబౌలి మాజీ కార్పొరేటర్) మాధవరం రంగారావు కోమండ్ల శ్రీనివాస్ రెడ్డి పి. శ్రీకాంత్ సుబ్బారాజు ఎర్రబెల్లి సతీష్ రావు గోపురాజు శ్రీనివాస్ రావు అల్లావుద్దీన్ పటేల్ రామకృష్ణ గౌడ్ శ్రీనివాస్ గౌడ్ తిరుపతి రెడ్డి ప్రజలే లక్ష్యంగా ముందుకు సాగుతున్న బీఆర్ఎస్ శ్రేణులు ఈ భేటీలో పాల్గొని తమ సంఘీభావాన్ని చాటారు.

## కట్టమైసమ్మ గుడిలో బ్రహ్మోత్సవాలు భక్తులకు అన్నదానం





శేరిలింగంపల్లి,**జులై 08 .అక్షర టైమ్స్ :** పతినిధి ఎం.ఈరన్న తారానగర్, శివాజీనగర్ (వీకర్ సెక్షన్ కాలనీ) లోని శ్రీ కట్టమైసమ్మ దేవాలయ 12వ వార్షిక బ్రహ్మోత్సవాలు ఎంతో వైభవంగా జరిగాయి. ఊరిటి వెంకట్రావు జన్మదినాన్ని పురస్కరించుకుని ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ?ఈ వేడుకలకు తెలంగాణ యాదవ కురుమ కార్పొరేషన్ చైర్మన్ రఘునాథ్ యాదవ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమంలో పాల్గొని, భక్తులకు స్వయంగా అన్నప్రసాదం వడ్డించారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, కార్యకర్తలు మరియు పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని ఉత్సవాలను విజయవంతం చేశారు.

## మొగళ్లూరులో నిమ్మతోట దగ్ధం




పొదలకూరు,**జులై 08 .అక్షర టైమ్స్ :** రిపోర్టర్ ఆనంద్ పొదలకూరు మండలం మొగళ్లూరు గ్రామంలో బుధవారం రాత్రి ఓ రైతుకు చెందిన నిమ్మతోట అగ్నికి ఆహుతైంది. గ్రామానికి చెందిన రైతు గానుగపల్లి బలరాం రెడ్డికి చెందిన నిమ్మతోటలో అకస్మాత్తుగా మంటలు చెలరేగి సుమారు 30 నిమ్మ చెట్లు పూర్తిగా కాలిపోయాయి.స్థానికులు మంటలను గమనించి వెంటనే ఆర్పేందుకు ప్రయత్నించినప్పటికీ అప్పటికే చెట్లు దగ్ధమయ్యాయి. ఈ ఘటనలో రైతుకు గణనీయమైన ఆర్థిక నష్టం వాటిల్లినట్లు తెలుస్తోంది.గుర్తు తెలియని వ్యక్తులు ఉద్దేశపూర్వకంగానే నిప్పంటించి ఉండవచ్చని గ్రామస్తులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఘటనపై సంబంధిత అధికారులు విచారణ చేపట్టి, బాధ్యులను గుర్తించి చర్యలు తీసుకోవాలని రైతులు, గ్రామస్తులు కోరుతున్నారు.

# మహానేత వైఎస్సార్ ఆశయాలు నేటి తరానికి స్ఫూర్తి: శశిధర్ రెడ్డి



అమీన్పూర్,**జులై 08 .అక్షర టైమ్స్ :** ప్రతినిధి రిపోర్టింగ్ ఎం.వీరేష్ దివంగత ముఖ్యమంత్రి, మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి 77వ జయంతిని పురస్కరించుకుని అమీన్పూర్ మున్సిపాలిటీ పరిధిలోని బీరంగూడ కమాన్ వద్ద గల ఆయన విగ్రహానికి అమీన్పూర్ పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు శశిధర్ రెడ్డి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి, వైఎస్సార్ సేవలను స్మరించుకున్నారు. ఈ సందర్భంగా శశిధర్ రెడ్డి మాట్లాడుతూ, ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయిన అరుదైన ప్రజా నాయకుడు రాజశేఖరరెడ్డి అని కొనియాడారు. అధికారాన్ని ప్రజాసేవకు సాధనంగా మలుచుకుని, రైతులు, పేదలు, మహిళలు, విద్యార్థులు, వృద్ధులు, దళిత, గిరిజన, మైనారిటీ వర్గాల సంక్షేమం కోసం అహర్నిశలు కృషి చేసిన మహోన్నత నాయకుడిగా ఆయన చరిత్రలో నిలిచిపోయారని పేర్కొన్నారు. వైఎస్సార్ పాలనలో విప్లవాత్మక మార్పులు 2003లో చేపట్టిన చారిత్రాత్మక ప్రజాప్రస్థాన పాదయాత్ర ద్వారా ప్రజల సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకున్న వైఎస్సార్, అధికారంలోకి వచ్చాక వాటి పరిష్కారానికి అనేక సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను అమలు చేశారని గుర్తుచేశారు. రైతులకు ఉచిత విద్యుత్ అందించడం ద్వారా వ్యవసాయ రంగానికి వెన్నుదన్నుగా నిలిచారని, ఆరోగ్యశ్రీ ద్వారా పేదలకు కార్పొరేట్ వైద్యాన్ని ఉచితంగా అందుబాటులోకి తీసుకువచ్చారని వివరించారు. 108 అంబులెన్స్, 104 సేవలు అత్యవసర వైద్య చికిత్సను ప్రజల ఇంటి వద్దకే చేర్చాయని తెలిపారు. ఇందిరమ్మ గృహ నిర్మాణ పథకం ద్వారా లక్షలాది నిరుపేదలకు సొంత ఇంటి కలను సాకారం చేశారని, జలయజ్ఞం ద్వారా సాగునీటి ప్రాజెక్టులను వేగవంతం చేసి లక్షల ఎకరాలకు నీరందించే లక్ష్యంతో పనిచేశారని పేర్కొన్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్, మహిళా స్వయం సహాయక సంఘాలకు ప్రోత్సాహం వంటి పథకాల ద్వారా ప్రజల జీవితాల్లో విశేష మార్పులు తీసుకువచ్చారని తెలిపారు. ప్రజల కష్టాలను తన కష్టాలుగా భావించి, చివరి వ్యక్తి వరకు సంక్షేమ ఫలాలు చేరాలనే లక్ష్యంతో పనిచేసిన నాయకుడు వైఎస్సార్ అని, ఆయన చూపిన ప్రజాసేవా మార్గం నేటి రాజకీయ నాయకులకు ఆదర్శమని శశిధర్ రెడ్డి ఉద్ఘాటించారు. ఆయన ఆశయాలు, విలువలను కొనసాగిస్తూ ప్రజల సమస్యల పరిష్కారానికి కాంగ్రెస్ పార్టీ నిరంతరం కృషి చేస్తుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో బీరంగూడ దేవాలయ చైర్మన్ సుధాకర్ యాదవ్, మెంబర్ మల్లేష్ యాదవ్, మహేష్, చుక్క రెడ్డి, కృష్ణ యాదవ్, సురేష్ నాయక్, మస్తాన్ నాయుడు, గోవిందు, రమేష్, ప్రశాంత్, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, వైఎస్సార్ అభిమానులు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## హైదరాబాద్ ఐటీ కారిడార్‌లో ట్రాఫిక్ కష్టాలకు చెక్: రంగంలోకి దిగిన సైబరాబాద్ జాయింట్ సీపీ



శేరిలింగంపల్లి,**జులై 08 .అక్షర టైమ్స్ :** ప్రతినిధి ఎం.ఈరన్న సైబరాబాద్ వ్యాప్తంగా నిత్యం వేలాది మందిని వేధిస్తున్న ట్రాఫిక్ రద్దీ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపేందుకు పోలీసులు సరికొత్త వ్యూహాన్ని సిద్ధం చేస్తున్నారు. కేవలం అప్పటికప్పుడు వాహనాల రద్దీని క్లియర్ చేయడం కాకుండా, సమగ్ర సర్వేల ద్వారా సేకరించిన సమాచారం ఆధారంగా ఒక పక్కా కార్యాచరణను రూపొందించాలని సైబరాబాద్ జాయింట్ సీపీ (ట్రాఫిక్) సన్‌ప్రీత్ సింగ్ అధికారులను ఆదేశించారు. బుధవారం సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ ప్రధాన కార్యాలయంలో శేరిలింగంపల్లి ట్రాఫిక్ విభాగం పరిధిలోని పోలీస్ స్టేషన్ల అధికారులతో ఆయన ఒక కీలక సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు.?ఈ సమావేశంలో చర్చించిన ప్రధాన అంశాలు మరియు రద్దీ నివారణకు తీసుకోబోయే కీలక చర్యలు క్రింది విధంగా ఉన్నాయి: 1. సమాచార సేకరణ - వాహనాల లెక్కింపు రహదారులపై రద్దీ తీవ్రతను అంచనా వేసేందుకు వారం రోజుల పాటు ప్రత్యేక తనిఖీలు నిర్వహించనున్నారు. వివిధ సంస్థల నుండి ఏయే సమయాల్లో ఎన్ని వాహనాలు బయటకు వస్తున్నాయి ఉదయం, సాయంత్రం వేళల్లో వాహనాల దట్టం ఏ స్థాయిలో ఉంది అనే అంశాలపై రోజువారీగా, సమయాల వారీగా పూర్తి సమాచారాన్ని సేకరిస్తారు. దీని ఆధారంగా వాహనాల మళ్లింపులు లేదా సిగ్నల్ వేళలను మార్చే అవకాశం ఉంటుంది. 2. ఉద్యోగుల్లో మార్పు.. వాహనాల భాగస్వామ్యం వైపు అడుగులు కార్యాలయాలు ఉన్న ప్రాంతాల్లో రద్దీ తగ్గాలంటే రోడ్లపై సొంత వాహనాల సంఖ్య తగ్గడం చాలా ముఖ్యం. అందుకోసం సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు ఒకే వాహనాన్ని నలుగురు పంచుకునే (కార్‌పూలింగ్) పద్ధతిని ఎక్కువగా ఉపయోగించేలా కంపెనీల ద్వారా అవగాహన కల్పించాలని జాయింట్ సీపీ సూచించారు. దీంతో పాటు వాహనాల వర్గీకరణ (ద్విచక్ర, నాలుగు చక్రాల, భారీ వాహనాలు), రహదారుల సామర్థ్యంపై కూడా విశ్లేషణ జరగనుంది. 3. నిఘా కెమెరాల అనుసంధానం ఆధునిక సాంకేతికత వాహనాల కదలికలను నిరంతరం గమనించేందుకు సాంకేతికతకు పెద్దపీట వేయనున్నారు. ప్రధాన కూడళ్లలోని నిఘా కెమెరాల పనితీరును సమీక్షించడం. కెమెరాల భౌగోళిక గుర్తింపు (జియో-ట్యాగింగ్) చేయడం ద్వారా ఎక్కడెక్కడ నిఘా తక్కువగా ఉందో గుర్తించడం. అవసరమైన చోట్ల సరికొత్త స్పష్టత గల కెమెరాలను, కాలినడకన వెళ్లే వారి భద్రత కోసం ప్రత్యేక సిగ్నల్స్ ఏర్పాటు చేయడం. 4. రద్దీ ప్రాంతాలపై ప్రత్యేక నిఘా షాపింగ్ మాల్స్, ప్రముఖ హోటళ్లు, పెద్ద ఆసుపత్రులు మరియు విద్యాసంస్థల వద్ద రద్దీ సమయాల్లో వాహనాలు నిలిచిపోకుండా ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేయనున్నారు. ముఖ్యంగా పాఠశాలలు, కళాశాలలు మొదలయ్యే మరియు ముగిసే సమయాల్లో విద్యార్థుల ప్రయాణ విధానాన్ని అధ్యయనం చేసి, అక్కడ ఇబ్బందులు లేకుండా చూస్తారు. 5. మద్యం సేవించి వాహనాలు నడిపేవారిపై ఉక్కుపాదం రోడ్డు భద్రత విషయంలో ఎలాంటి రాజీ పడబోమని జాయింట్ సీపీ స్పష్టం చేశారు. నిబంధనల ఉల్లంఘనలపై కఠినంగా వ్యవహరించాలని, ముఖ్యంగా రాత్రి వేళల్లో మద్యం సేవించి వాహనాలు నడిపే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సమావేశంలో పాల్గొన్న ముఖ్యులు: ఈ ఉన్నత స్థాయి సమీక్షా సమావేశంలో శేరిలింగంపల్లి ట్రాఫిక్ విభాగం ఉన్నతాధికారులు రవికుమార్, హనుమంతరావు, నరేందర్, నవేద్‌తో పాటు పలువురు ఇన్‌స్పెక్టర్లు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు. ఈ సమగ్ర సర్వేలు, సాంకేతిక ఆధారిత మార్పుల ద్వారా త్వరలోనే శేరిలింగంపల్లి పరిధిలో ట్రాఫిక్ కష్టాలు చాలా వరకు తీరే అవకాశం కనిపిస్తోంది.

## విద్యుత్ సమస్యలపై అధికారులను కలిసిన శ్రీ లక్ష్మీనరసింహస్వామి కాలనీవాసులు



కాప్రా,**జులై 08 .అక్షర టైమ్స్ :** (ప్రతినిధి గోపగాని పాండు) శ్రీ లక్ష్మీనరసింహస్వామి కాలనీలో నెలకొన్న విద్యుత్ సమస్యలను శాశ్వతంగా పరిష్కరించాలని కోరుతూ కాలనీ సంక్షేమ సంఘం ప్రతినిధులు విద్యుత్ శాఖ సహాయ ఇంజనీర్ బాలరాజును కలిసి వినతిపత్రం అందజేశారు. కాలనీ అధ్యక్షుడు జె. సుధాకర్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో కాలనీలో ప్రస్తుతం ఉన్న సింగిల్ ఫేజ్ విద్యుత్ లైన్లను త్రీఫేజ్ వ్యవస్థగా మార్చడంతో పాటు, పాతబడి జాయింట్లతో ఉన్న తీగలను తొలగించి కొత్త విద్యుత్ లైన్లు ఏర్పాటు చేయాలని, శిథిలావస్థకు చేరిన విద్యుత్ స్తంభాలను మార్చాలని అధికారులు దృష్టికి తీసుకెళ్లారు. వినతిపై స్పందించిన సహాయ ఇంజనీర్ బాలరాజు మాట్లాడుతూ, కాలనీలోని పరిస్థితులను క్షేత్రస్థాయిలో పరిశీలించి అవసరమైన అంచనాలు రూపొందించి, నిధులు మంజూరైన వెంటనే కొత్త విద్యుత్ లైన్లు, విద్యుత్ స్తంభాల ఏర్పాటుకు చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా కాలనీ అధ్యక్షుడు జె. సుధాకర్ మాట్లాడుతూ, కాలనీ ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు కల్పించేందుకు కమిటీ సభ్యులు, కాలనీవాసులందరూ ఐక్యంగా కృషి చేస్తున్నారని తెలిపారు. సమస్యల పరిష్కారానికి ప్రజాప్రతినిధులు, అధికారులతో నిరంతరం సమన్వయం చేసుకుంటూ కాలనీ అభివృద్ధి కోసం కట్టుబడి పనిచేస్తామని చెప్పారు. కాలనీలో విద్యుత్ సమస్యలను స్వయంగా పరిశీలించిన ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, సమస్యను త్వరితగతిన పరిష్కరించాలని విద్యుత్ శాఖ అధికారులతో మాట్లాడి తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించినందుకు కాలనీవాసులు ఆయనకు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో కాలనీ సంయుక్త కార్యదర్శి మునీర్, ఖజానాదారు ఏ. శ్రీనివాస్, కమిటీ సభ్యులు ఎస్. కృష్ణ, శివకృష్ణతో పాటు పలువురు కాలనీవాసులు పాల్గొన్నారు.

## ప్రజానాయకుడు డాక్టర్ వైఎస్ రాజశేఖర రెడ్డి జయంతి వేడుకల్లో పాల్గొన్న

వి.జగదీశ్వర్ గౌడ్,యలమంచి ఉదయ్ కిరణ్





శేర్లింగంపల్లి,**జులై 08 .అక్షర టైమ్స్ :** ప్రతినిధి ఎం.ఈరన్న దివంగత ప్రజానేత, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ డాక్టర్ వైఎస్ రాజశేఖర రెడ్డి జీవితం ప్రజా సంక్షేమం, మానవతా విలువలు, నిస్వార్థ ప్రజాసేవకు చిరస్మరణీయ నిదర్శనమని టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, శేరిలింగంపల్లి అసెంబ్లీ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ వి. జగదీశ్వర్ గౌడ్ పేర్కొన్నారు. దృఢ సంకల్పం, అంకితభావం, కష్టపడే తత్వం, ప్రజాసేవ పట్ల నిబద్ధత ఉంటే జీవితంలో ఏ శిఖరాన్నైనా అధిరోహించవచ్చని ఆయన అన్నారు. ముఖ్యంగా విద్యార్థులు, యువత డాక్టర్ వైఎస్ రాజశేఖర రెడ్డి ఆశయాలను ఆదర్శంగా తీసుకుని సమాజ సేవలో ముందుండాలని పిలుపునిచ్చారు. ఘనంగా నివాళులర్పించిన నాయకులు డాక్టర్ వైఎస్ రాజశేఖర రెడ్డి జయంతి సందర్భంగా మియాపూర్ ఎక్స్ రోడ్డు వద్ద యూత్ కాంగ్రెస్ నాయకుడు నరేందర్ ముదిరాజ్ ఆధ్వర్యంలో నిర్వహించిన నివాళుల కార్యక్రమంతో పాటు, అయ్యప్ప సొసైటీలో మాదాపూర్ డివిజన్ అధ్యక్షులు నగేష్ నాయక్ ఆధ్వర్యంలో నిర్వహించిన మరో నివాళుల కార్యక్రమంలో వి. జగదీశ్వర్ గౌడ్, ఎంబీసీ కార్పొరేషన్ చైర్మన్ జెరిపేటి జైపాల్, తెలంగాణ రాష్ట్ర యాదవ కార్పొరేషన్ చైర్మన్ మారబోయిన రఘునాథ్ యాదవ్, కాంగ్రెస్ నాయకుడు యలమంచి ఉదయ్ కిరణ్, నియోజకవర్గ కాంగ్రెస్ నాయకులు, యువజన కాంగ్రెస్ కార్యకర్తలు, కళాశాల విద్యార్థులు మరియు ప్రజాప్రతినిధులతో కలిసి పాల్గొన్నారు. డాక్టర్ వైఎస్ రాజశేఖర రెడ్డి చిత్రపటానికి, విగ్రహానికి పూలమాలలు సమర్పించి ఘనంగా నివాళులర్పించారు. వైఎస్ఆర్ పాలన - ప్రజా సంక్షేమమే పరమావధి ఈ సందర్భంగా జగదీశ్వర్ గౌడ్ మాట్లాడుతూ, డాక్టర్ వైఎస్ రాజశేఖర రెడ్డి విద్య, వైద్యం, సాయం, రైతు సంక్షేమం, పేదల అభ్యున్నతి వంటి రంగాలకు అత్యున్నత ప్రాధాన్యత ఇచ్చారని గుర్తు చేశారు. ఉన్నత విద్యకు భరోసా: ఆర్థిక ఇబ్బందులు ఏ విద్యార్థి భవిష్యత్తుకు అడ్డంకి కాకూడదనే సంకల్పంతో ఉన్నత విద్యకు అవకాశాలు కల్పించే అనేక సంక్షేమ కార్యక్రమాలను అమలు చేశారని తెలిపారు. విద్య ద్వారా వ్యక్తి జీవితమే కాకుండా కుటుంబం, సమాజం, రాష్ట్ర భవిష్యత్తు కూడా మారుతుందనే విశ్వాసంతో ఆయన పాలన సాగిందని అన్నారు. బాధ్యతాయుత నాయకత్వం: అధికారాన్ని వ్యక్తిగత ప్రతిష్ఠ కోసం కాకుండా ప్రజల జీవితాల్లో శాశ్వత మార్పు తీసుకురావడానికి ఒక బాధ్యతగా భావించిన అరుదైన నాయకుడు డాక్టర్ వైఎస్ రాజశేఖర రెడ్డి అని పేర్కొన్నారు. రైతులు, పేదలు, కార్మికులు, విద్యార్థులు, మహిళలు, వృద్ధులు సహా సమాజంలోని ప్రతి వర్గం సంక్షేమమే ఆయన పాలనా తత్వానికి కేంద్రబిందువుగా నిలిచిందని వివరించారు. ప్రజల వద్దకు పాలన: ప్రజల సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకునేందుకు గ్రామాల్లో పర్యటిస్తూ వారి కష్టసుఖాల్లో భాగస్వామి కావడం వైఎస్ఆర్ నాయకత్వంలోని విశిష్ట లక్షణమని అన్నారు. సంక్షేమ పథకాల ద్వారా లక్షలాది కుటుంబాల్లో ఆశలు నింపి, ప్రభుత్వం ప్రజల గడపకు చేరాలనే ఆలోచనను కార్యరూపంలో చూపించిన దూరదృష్టి గల నాయకుడిగా ఆయన చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయారని కొనియాడారు. యువతకు పిలుపు ప్రతి విద్యార్థి, ప్రతి యువకుడు వైఎస్ఆర్ జీవితంలోని క్రమశిక్షణ, నిజాయితీ, అంకితభావం, సేవా తత్వం, సామాజిక బాధ్యత వంటి విలువలను అలవర్చుకుని ఉన్నత లక్ష్యాల సాధనకు కృషి చేయాలని సూచించారు. వ్యక్తిగత విజయంతో పాటు సమాజాభివృద్ధికి కూడా తోడ్పడే బాధ్యతాయుత పౌరులుగా ఎదగాలని పిలుపునిచ్చారు. "ప్రజల ఆశీర్వాదం కంటే గొప్ప పురస్కారం మరొకటి లేదు" అనే తత్వాన్ని జీవితాంతం ఆచరించిన మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖర రెడ్డి. ప్రజల కోసం నిరంతరం శ్రమించడం, సమాజ అభ్యున్నతినే నిజమైన విజయంగా భావించడం, ప్రతి వర్గం సంక్షేమాన్ని పాలనలో భాగం చేయడం ఆయన ప్రజా జీవితానికి శాశ్వత గుర్తింపుగా నిలిచాయి. వి. జగదీశ్వర్ గౌడ్ పాల్గొన్న ముఖ్య నాయకులు ఈ కార్యక్రమాల్లో శేరిలింగంపల్లి నియోజకవర్గ కోఆర్డినేటర్ రఘునందన్ రెడ్డి, కృష్ణ, మన్నేపల్లి సాంబశివరావు, కట్ల శేఖర్ రెడ్డి, మహిపాల్ యాదవ్, మోహన్ సింగ్, గోపాల్ నాయక్, మిరియాల ప్రీతం, ప్రసన్న సురేష్ నాయక్, డీసీసీ అధికార ప్రతినిధి శ్రీహరి, మాజీ యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు సౌందర్య రాజన్, రాంచందర్ గౌడ్, రవికుమార్, శేరిలింగంపల్లి యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు జాకీర్, రంగారెడ్డి జిల్లా యూత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ఆసిఫ్, సాయి కిషోర్, రామస్వామి, సురేష్, బ్రహ్మయ్య యాదవ్, ముక్తార్, యాద గౌడ్, హరి కిషన్, సాజిద్, డాక్టర్ ప్రసాద్, శ్యా మ్ నాయక్, ప్రేమ్ యాదవ్, సర్దార్, మహిళా కాంగ్రెస్ నాయకులు అనిత, జయ, మణెమ్మ తదితరులు పాల్గొన్నారు.

# పేదవారి గుండె చప్పుడు డాక్టర్ వైయస్ఆర్

77వ జయంతి వేడుకలో పలువురు నేతలు






కావలి,**జులై 08 .అక్షర టైమ్స్ :** ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పేద ప్రజల గుండె చప్పుడు దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైయస్ రాజశేఖర్ రెడ్డి అని, ఆయన ప్రజల అభ్యున్నతికోసం ప్రవేశ పెట్టిన పలు సంక్షేమ పథకాలు నేటికి గుర్తుండిపోయేలా నిలిచాయని పలువురు వైసిపి నాయకులు పేర్కొన్నారు. బుధవారం కావలి పట్టణంలో నియోజకవర్గం వైసీపీ ఇంచార్జ్, మాజీ ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్ కుమార్ రెడ్డి ఆదేశాలమేరకు పట్టణ కమిటీ కన్వీనర్ కేతిరెడ్డి శివకుమార్ రెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా వైఎస్ రాజశేఖర్ రెడ్డి 77వ జయంతి వేడుకలు చేపట్టారు. పట్టణ అధ్యక్షుడు కేతిరెడ్డి శివకుమార్ రెడ్డి మరియు వైసిపి శ్రేణులు పెద్ద సంఖ్యలో చేరి వచ్చి పార్టీ కార్యాలయంలో డాక్టర్ వైయస్ఆర్ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. అనంతరం ట్రంక్ రోడ్ తహసిల్దార్ కార్యాలయం ఎదుట ఉన్న ఆయన విగ్రహం వద్దకు చేరుకొని పూలమాల వేసి నివాళి అర్పించారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో ఉద్దేశించి గంధం ప్రసన్నాంజనేయులు జిల్లా కార్యదర్శి, పందిటి కామరాజు జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షులు, షేక్ నాయబ్ రసూల్ కావాలి పట్టణ ప్రధాన కార్యదర్శి, పరుసుమల్యాద్రి సీనియర్ నాయకులు, మాజీ కౌన్సిలర్ గుడ్లూరు మాల్యాద్రి, జిల్లా నాయకులు నెల్లూరు వెంకటేశ్వర రెడ్డి, మహిళ నాయకురాలు సుమలత, సీతారావమ్మ తదితరులు పాల్గొని వైయస్సార్ చేసిన గొప్ప కార్యాల గురించి కీర్తించారు. ఆయన ప్రవేశ పెట్టిన రాజీవ్ ఆరోగ్యశ్రీ పథకం, ఫీజు రియంబర్స్మెంట్, తదితర పథకాల ద్వారా అనేకమంది ఆరోగ్యవంతులు కావడం, ఉన్నత చదువులు చదివి మంచి స్థాయిలో ఉంది వైయస్ఆర్ ను కొనియాడుతున్నారని గుర్తు చేశారు. ఆయన లేని లోటు నేడు కనిపిస్తుంది అని, ఆయన ఆశయాలను ముందుకు తీసుకోలుపోవుటకు వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఎంతగానో కృషి చేస్తున్నారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో విస్తృత స్థాయిలో వైయస్సార్అభిమానులు, వైసిపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# సెర్చ్ ఆపరేషన్ ముగిసింది - బాధిత కుటుంబాల్లో తీరని వేదనను మిగిల్చింది

**సముద్రంలో మత్స్యకారుల గల్లంతుపై ముగిసిన సెర్చ్ ఆపరేషన్**

**తమ వారి కోసం కన్నీరు మున్నీరుగా విలపిస్తున్న గంగపుత్రులు**

**కుటుంబానికి రూ.10 లక్షల చొప్పున సాయానికి కలెక్టర్‌కు అచ్చెన్న ఆదేశం**



విశాఖ తీరంలో సముద్రంలో గల్లంతైన మత్స్యకారుల ఘటన తీవ్ర విషాదాన్ని నింపింది. తమ వారు తిరిగొస్తారని వేయి కళ్లతో ఎదురుచూసిన వారికి కన్నీరే మిగిలింది! గత నాలుగు రోజులుగా సాగిన ఇండియన్ నేవీ, కోస్ట్ గార్డ్ సంయుక్త రెస్క్యూ ఆపరేషన్ ముగిసింది. 72 గంటలపాటు కొనసాగిన సెర్చ్ ఆపరేషన్‌ను ఇక ప్రయోజనం లేదని భావించి అధికారులు నిలిపివేశారు. అయితే బాధిత కుటుంబాల అభ్యర్థన మేరకు కోస్ట్‌గార్డ్ సహాయక చర్యలను బుధవారం మధ్యాహ్నం 12 గంటల వరకు పొడిగించారు. అయినా దురదృష్టవశాత్తూ తప్పిపోయిన ఆరుగురు జాలర్ల ఆచూకీ మాత్రం లభించలేదు. దీంతో సెర్చ్ ఆపరేషన్ ముగిసిందని ఇవాళ అధికారులు ప్రకటించారు. మృతదేహాలు ఒడ్డుకు కొట్టుకువచ్చాయా అన్న కోణంలో తీర ప్రాంతంలో తనిఖీ చేయాలని గస్తీదళాలకు ఆదేశాలిచ్చారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం 72 గంటల గాలింపు పూర్తవగానే తక్షణ సాయం, పునరావాస చర్యలుంటాయి. మరోవైపు రూ.5 లక్షల చొప్పున గ్రూప్ యాక్సిడెంట్ ఇన్సూరెన్స్ స్కీంకు అవసరమైన పత్రాలను మత్స్యశాఖ సిద్ధం చేస్తోంది.జులై 1న విశాఖ ఫిషింగ్ హార్బర్ నుంచి ఏడుగురు మత్స్యకారులు సముద్రంలోకి వేటకు వెళ్లారు. అయితే బంగాళాఖాతంలో ఏర్పడిన వాతావరణ మార్పులు, ప్రతికూల పరిస్థితుల కారణంగా జులై 4న వీరు ప్రయాణిస్తున్న బోటు ప్రమాదానికి గురై సముద్రంలో మునిగిపోయింది. ఈ ఘటనలో కారి చిన్న సురక్షితంగా బయటపడగా, మిగిలిన ఆరుగురు జాలర్లు సముద్ర గర్భంలో గల్లంతయ్యారు. గాలింపు చర్యలు ముగిసినట్లు ప్రకటించడంతో మత్స్యకార గ్రామాల్లో తీరని ఆవేదన నెలకొంది.తమ వారు క్షేమంగా తిరిగి వస్తారని వెయ్యి కళ్లతో ఎదురుచూసిన గంగపుత్రుల కుటుంబాలు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నాయి. వారిని ఓదార్చడం ఎవరి తరం కావడం లేదు. ఇంటి పెద్దల ఆచూకీ లభించకపోవడంతో కుటుంబాన్ని ఎలా నెట్టుకురావాలంటూ హృదయవిదారకంగా రోదిస్తున్నారు. కడసారి చూపులకు కూడా నోచుకోలేకపోయామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ దృశ్యాలు స్థానికులను కంటతడి పెట్టిస్తున్నాయి.ఈ ఘోర ప్రమాదంపై రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే స్పందించింది. బాధితుల కుటుంబాలను ఆదుకునేందుకు యుద్ధప్రాతిపదికన చర్యలు చేపట్టింది. గల్లంతైన ఒక్కో మత్స్యకారుడి కుటుంబానికి తక్షణ సహాయం కింద రూ.10 లక్షల చొప్పున ఆర్థిక సాయం అందించాలని మంత్రి అచ్చెన్నాయుడు విశాఖ జిల్లా కలెక్టర్ అభిషిక్త్ కిషోర్‌ను ఆదేశించారు. బాధితులకు ప్రభుత్వం అండగా ఉంటుందని అచ్చెన్నాయుడు భరోసా ఇచ్చారు.మరోవైపు బాధిత మత్స్యకార కుటుంబాలను పరామర్శించేందుకు మత్స్యశాఖ మంత్రి కొల్లు రవీంద్ర ఇవాళ విశాఖ చేరుకున్నారు. ప్రమాద తీవ్రతను, బాధితుల దీనస్థితిని స్వయంగా పరిశీలించనున్న ఆయన, ప్రభుత్వం తరపున ఆయా కుటుంబాలకు భరోసా ఇవ్వనున్నారు. కాగా ప్రమాద తీవ్రత దృష్ట్యా ప్రభుత్వం నుంచి బాధిత కుటుంబాలకు మరింత పరిహారం అందే అవకాశం ఉందని అధికారిక వర్గాలు చెబుతున్నాయి.

## ఎన్‌టీఆర్ జిల్లా కలెక్టర్ డా" జి.లక్ష్మీశ ఐఏఎస్ చేతుల మీదుగా 'అన్‌సీన్ బ్యాటిల్స్ ఆఫ్ ది మైండ్' గ్రంథావిష్కరణ



విజయవాడ,**జులై 08 .అక్షర టైమ్స్** : మానసిక ఆరోగ్యంపై పరిశోధనలను ప్రోత్సహిస్తూ, సమాజంలో మానసిక సమస్యల పట్ల శాస్త్రీయ అవగాహన పెంపొందించేందుకు అంబవరం సెంటర్ ఫర్ సైకాలజికల్ రీసెర్చ్ అండ్ వెల్‌బీయింగ్ అసోసియేషన్ రూపొందించిన "అన్‌సీన్ బ్యాటిల్స్ ఆఫ్ ది మైండ్ -- రీసెర్చ్ ఆన్ మెంటల్ హెల్త్ అండ్ రెసిలియెన్స్" గ్రంథాన్ని ఎన్‌టీఆర్ జిల్లా కలెక్టర్ ఒ జిల్లా మేజిస్ట్రేట్ డా"జి.లక్ష్మీశ, ఐఏఎస్ విజయవాడ కలెక్టర్ కార్యాలయంలో ఆవిష్కరించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ., మానసిక ఆరోగ్యం అనేది వ్యక్తిగత, కుటుంబ,సామాజిక అభివృద్ధికి పునాది అని అన్నారు. ఆధునిక జీవనశైలిలో పెరుగుతున్న ఒత్తిడి, ఆందోళన, నిరాశ వంటి సమస్యలను ఎదుర్కొనేందుకు ప్రజలకు శాస్త్రీయ అవగాహన అవసరమని పేర్కొన్నారు. పరిశోధన ఆధారంగా రూపొందిన ఇలాంటి గ్రంథాలు మానసిక ఆరోగ్య రంగంలో పనిచేస్తున్న నిపుణులతో పాటు సాధారణ ప్రజలకు కూడా ఉపయోగపడతాయని అభినందించారు.డా"అంబవరం ప్రతాప్ రెడ్డి సంపాదకత్వంలో రూపొందిన ఈ పరిశోధనా గ్రంథంలో మొత్తం 11 అధ్యాయాలు ఉన్నాయి. డా"తేజావతి యు.సి. డా" ఎం.శ్రావణ కృష్ణ కుమారి, డా"శ్రీపతి జగదీశ్వరరావు, పడాల రమాదేవి, డా. బిత్రా భాను శంకర్, భావన చింకా, శిరీష కొమ్మన, అతిథ్ ఎం. గౌడ, డా"సాయిప్రియ పేట, శ్రీ లలితాదేవి తమ పరిశోధనా వ్యాసాలను అందించారు.ఈ గ్రంథంలో ఆర్థిక ఒత్తిడి, మానసిక దృఢత్వం, కృత్రిమ మేధస్సు ఆధారిత మానసిక ఆరోగ్య సేవలు, ఆత్మహత్య నివారణ, యుక్తవయస్కుల మానసిక ఆరోగ్యం, ఒబ్సెసివ్ కంపల్సివ్ డిజార్డర్, సైకాలజికల్ క్యాపిటల్, రుమినేషన్, విద్యార్థుల్లో విద్యా ఒత్తిడి, కార్యాలయ మానసిక ఆరోగ్యం, సామాజిక మాధ్యమాల ప్రభావం వంటి సమకాలీన అంశాలను శాస్త్రీయంగా విశ్లేషించారు.పుస్తకావిష్కరణ కార్యక్రమంలో డా. అంబవరం ప్రతాప్ రెడ్డి, డా. సాయిప్రియ పేట, డా. తేజావతి జె., డా. శ్రావణి, డా. అనిత జ్యోతి, రామాదేవి, ప్రవీణ సానా, శైలజ, గోగినేని పద్మజ, తేజా సింగ్ పాల్గొన్నారు. అనంతరం కలెక్టర్ గ్రంథ సంపాదకులు, రచయితలు, కార్యక్రమంలో పాల్గొన్న వారిని అభినందించి, మానసిక ఆరోగ్యంపై పరిశోధనలు మరింత విస్తృతంగా జరగాలని, వాటి ఫలితాలు వివిధ కార్యక్రమాలు నిర్వహించడం ద్వారా సమాజానికి చేరువ కావాలని ఆకాంక్షించారు.ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ, మానసిక ఆరోగ్యంపై శాస్త్రీయ దృక్పథాన్ని ప్రజల్లో పెంపొందించడం, యువతలో భావోద్వేగ దృఢత్వాన్ని పెంచడం, పరిశోధన ఫలితాలను సమాజానికి అందించడం ఈ గ్రంథం ప్రధాన లక్ష్యమని తెలిపారు. ఈ గ్రంథం మనోవిజ్ఞాన నిపుణులు, విద్యార్థులు, వైద్యులు, పరిశోధకులు, కౌన్సెలర్లు మరియు సాధారణ పాఠకులకు ఉపయోగకరమైన సూచిక గ్రంథంగా నిలుస్తుందని పేర్కొన్నారు.


# సర్కారీ బడులకు సంస్కరణల కళ

**మారుతున్న పరిస్థితి, పెరుగుతున్న అడ్మిషన్లు**

**కూటమి ప్రభుత్వ చర్యలతో మారుతున్న ప్రభుత్వ పాఠశాలల పరిస్థితి**

**ప్రమాణాలు, ఫలితాల్లో కార్పొరేట్‌తో ఢీకొంటున్న సర్కారీ విద్యార్థులు**

**గతంలో ఎన్నడూలేని రీతిలో పెరుగుతున్న అడ్మిషన్లు**



ఆరు బయట తరగతులు! ఉపాధ్యాయుల కొరత! వసతులు లేని గదులు! ఇవీ కొంత కాలం కిందటి దాకా ప్రభుత్వ పాఠశాలలంటే గుర్తొచ్చే దృశ్యాలు! పేద తల్లిదండ్రులూ పిల్లల్ని ప్రభుత్వ బడుల్లో చేర్చాలంటే జంకేవారు! ఇప్పుడిప్పుడే పరిస్థితులు చక్కబడుతున్నాయ్! సదుపాయాలు మెరుగవుతున్నాయ్! ప్రమాణాలు, ఫలితాలు ప్రైవేట్‌తో పోటీపడుతున్నాయ్! తల్లిదండ్రుల చూపు కార్పొరేట్ స్కూల్స్ కాదని ప్రభుత్వ బడుల వైపు మళ్లుతోంది. ఫలితంగా గుంటూరు జిల్లాలోని సర్కారీ పాఠశాలలు విద్యార్థులతో కళకళలాడుతున్నాయి.ప్రైవేటు స్కూల్‌లో సీటు దొరక్కపోతే తప్పనిసరి పరిస్థితుల్లో ప్రభుత్వ బడిలో చేర్పించడం పాత మాట. కార్పొరేట్ స్కూళ్లు ఫీజు వెసులుబాటు కల్పిస్తున్నా కాదని సర్కారు బడుల్లో పిల్లల్ని చేర్పించడం ప్రభుత్వ పాఠశాలలపై పెరిగిన నమ్మకానికి ఉదాహరణ. ఎన్నడూలేని రీతిలో ఈ ఏడాది ప్రభుత్వ పాఠశాలల్లో అడ్మిషన్లు పెరిగాయి. గుంటూరు జిల్లాలోని ప్రతి మున్సిపల్ పాఠశాల తరగతులు వందలాది విద్యార్థులతో నిండిపోయాయి. కూటమి ప్రభుత్వం విద్యారంగంలో తీసుకొచ్చిన సంస్కరణల ఫలితంగా ప్రభుత్వ బడిలో సీటు దొరికితే చాలు అనుకునే పరిస్థితి వచ్చింది. అధునాతన తరగతి గదులు, అనుభవం, నైపుణ్యం కలిగిన టీచర్లు, వెనుకబడిన పిల్లలకు ప్రత్యేక తరగతులు వంటి అనేక అంశాలు ప్రభుత్వ పాఠశాలల దశ, దిశ మార్చేశాయి. గుంటూరులో 17 మున్సిపల్ ప్రభుత్వ పాఠశాలలుండగా చేబ్రోలు మహాలక్ష్మీ పుల్లయ్య పాఠశాలలో ఈ ఏడాది విద్యార్థుల సంఖ్య 900కి చేరింది. పదో తరగతి ఫలితాల్లో పాఠశాల విద్యార్థి 583 మార్కులతో నగరంలో మూడోస్థానంలో నిలవగా 34 మంది 500 పైగా మార్కులతో సత్తా చాటారు. వంద శాతం ఉత్తీర్ణత సాధించడంతో ఈ పాఠశాలలో చేర్పించేందుకు విద్యార్థుల తల్లిదండ్రుల్లో ఆసక్తి పెరిగింది. ఘాఅగ్రహారం ఖాదీవీ పాఠశాలలో ప్రస్తుతం 800 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. ఈ పాఠశాల విద్యార్థి పదో తరగతిలో 585 మార్కులతో నగరంలో మొదటిస్థానంలో నిలవగా మరో ఇద్దరు 584 మార్కులతో రెండో స్థానంతో మెరిశారు. 162 మందిలో 9 మందికి 550కి పైగా మార్కులు, 21 మందికి 500 పైగా మార్కులు వచ్చాయి. ఈ రెండు పాఠశాలలతో పాటు ఇతర పాఠశాలల నుంచి అత్యధిక మార్కులు సాధించిన పిల్లలను మీూా గల్లా మాధవి దిల్లీ పర్యటనకు తీసుకెళ్లి ఉపరాష్ట్రపతిని కలిసేలా చేయడం విద్యార్థుల్లో కొత్త ఉత్సాహం నింపింది."పిల్లల కోసం ఉద్దేశించిన 100 రోజుల కార్యాచరణ ప్రణాళిక అనేది, ఫెయిల్ అయిన ఏడుగురు పదవ తరగతి విద్యార్థుల కోసం తీసుకున్న చర్య. ఇంకా ఎవరైనా పాస్ అవ్వలేకపోతే, వారికోసం మేము ప్రత్యేక వేసవి తరగతులను ఏర్పాటు చేసి, వారికి ప్రత్యేక శిక్షణను అందించాం. దానితో, మేము అందరినీ పాస్ చేయించగలిగాం. మాకు 100 శాతం ఉత్తీర్ణత రేటు ఉంది"-లలిత్‌బాబు, ఉపాధ్యాయుడు.కూటమి ప్రభుత్వం ప్రభుత్వ బడుల్లో మంచి కనీస సదుపాయాలతో పాటు డిజిటల్ విద్య, కంప్యూటర్ ల్యాబ్స్‌తో పాటు నాణ్యమైన బోధన, సాంకేతిక ఆధారిత విద్య వంటి వసతులు కల్పిస్తోంది. దీంతో ఉత్తమ ఫలితాలు వస్తున్నాయి."పాఠశాలలో చేరిన వెంటనే పిల్లలందరికీ పుస్తకాలు ఇవ్వడం, వారికి యూనిఫాంలు అందించడం, అన్నంతో కూడిన మధ్యాహ్న భోజన పథకాన్ని అందించడం వంటివన్నీ ఇతర ప్రభుత్వ పాఠశాలలపై నమ్మకాన్ని పెంచాయి. విద్యార్థులు చూడటానికి, చేరడానికి ఇక్కడికి వస్తారు."-సలీం బాషా, డీఈవో.

# తీరని పవన్ హామీ.. వీరాభిమాని నిరంజన్ అనారోగ్యంతో మృతి

**పవన్ కల్యాణ్ వీరాభిమాని పొనుగంటి నిరంజన్ (17) కన్నుమూత**

**అరుదైన వ్యాధితో హనుమకొండలో తుదిశ్వాస విడిచిన 'చోటా గబ్బర్ సింగ్'**

**గత నెలలో నిరంజన్‌ను స్వయంగా కలిసి పరామర్శించిన పవన్**

**'ఓజీ-2' సినిమా కలిసి చూద్దామని అభిమానికి మాట ఇచ్చిన డిప్యూటీ సీఎం**

జనసేన అధినేత, ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ వీరాభిమాని పొనుగంటి నిరంజన్ (17) అనారోగ్యంతో కన్నుమూశారు. కొంతకాలంగా అరుదైన జన్యు సంబంధిత వ్యాధి, కిడ్నీ సమస్యలతో బాధపడుతున్న ఆయన, ఆరోగ్యం విషమించడంతో హనుమకొండలోని తన నివాసంలో తుదిశ్వాస విడిచారు. స్థానికంగా 'చోటా గబ్బర్ సింగ్'గా పిలుచుకునే నిరంజన్ మృతితో విషాదఛాయలు అలుముకున్నాయి.చిన్నతనం నుంచే తీవ్ర అనారోగ్యంతో మంచానికే పరిమితమైన నిరంజన్, పవన్ కల్యాణ్‌కు వీరాభిమాని. తన అభిమాన నటుడిని జీవితంలో ఒక్కసారైనా కలవాలన్నది ఆయన చివరి కోరిక. ఈ విషయాన్ని జనసేన కార్యకర్తలు సోషల్ మీడియా ద్వారా పవన్ దృష్టికి తీసుకెళ్లారు. దీనికి స్పందించిన పవన్ కల్యాణ్, గత నెలలో స్వయంగా హనుమకొండలోని నిరంజన్ ఇంటికి వెళ్లి పరామర్శించారు. మంచంపై ఉన్న నిరంజన్‌ను ఆత్మీయంగా హత్తుకుని ధైర్యం చెప్పారు.ఈ సందర్భంగా నిరంజన్ మంచంపై పడుకునే చేసిన డాన్స్




వీడియోలను చూసి పవన్ మురిసిపోయారు. త్వరలోనే కోలుకోవాలని ఆకాంక్షిస్తూ, ఇద్దరూ కలిసి 'ఓజీ - 2' సినిమా చూద్దామని, అందుకోసం ప్రత్యేకంగా షో వేయిస్తానని నిరంజన్‌కు పవన్ మాట ఇచ్చారు. అయితే, ఆ కోరిక తీరకుండానే నిరంజన్ కన్నుమూయడం పలువురిని కలచివేస్తోంది.

# ప్రభుత్వ అధికారిక లాంఛనాలతో కొమ్మిడి నర్సింహారెడ్డి అంత్యక్రియలు

**భువనగిరి ఎమ్మెల్యేగా రెండు సార్లు ఎన్నికైన నర్సింహారెడ్డి**

**తన వందలాది ఎకరాల భూమిని పేదలకు రాసిచ్చిన గొప్ప దాత**

**స్వగ్రామమైన బీబీనగర్ మండలం బ్రాహ్మణపల్లిలో అంత్యక్రియలు**



రెండుసార్లు ఎమ్మెల్యేగా చేసినా సొంత ఇల్లు, కారు కూడా లేకుండా కేవలం ఒక పాత స్కూటర్‌తో సాధారణ జీవితం గడిపిన అసలు సిసలైన 'ప్రజల మనిషి', కాంగ్రెస్ సీనియర్ నేత కొమ్మిడి నర్సింహారెడ్డికి తెలంగాణ ప్రభుత్వం అత్యున్నత గౌరవం కల్పించింది. భువనగిరి మాజీ ఎమ్మెల్యే అయిన నర్సింహారెడ్డి నిన్న తుదిశ్వాస విడిచిన సంగతి తెలిసిందే. ఆయన అంత్యక్రియలను ప్రభుత్వ అధికారిక లాంఛనాలతో నిర్వహించాలని రేవంత్ రెడ్డి సర్కార్ నిర్ణయించింది. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు ఆదేశాల మేరకు జనరల్ అడ్మినిస్ట్రేషన్ డిపార్ట్‌మెంట్ అధికారిక ఉత్తర్వులను జారీ చేసింది.రాజకీయాల్లో నీతికి, నిజాయతీకి బ్రాండ్ అంబాసిడర్‌లా బతికిన నర్సింహారెడ్డి లాంటి గొప్ప నిరాడంబర నాయకుడికి ఈ రకమైన గౌరవం దక్కడం పట్ల సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది. తనకున్న వందలాది ఎకరాల భూమిని పేదలకు రాసిచ్చి 'భూదాన రెడ్డి'గా పేరు తెచ్చుకున్న ఆయన, చివరి రోజుల్లో అద్దె ఇంట్లో ఉంటూ కన్నుమూశారు.ఈ అరుదైన ప్రజా నాయకుడికి తుది వీడ్కోలు ఘనంగా పలికేందుకు యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి, జిల్లా ఎస్పీలకు సీఎస్ సంజయ్ జాజు కీలక ఆదేశాలు జారీ చేశారు. నర్సింహారెడ్డి స్వగ్రామమైన బీబీనగర్ మండలం బ్రాహ్మణపల్లిలో అధికారిక లాంఛనాలతో అంత్యక్రియలు పూర్తి చేసేందుకు అవసరమైన అన్ని పోలీస్ బందోబస్తు, ఇతర ఏర్పాట్లను యంత్రాంగం చకచకా పూర్తి చేస్తోంది.

## ఉగ్రలింకుల కేసు - విజయవాడలో మరోసారి ఎన్ఐఏ సోదాలు

**ఆన్‌లైన్ టెర్రర్ రాడికలైజేషన్ నెట్ వర్క్ కేసు**

**విచారణ వేగవంతం చేసిన జాతీయ దర్యాప్తు సంస్థ**

**విజయవాడలోని పలు ప్రాంతాల్లో ఎన్ఐఏ ముమ్మర సోదాలు**



ఆన్‌లైన్ టెర్రర్ రాడికలైజేషన్ నెట్ వర్క్ కేసులో జాతీయ దర్యాప్తు సంస్థ విచారణ వేగవంతం చేసింది. తెల్లవారుజాము నుంచి విజయవాడలోని వించిపేట పరిసర ప్రాంతాల్లో ఎన్ఐఏ ముమ్మర సోదాలు జరుపుతోంది. ఈ ఏడాది మార్చి నెలలో విజయవాడలో అరెస్టైన ముగ్గురు ప్రధాన నిందితులకు ఎవరెవరితో సంబంధాలున్నాయో తెలుసుకునేందుకు సోదాలు చేస్తున్నారు. నిందితుల ఇళ్లు గతంలో వారు సంచరించిన ప్రాంతాలలో డిజిటల్ ఆధారాలు, కమ్యూనికేషన్ డివైజ్‌లు, ఆర్థిక లావాదేవీల పత్రాలను సేకరణపై దర్యాప్తు అధికారులు దృష్టి సారించారు. వించిపేట ప్రాంతంలో ఉగ్రవాద అనుమానితుల ఇళ్లలో సోదాలు నిర్వహించడం వరుసగా ఇది మూడోసారి.విజయవాడ వించిపేటకు చెందిన బైక్ డ్రైవర్ మహమ్మద్ రహ్మతుల్లా షరీఫ్ సోషల్ మీడియా వేదికల ద్వారా జిహాదీ కంటెంట్‌ను ప్రచారం చేస్తున్నట్లు గుర్తించి విజయవాడ టూ టౌన్ పోలీసులు ఈ ఏడాది మార్చి 22న అరెస్ట్ చేశారు. విచారణలో భవానిపురానికి చెందిన మహమ్మద్ డానిష్, మహంతిపురానికి చెందిన మీర్జా సోహైల్ బేగ్‌లతో కలిసి వీరు ఉగ్రవాద కార్యకలాపాలకు ప్రణాళికలు వేస్తున్నట్లు తేలింది. ఈ నెట్‌వర్క్ పరిధి ఇతర రాష్ట్రాలకు కూడా విస్తరించి ఉండటంతో, కేంద్ర హోం మంత్రిత్వ శాఖ ఆదేశాల మేరకు మే 13, ఎన్ఐఏ విచారణ ప్రారంభించింది.ఈ ముఠాకు కేవలం ఆంధ్రప్రదేశ్ మాత్రమే కాకుండా తెలంగాణ, మహారాష్ట్ర, దిల్లీ, కర్ణాటక, పశ్చిమ బెంగాల్, బిహార్, రాజస్థాన్ వంటి రాష్ట్రాల్లోని మొత్తం 13 మంది నిందితులతో సంబంధాలు ఉన్నట్లు స్పష్టమైంది. ఈ కేసులో హైదరాబాద్‌కు చెందిన సయ్యద్ బేగం సహా ఇప్పటివరకు మొత్తం 12 మందిని నిందితులను అరెస్ట్ చేశారు. నిందితులంతా రాజమహేంద్రవరం సెంట్రల్ జైలులో రిమాండ్‌లో ఉన్నారు. కోర్టు అనుమతితో నిందితులను కస్టడీలోకి తీసుకున్న అధికారులు విచారణను మరింత వేగవంతం చేశారు.నిందితులంతా 'అల్ మాలిక్ యూత్ ఇస్లామిక్ కమిటీ' పేరుతో సోషల్ మీడియా గ్రూపులను సృష్టించి, యువతను ఆకర్షించేందుకు వంటి నిషేధిత ఉగ్రవాద సంస్థల జిహాదీ వీడియోలను ప్రచారం చేసినట్లు చీఊూ గుర్తించింది. ప్రధాన నిందితుడు టెలిగ్రామ్, ఇన్‌స్టాగ్రామ్ ద్వారా అల్-హకీమ్ శుకూర్ అనే విదేశీ హ్యాండ్లర్‌తో నిరంతరం కమ్యూనికేషన్‌లో ఉన్నట్లు, ఆన్‌లైన్‌లో పేలుడు పదార్థాల తయారీకి సంబంధించిన సమాచారాన్ని శోధించినట్లు డిజిటల్ ఆధారాలు లభించాయి.ప్రస్తుతం అరెస్టు అయిన నిందితులంతా రాజమహేంద్రవరం సెంట్రల్ జైలులో రిమాండ్‌లో ఉన్నారు. కోర్టు అనుమతితో నిందితులను కస్టడీలోకి తీసుకున్న ఎన్ఐఏ అధికారులు, వారి అంతర్జాతీయ లింకులు, ఉగ్ర నిధుల లభ్యతపై విచారణను మరింత వేగవంతం చేశారు. నిందితులపై చట్టవ్యతిరేక కార్యకలాపాల నిరోధక చట్టం దేశద్రోహం కింద కఠిన చర్యలు కొనసాగుతాయని అధికారులు వివరించారు.

## తెలంగాణ విఫలం కాలేదు.. సఫలమై నిలిచింది

**ప్రపంచ బ్యాంకు నివేదికపై కేటీఆర్ ఆనందం**

**తెలంగాణ ఎగువ మధ్య స్థాయిని దాటిన రాష్ట్రం అంటూ ప్రపంచ బ్యాంకు నివేదిక**

**ఎక్స్ వేదికగా సంతోషం వ్యక్తం చేసిన కేటీఆర్**

**కేసీఆర్ దార్శనికత వల్లే ఈ అద్భుతం సాధ్యమైందని వ్యాఖ్య**



'తెలంగాణ దివాలా తీసింది' అంటూ దిక్కుమాలిన ప్రచారాలు చేసేవాళ్లకు గట్టి కౌంటర్ పడిందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. 'ప్రపంచ బ్యాంకు' ఇచ్చిన తాజా నివేదికలో... తెలంగాణ ఎగువ మధ్య స్థాయిని దాటిన రాష్ట్రం అంటూ పేర్కొనడంపై కేటీఆర్ సంతోషం వ్యక్తం చేశారు. దేశంలోనే ఈ ఘనత సాధించిన టాప్-5 అగ్ర రాష్ట్రాల్లో తెలంగాణ నిలవడం మనకందరికీ గర్వకారణమంటూ ఎక్స్ (ట్విట్టర్) వేదికగా పోస్ట్ పెట్టారు.ఈ సందర్భంగా కాంగ్రెస్ ప్రభుత్వంపై పరోక్షంగా కేటీఆర్ విమర్శలు గుప్పించారు. కేసీఆర్ దార్శనిక పాలన వల్లే ఈ అద్భుతం సాధ్యమైందని కేటీఆర్ స్పష్టం చేశారు. పదేళ్ల కిందట వరకు దరిద్రం తాండవించిన ప్రాంతం కాస్తా... నేడు ధనిక రాష్ట్రంగా మారిందని అన్నారు. తెలంగాణ ప్రజలు బికారులు కాదని, సిరిసంపదలతో తులతూగే తెలంగాణ తల్లి బిడ్డలని వ్యాఖ్యానించారు. తమ చెమటను, నైపుణ్యాన్ని, మేధస్సును ధారపోసి తెలంగాణను శిథిలాల నుంచి శిఖరాలకు చేర్చిన ప్రతి పౌరుడికీ ఈ సందర్భంగా సెల్యూట్ చేస్తున్నామని చెప్పారు."తెలంగాణ వస్తే ఏం పెరిగింది అని అడిగేవారు చూడాలి. ఇక్కడ జాతి సంపద పెరిగింది, జనం ఆదాయం అద్భుతంగా వృద్ధి చెందింది" అని కేటీఆర్ అన్నారు. కేసీఆర్ హయాంలో రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ అద్వితీయంగా ముందుకు దూసుకెళ్లిందని కేవలం జాతీయ నివేదికలే కాదు, ఇప్పుడు ఏకంగా అంతర్జాతీయ సంస్థలే స్టాంప్ వేసి చెబుతున్నాయన్నారు. రాజకీయ స్వార్థం కోసం ప్రతిదానికీ 'దివాలా.. దివాలా' అంటూ మైకుల ముందు అరిచే వాళ్ల నోళ్లు మూయించడానికి ప్రపంచ బ్యాంకు ఇచ్చిన ఈ తాజా నివేదికే ఒక పవర్ ఫుల్ సమాధానమని పేర్కొన్నారు.

# మెంతులను ఇలా వాడారంటే..100 ఏళ్లు మీ గుండె సేఫ్..! తప్పక తెలుసుకోండి..











మెంతులతో ఆరోగ్యానికి అనేక లాభాలు ఉన్నాయని ఆయుర్వేద ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు. అనేక వైద్య పరిశోధనలు సైతం మెంతులు శరీరానికి ఎంతో మేలు చేస్తాయని చెబుతున్నాయి.. ముఖ్యంగా రాత్రి పూట నీళ్లల్లో నానబెట్టిన మెంతి నీరు ఉదయాన్నే తీసుకుంటే ఫలితాలు అధికంగా ఉంటాయట. అయితే, మెంతులను తినేందుకు ఇంతకంటే మెరుగైన, శక్తివంతమైన పద్ధతి మరొకటి ఉందని చెబుతున్నారు. అదేంటంటే.. మెంతులను నెయ్యిలో వేయించి పాలలో కలుపుకుని తీసుకోవడం వల్ల అమోఘమైన ఆరోగ్య రహస్యాలు దాగి ఉన్నాయని చెబుతున్నారు. ఆ సీక్రెట్స్ ఏంటో తెలియాలంటే పూర్తి వివరాల్లోకి వెళ్లోండే..ఉదయాన్నే ఖాళీ కడుపుతో గ్లాసుడు మెంతి నీళ్లు తాగితే ఆరోగ్యానికి మంచిదని నిపుణులు చెబుతున్నారు. ప్రస్తుతం చాలామంది ఇది ఫాలో అవుతున్నారు కూడా. పరగడుపునే ఈ నీటిని తీసుకోవటం వల్ల రక్తంలో షుగర్ లెవల్స్ కంట్రోల్ లో ఉంటాయి. బరువు తగ్గడానికి కూడా హెల్ప్ అవుతుంది. అయితే పోషకాహార నిపుణుల ప్రకారం.. అదే మెంతులను నెయ్యిలో వేయించి పాలలో కలుపుకుని తీసుకోవడం వల్ల ఊహించని లాభాలు ఉన్నాయని చెబుతున్నారు. సాధారణంగా మెంతులు చేదుగా ఉంటాయి. కానీ వాటిని నెయ్యిలో దోరగా వేయించడం వల్ల ఆ చేదుదనం చాలా వరకు తగ్గిపోతుందట. పైగా వీటికి చక్కటి సువాసన వస్తుంది. ఇలా వేయించిన మెంతులకు మంచి రుచి పెరగడంతో పాటు ఆరోగ్య ప్రయోజనాలు రెట్టింపు అవుతాయని చెబుతున్నారు. మెంతులలో మంచి ఫైబర్ పుష్కలంగా ఉంటుంది. దీనిని నెయ్యితో వేయించినప్పుడు నెయ్యిలోని ఆరోగ్యకరమైన కొవ్వులు జీర్ణక్రియను సులభతరం చేస్తాయి. ఇది మలబద్ధకం, గ్యాస్ వంటి సమస్యల నుంచి ఉపశమనం కలిగిస్తుంది. వేయించిన మెంతులను పాలలో కలపడం వల్ల ప్రయోజనాలు మరింత పెరుగుతాయి. మెంతులు రక్తంలో చక్కెర స్థాయిలను నియంత్రించడంలో అద్భుతంగా పనిచేస్తాయి. నెయ్యితో కలిపి తీసుకున్నప్పుడు ఈ గుణం మరింత ప్రభావవంతంగా పనిచేస్తుందని నిపుణులు చెబుతున్నారు. మెంతులలో ఉండే యాంటీఆక్సిడెంట్లు శరీరంలో ఆక్సీకరణ ఒత్తిడిని తగ్గిస్తాయి. నెయ్యితో కలిసినప్పుడు ఇవి రక్తంలోని చెడు కొలెస్ట్రాల్ ను నియంత్రించి, గుండె ఆరోగ్యాన్ని కాపాడతాయి. వేయించిన మెంతులు పాలతో కలపడం వల్ల అదనపు ప్రయోజనాలు అందుతాయి. పాలు కడుపులో మంట, అసౌకర్యం వంటి సమస్యలను తగ్గించి ఉపశమనాన్ని కలిగిస్తాయి. మెంతులు పేగుల ఆరోగ్యానికి మేలు చేస్తే, పాలు కడుపుకు చల్లదనాన్నిస్తాయి. ఈ రెండింటి కలయిక జీర్ణవ్యవస్థకు ఒక వరం లాంటిది. ఈ మిశ్రమం శరీరంలో పోషకాల శోషణను మెరుగుపరుస్తుంది. ఇందుకోసం ఒక టీస్పూన్ మెంతులను కొద్దిగా నెయ్యిలో దోరగా వేయించి, వాటిని ఒక గ్లాసు గోరువెచ్చని పాలలో కలుపుకుని రాత్రి పడుకునే ముందు లేదా ఉదయం తాగవచ్చు.

# రాత్రిపూట ఇలాంటి లక్షణాలు కనిపిస్తే బీ అలర్ట్ మీ కిడ్నీలు డేంజర్‌లో ఉన్నట్టే..!



రాత్రి నిద్ర లేస్తే.. విశ్రాంతి లేకపోవడం, నిద్రపోవడంలో ఇబ్బంది, తరచుగా మేల్కొవడం, నిద్ర నాణ్యత సరిగా లేకపోవడం వంటివి మూత్రపిండాల సంబంధిత సమస్యకు సంకేతం కావచ్చు అంటున్నారు వైద్యులు. నిద్రలో తరచుగా కండరాల నొప్పులు, ఆకస్మిక కుదుపులు అలసటను మాత్రమే సూచిస్తాయి. అవి కాల్షియం, ఎలక్ట్రోలైట్ అసమతుల్యతను సూచిస్తాయి. ఇది మూత్రపిండాల వైఫల్యం వల్ల సంభవించవచ్చు. మన శరీరాన్ని శు భ్రంగా ఉంచడానికి పనిచేసే మూత్రపిండాలు సరిగ్గా పనిచేయకపోతే.. దాని ఎఫెక్ట్ రాత్రిపూట స్పష్టంగా కనిపిస్తుందని వైద్య నిపుణులు చెబుతున్నారు. రాత్రిపూట మన శరీరంలో కనిపించే కొన్ని లక్షణాలు మన మూత్రపిండాలు ఆరోగ్యంగా లేవని చెప్పటానికి సంకేతాలు అంటున్నారు. అలాంటి లక్షణాల గురించి మనం తప్పక తెలుసుకోవాలి. ఎందుకంటే..ఒక్కోసారి మనం చేసే చిన్న నిర్లక్ష్యంతో భారీ మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుంది. కిడ్నీలు సరిగ్గా పనిచేసినప్పుడే మనం ఆరోగ్యం ఉండేందుకు దోహదపడుతుంది. లేదంటే..ప్రాణాంతకంగా మారే ప్రమాదం ఉంంటున్నారు నిపుణులు. మీ కిడ్నీ సమస్యల్లో ఉందని చెప్పే కొన్ని సంకేతాలను ఇక్కడ చూద్దాం..మీరు ఉదయం లేదా అర్ధరాత్రి నిద్ర లేచినప్పుడు మీ కాళు ్ళ వాపుగా ఉంటే జాగ్రత్తగా ఉండాలని వైద్య ఆరోగ్య నిపుణులు చెబుతున్నారను. ఎందుకంటే..మూత్రపిండాలు సరిగ్గా పనిచేయకపోతే ఇలాంటి పరిస్థితి ఎదురవుతుందని అంటున్నారు. రాత్రిపూట మేల్కొని తరచుగా బాత్రూమ్‌కు వెళ్లాల్సి రావడం కూడా సాధారణ విషయం కాదని అంటున్నారు. రెండు నుండి మూడు గంటలకు లేస్తుంటే, మూత్రపిండాలు సామర్థ్యాన్ని కోల్పోతున్నాయని సంకేతం కావచ్చు అంటున్నారు. రాత్రి బాగా నిద్రపోయినా మీరు రోజంతా తల తిరుగుతున్నట్లు, నిరంతరం అలసిపోయినట్లు, నీరసంగా ఉన్నట్లు అనిపిస్తే మీ మూత్రపిండాలు మీ శరీరం నుండి టాక్సిన్స్ తొలగించలేకపోతున్నాయని అర్థం.మూత్రపిండాలు తమ పనిని చేయడంలో విఫలమైనప్పుడు శరీరంలో ద్రవం పేరుకుపోతుంది. ఇది ఊపిరితిత్తులకు చేరుతుంది. నిద్రలో ఈ సమస్య గుర్తించదగినదిగా మారుతుంది. రాత్రి నిద్ర లేస్తే.. విశ్రాంతి లేకపోవడం, నిద్రపోవడంలో ఇబ్బంది, తరచుగా మేల్కొవడం, నిద్ర నాణ్యత సరిగా లేకపోవడం వంటివి మూత్రపిండాల సంబంధిత సమస్యకు సంకేతం కావచ్చు అంటున్నారు వైద్యులు. నిద్రలో తరచుగా కండరాల నొప్పులు, ఆకస్మిక కుదుపులు అలసటను మాత్రమే సూచిస్తాయి. అవి కాల్షియం, ఎలక్ట్రోలైట్ అసమతుల్యతను సూచిస్తాయి. ఇది మూత్రపిండాల వైఫల్యం వల్ల సంభవించవచ్చు. ఆరోగ్య నిపుణులు, ఇతర అధ్యాయనాల ద్వారా అందిన సమాచారం మేరకు ఈ వివరాలు అందిస్తున్నాం.. ఇందులోని అంశాలు కేవలం అవగాహన కోసం మాత్రమే. ఏదైనా సందేహాలు,సమస్యలు ఉన్నా వైద్యులను సంప్రదించడమే మంచిదని గమనించగలరు.

# పైనాపిలే కదా అని తీసిపారేయకండి.. ప్రయోజనాలు తెలిస్తే షాకవుతారు!



ఫైనాపిల్ మీ చర్మాన్ని ఆరోగ్యంగా ఉంచడంలో సహాయపడుతుంది. ఇందులోని విటమిన్ సి ముడుతలను తగ్గిస్తుంది. ఇది చర్మానికి హానిని కూడా నివారిస్తుంది. దీన్ని తీసుకోవడం వల్ల ముఖంలో మెరుపు పెరుగుతుంది. పైనాపిల్ శరీరంలో మంటను తగ్గించడం ద్వారా రోగనిరోధక శక్తిని పెంచుతుంది.. ఫైనాపిల్ పండు, జీర్ణక్రియకు సహాయం చేయడం నుండి రోగనిరోధక శక్తిని మెరుగుపరచడం వరకు అనేక ఆరోగ్య ప్రయోజనాలను అందిస్తుంది. అలాగే, ఈ పండులో విటమిన్ సి, ఖనిజాలు, యాంటీఆక్సిడెంట్లు పుష్కలంగా ఉన్నాయి. పరిశోధనలన్నీ క్యాన్సర్‌తో పోరాడటానికి, మీ చర్మం మెరుపును పెంచడంలో ఇది ఉపయోగపడుతుందని వెల్లడిస్తున్నాయి. దాని మరిన్ని ప్రయోజనాల గురించి తెలుసుకుందాం.

### పైనాపిల్ ప్రయోజనాలు ఏమిటి?

విటమిన్లు, ఖనిజాలతో సమృద్ధిగా: పైనాపిల్ పండులో విటమిన్లు, మినరల్స్ పుష్కలంగా ఉన్నాయి. ఇవి శరీరం రోజువారీ పనితీరుకు అవసరం. ఇంటర్నేషనల్ జర్నల్ ఆఫ్ న్యూట్రిషన్ అండ్ ఫుడ్ సైన్సెస్‌లో ప్రచురించబడిన పరిశోధన ప్రకారం, పైనాపిల్స్‌లో ఫైబర్, పొటాషియం, కాల్షియం కూడా తగిన మొత్తంలో ఉంటాయి. అందుకే దీన్ని తీసుకోవడం చాలా మంచిది. పైనాపిల్స్‌లో యాంటీఆక్సిడెంట్లు పుష్కలంగా ఉన్నాయి: మన శరీరాన్ని ఆరోగ్యంగా ఉంచడంలో యాంటీఆక్సిడెంట్లు చాలా ముఖ్యమైన పాత్ర పోషిస్తాయి. కణాల నష్టంతో పోరాడుతుంది. అలాగే తీవ్రమైన వ్యాధుల నుండి రక్షిస్తుంది. అందుకే మీరు మీ ఆహారాన్ని మరింత ఆరోగ్యవంతంగా మార్చుకోవడానికి ఈ పండును తినవచ్చు. జీర్ణక్రియలో సహాయాలు: పైనాపిల్ పండు మరొక ప్రయోజనం ఏమిటంటే ఇది జీర్ణక్రియకు సహాయపడుతుంది. బరువు తగ్గడంలో కూడా సహాయపడుతుంది. ఫైబర్ అధికంగా ఉంటుంది: పైనాపిల్ ఫైబర్ గొప్ప మూలం. ఇది మలబద్ధకం సమస్యను తగ్గిస్తుంది. దీర్ఘకాలిక మలబద్ధకం సమస్యతో బాధపడే వారికి పైనాపిల్ పండు మంచి ఔషధం.


క్యాన్సర్ నివారించవచ్చు: పైనాపిల్ తినడం వల్ల క్యాన్సర్ నివారించవచ్చు. ఎందుకంటే చాలా క్యాన్సర్లు ఆక్సీకరణ ఒత్తిడి వల్ల వస్తాయి. పైనాపిల్‌లో ఆక్సీకరణ ఒత్తిడిని తగ్గించే గుణం ఉంది. తద్వారా క్యాన్సర్ ప్రమాదాన్ని తగ్గిస్తుంది. అందుకే క్యాన్సర్ చికిత్సకు కూడా దీన్ని ఉపయోగిస్తారని అధ్యయనం చెబుతోంది. రోగనిరోధక శక్తిని పెంచుతుంది: పైనాపిల్ శరీరంలో మంటను తగ్గించడం ద్వారా రోగనిరోధక శక్తిని పెంచుతుంది. నొప్పిని తగ్గించే లక్షణాలు: పైనాపిల్‌లో యాంటీ ఇన్‌ఫ్లమేటరీ గుణాలు ఉన్నందున, ఇది నొప్పిని తగ్గిస్తుంది. ఫుడ్స్‌లో ప్రచురించబడిన ఒక అధ్యయనం ఆర్థరైటిస్ వల్ల కలిగే నొప్పికి చికిత్స చేయడానికి పైనాపిల్ మంచిదని పేర్కొంది. ఇది వెన్నునొప్పిని కూడా తగ్గిస్తుంది. ఇది ఋతు నొప్పిని కూడా తగ్గిస్తుంది. కానీ ఋతు చక్రం మొదటి మూడు రోజులలో తీసుకోవాలి. ఆరోగ్యకరమైన చర్మం మీ సొంతం అవుతుంది: పైనాపిల్ మీ చర్మాన్ని ఆరోగ్యంగా ఉంచడంలో సహాయపడుతుంది. ఇందులోని విటమిన్ సి ముడుతలను తగ్గిస్తుంది. ఇది చర్మానికి హానిని కూడా నివారిస్తుంది. దీన్ని తీసుకోవడం వల్ల ముఖంలో మెరుపు పెరుగుతుంది. ఇందులోని అంశాలు కేవలం అవగాహన కోసం మాత్రమే. నిపుణుల సలహాలు, సూచనల మేరకు అందించడం జరిగింది. ఏవైనా సందేహాలు ఉంటే నిపుణులను సంప్రదించండి.

# ఉదయాన్నే జీలకర్ర నీరు తాగితే ఎలాంటి లాభాలు ఉంటాయో తెలిస్తే ఆశ్చర్యపోతారు!



జీలకర్ర వాడకం ఆరోగ్య ప్రయోజనాలలో కూడా చాలా ఉపయోగకరంగా ఉంటుంది. ప్రముఖ డైటీషియన్ ఆయుషి యాదవ్ మాట్లాడుతూ.. రోజూ జీలకర్ర నీటిని తాగితే అద్భుతమైన ప్రయోజనాలు లభిస్తాయని చెప్పారు. జీర్ణవ్యవస్థను బలోపేతం చేయడానికి, దాని నీటిని తాగడం చాలా ముఖ్యం.. జీలకర్ర ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తుంది. ఇది అందరి ఇళ్లలో ప్రతి వంటగదిలో అందుబాటులో ఉంటుంది. జీలకర్ర అనేది ప్రతి వంటల్లో ఉపయోగిస్తుంటారు. దీని వల్ల ఆహారం రుచిగా ఉండడమే కాకుండా ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తుంది. జీలకర్ర వాడకం ఆరోగ్య ప్రయోజనాలలో కూడా చాలా ఉపయోగకరంగా ఉంటుంది. ప్రముఖ డైటీషియన్ ఆయుషి యాదవ్ మాట్లాడుతూ.. రోజూ జీలకర్ర నీటిని తాగితే అద్భుతమైన ప్రయోజనాలు లభిస్తాయని చెప్పారు. జీర్ణవ్యవస్థను బలోపేతం చేయడానికి, దాని నీటిని తాగడం చాలా ముఖ్యం. జీలకర్ర నీటిని ఖాళీ కడుపుతో తాగితే శరీరంలోని అనేక వ్యాధులు నయమవుతాయి. బలహీనమైన శరీరాన్ని బలోపేతం చేయడంలో ఇది చాలా ఉపయోగకరంగా ఉంటుంది. దీన్ని రోజూ తాగడం వల్ల రక్త ప్రసరణ మెరుగుపడుతుంది. ఇందులో అనేక రకాల పోషకాలు ఉంటాయి. ఇవి శరీరానికి ఎంతో మేలు చేస్తాయి. జీలకర్రలో యాంటీ ఇన్ఫ్లమేటరీ గుణాలు ఉన్నాయి. ఇది మీ వ్యాధిని నయం చేయడంలో మీకు చాలా సహాయపడుతుంది. మీరు ప్రతిరోజూ ఉదయం తప్పనిసరిగా జీలకర్ర నీటిని తాగాలి. ఇది శరీరంలో వాపులను తగ్గించడానికి కూడా పనిచేస్తుంది. ఇది మాత్రమే కాదు, వివిధ వ్యాధుల నుండి మిమ్మల్ని దూరంగా ఉంచడంలో ఇది చాలా సహాయపడుతుంది. అలాగే శరీరంలోని మురికిని తొలగిస్తుంది. చాలా మందికి శ్వాస సంబంధిత సమస్యలు చాలా ఉన్నాయి. మీరు ఖాళీ కడుపుతో ప్రతిరోజూ జీలకర్ర నీటిని తాగితే, మీరు శ్వాస ఆరోగ్యానికి సంబంధించిన అనేక సమస్యల నుండి బయటపడవచ్చు. శ్వాసకోశంలో ఉపశమనం కలిగించవచ్చు. మీరు దాని నీటిని చాలా వేడిగా తాగాల్సిన అవసరం లేదు. మీరు దానిని గోరువెచ్చగా మాత్రమే తాగాలి. జీలకర్ర నీటిలో యాంటీఆక్సిడెంట్ పదార్థాలు ఉన్నాయి. ఇది మీ శరీరాన్ని నిర్విషీకరణ చేయడంలో మీకు సహాయపడుతుంది. ప్రతిరోజూ ఉదయం నిద్రలేచిన తర్వాత ఈ నీటిని తాగాలి.

# కామెర్లు వచ్చినప్పుడు కళ్ళు, గోర్లు ఎందుకు పసుపు రంగులోకి మారుతాయి? కారణం ఇదే



కాలేయం చనిపోయిన కణాలను ఫిల్టర్ చేయలేనప్పుడు, రక్తంలో బిలిరుబిన్ పరిమాణం పెరగడం ప్రారంభమవుతుంది. ఇది శరీరంలోని ఇతర భాగాలకు చేరుకుంటుంది. దీనివల్ల శరీరంలోని అన్ని భాగాలలో పసుపు రంగు వస్తుంది. దీనిని కామెర్లు అంటారు. ఈ వ్యాధిని రక్త పరీక్ష.. కామెర్లు ఒక సాధారణ ఆరోగ్య సమస్య. ఇది సోకినప్పుడు శరీరంలో పసుపు రంగు కనిపించడం ప్రారంభమవుతుంది. దీని ప్రభావం కళ్ళ నుండి గోళ్ళ వరకు కనిపిస్తుంది. వాటిని విస్మరించడం వల్ల కొన్నిసార్లు శరీరంలో ప్రమాదకరమైన పరిస్థితి ఏర్పడుతుంది. కామెర్లు వచ్చిన తర్వాత కళ్ళు, గోళ్ళు ఎందుకు పసుపు రంగులోకి మారుతాయో తెలుసుకుందాం. ఈ లక్షణాలను చూసిన తర్వాత మనం ఎప్పుడు అప్రమత్తంగా ఉండాలి?

### అందుకే పసుపు రంగు కనిపిస్తుంది

ఆరోగ్య నిపుణుల అభిప్రాయం ప్రకారం.. బిలిరుబిన్ ఎర్ర రక్త కణాలలో కనిపిస్తుంది. శరీరంలో అప్పుడప్పుడు ఎర్ర రక్త కణాలు ఏర్పడి చనిపోతాయి. కాలేయం చనిపోయిన కణాలను ఫిల్టర్ చేయడానికి పనిచేస్తుంది. కాలేయం చనిపోయిన కణాలను ఫిల్టర్ చేయలేనప్పుడు, రక్తంలో బిలిరుబిన్ పరిమాణం పెరగడం ప్రారంభమవుతుంది. ఇది శరీరంలోని ఇతర భాగాలకు చేరుకుంటుంది. దీనివల్ల శరీరంలోని అన్ని భాగాలలో పసుపు రంగు వస్తుంది. దీనిని కామెర్లు అంటారు. ఈ వ్యాధిని రక్త పరీక్ష ద్వారా గుర్తిస్తారు.


### ఈ లక్షణాలు కనిపిస్తాయి

కళ్ళు, గోర్లు, మూత్రం పసుపు రంగులోకి మారడం
చర్మం పసుపు రంగులో కనిపిస్తుంది
ఆకలి లేకపోవడం
వికారం
ఏమీ తినాలని అనిపించకపోవడం
కడుపు నొప్పి
అలసిపోయినట్లు అనిపిస్తుంది
బరువు తగ్గడం
ప్రారంభ దశలో వైరల్ జ్వరం సమస్య
చలిగా అనిపిస్తుంది
కడుపు నొప్పి
టారీ బ్లాక్ కలర్ స్టూల్స్
ఇలా మిమ్మల్ని మీరు రక్షించుకోండి:
కలుషితమైన ఆహారాన్ని నివారించండి
మద్యం సేవించవద్దు
మరిగించిన నీరు తాగాలి.
నూనె పదార్థాలను నివారించండి
కారంగా ఉండే ఆహారానికి దూరంగా ఉండండి
భోజనం చేసేటప్పుడు శుభ్రతపై ప్రత్యేక శ్రద్ధ వహించండి.
మీకు ఏవైనా లక్షణాలు కనిపిస్తే వైద్యుడిని సంప్రదించండి
కామెర్లు కారణంగా వచ్చే సమస్యలు
హెపటైటిస్ ఎ, బి, సి, డి, ఇ వంటి వైరల్ ఇన్ఫెక్షన్ల వల్ల ఈ సమస్య రావచ్చు.
పారాసెటమాల్ వంటి కొన్ని మందుల అధిక మోతాదు వల్ల ఇది జరగవచ్చు.
విషపూరిత పుట్టగొడుగుల వంటి విష పదార్థాల వినియోగం వల్ల ఇది జరగవచ్చు.
ఈ పరిస్థితి గిల్బర్ట్ సిండ్రోమ్, డుబిన్-జాన్సన్ సిండ్రోమ్ మొదలైన పుట్టుకతో వచ్చే రుగ్మతల వల్ల తలెత్తవచ్చు.
పిత్త వాహిక లేదా పిత్తాశయ రాళ్ళు అడ్డుకోవడం వల్ల కూడా కామెర్లు వస్తాయి.
కాలేయ క్యాన్సర్

### ఇది కాలేయాన్ని దెబ్బతీస్తుందా?

కామెర్లు కాలేయాన్ని దెబ్బతీస్తాయి. ఈ వ్యాధికి కారణాన్ని తెలుసుకోవడం ముఖ్యం. కాలేయం సరిగ్గా పనిచేయలేనప్పుడు బిలిరుబిన్ శరీరం నుండి బయటకు రాదు. శరీరంలో దాని స్థాయి పెరుగుతుంది. అటువంటి పరిస్థితిలో కామెర్లతో పాటు ముదురు మూత్రం, తేలికపాటి మలం, అలసట, వికారం లేదా వాంతులు వంటి లక్షణాలు కనిపిస్తే, అది కాలేయం దెబ్బతిన్నట్లు సంకేతం కావచ్చు.

# పుస్తక సమీక్ష




ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో సకాలంలో వర్షం పడితే రైతులకు సంబరం. ఏ కారణంతోనైనా వరుణుడు అలిగితే రైతుల కంట్లో కన్నీళ్ల ధారలే. వర్షచ్ఛాయ ప్రాంతం కావడంతో ఈ జిల్లాలో వాన కోసం కళ్లలో వత్తులు వేసుకుని ఎదురుచూస్తుంటారు. గంగుల నరసింహారెడ్డి 'వాన కురిసింది' కథా నేపథ్యం ఈ వాతావరణమే. ఈ కథలో రైతు అనంతరెడ్డి తన పంటకు అదునైన వానకోసం ఎదురుచూస్తుంటాడు. ఇల్లేమో వానొస్తే కురిసే మట్టిమిద్దె. కూతురు, అల్లుడు తొలిరాత్రి సందర్భంలో వానజల్లు మొదలవుతుంది. ఓవైపు ఇల్లు కురుస్తుంటుంది. దీంతో ఆ కొత్తజంట వాన కురవడమే ముఖ్యమని తమ సమాగమాన్ని వాయిదా వేసుకుంటుంది. రైతు సంతోషమే ప్రధానమని చాటుతుందీ కథ. ఈ సంకలనంలోని మరో 13 కథలు.. దేనికవే ప్రత్యేకం. రాత్రివేళ ఎన్నో భయాల మధ్య సమాజంలో ఓ వివాహితకు భద్రత కలిగినా, ఇంట్లో భర్త అనుమానించిన వైనం 'కుళ్లిన సంఘం'లో కనిపిస్తుంది. పల్లెల్లో కులాధిపత్యం నీడన బడుగుల బాధలను 'ప్రశ్న' కళ్లకు కడుతుంది. బ్యాంకులిచ్చే చాలీచాలని రుణాలతో చిన్న రైతులకు ఎదురయ్యే విపత్కర పరిస్థితిని 'ఎ లోన్ స్టోరీ' వివరిస్తుంది. పిరికితనానికి, మంచితనానికి మధ్య తేడాను 'రాముడు మంచి బాలుడు' తేటతెల్లం చేస్తుంది. 'ఒడిబియ్యం' మనుషుల మధ్య అనుబంధాలే ముఖ్యమని చాటుతుంది. 'కొనుక్కోవాలి' కథ వృద్ధులైన తల్లిదండ్రులు పిల్లల ఆప్యాయతను ఎలా పొందాలో వెల్లడిస్తుంది. వృద్ధాశ్రమం నుంచి సొంతూరు వెళ్లిన మనిషి తన మిత్రులతో ఆనందంగా గడపడానికి ఏ నిర్ణయం తీసుకున్నాడో 'శిథిల సంధ్యలో చిరుదీపం' తెలుపుతుంది. గంగుల నరసింహారెడ్డి వివిధ సందర్భాల్లో రాసిన ఈ కథలు పాఠకుల్లో మంచిని పెంచేలా సాగుతాయి.

# ఒకటికి మించి ఎక్కువ “లోన్స్” తీసుకున్నారా

**ఈ టిప్స్ పాటిస్తే చక్కగా మేనేజ్ చేయొచ్చట!**

**వివిధ అవసరాల కోసం బహుళ రుణాలు తీసుకుంటున్న ప్రజలు**

**ఈ క్రమంలోనే కొన్ని విషయాలు గమనించాలని నిపుణుల సూచన!**




వివిధ కారణాలు, అవసరాల దృష్ట్యా చాలా మంది ఒకటి కన్నా ఎక్కువ రుణాలు తీసుకుంటుంటారు. హోమ్ లోన్, వెహికల్ లోన్, వ్యక్తిగత రుణం వంటివి చాలానే తీసుకుంటారు. అయితే, కొన్ని పరిస్థితుల్లో ఒకటికి మించిన రుణాలు ఆర్థికంగా కుంగదీస్తాయని, అంతేకాకుండా వారి జీవన ప్రమాణాలపై ఒత్తిడిని కలిగిస్తాయని ఆర్థిక నిపుణులు చెబుతున్నారు. అయితే బహుళ రుణాలు అనేక ఇబ్బందులను కలిగించినప్పటికీ, సరైన వ్యూహాలను అనుసరిస్తే, ఆర్థిక సవాళ్లను సమర్థవంతంగా అధిగమించవచ్చంటున్నారు. ఆ వివరాలు ఈ స్టోరీలో చూద్దాం.సాధారణంగా పర్సనల్‌లో లోన్స్‌పై ఉండే వడ్డీ కంటే క్రెడిట్ కార్డు బిల్లులపై ఉండే వడ్డీ చాలా ఎక్కువగా ఉంటుంది. కాబట్టి, ముందుగా క్రెడిట్ కార్డు బిల్లులను చెల్లించాలని భావించడం సహజం. అయితే, ఇక్కడ ఒక విషయం గుర్తుంచుకోవాలని నిపుణులు చెబుతున్నారు. కార్డులపై బిల్లు చెల్లింపును ఆలస్యం చేయడం కంటే, వ్యక్తిగత రుణానికి సంబంధించిన ఈఎంఐ చెల్లింపును వాయిదా వేయడం లేదా ఆలస్యం చేయడం వల్ల క్రెడిట్ స్కోరుకు ఎక్కువ నష్టం వాటిల్లుతుందని చెబుతున్నారు. ఎందుకంటే వ్యక్తిగత రుణానికి సంబంధించి ఒక ఈఎంఐను సమయానికి చెల్లించకపోతే క్రెడిట్ స్కోరు 50 పాయింట్ల వరకు తగ్గే అవకాశం ఉందంటున్నారు. క్రెడిట్ కార్డు చెల్లింపుల విషయంలో ఇలా జరగదని చెబుతున్నారు. అయితే అన్ని రుణాలను సకాలంలో చెల్లించడం చాలా ముఖ్యం అయినప్పటికీ, ఒకవేళ అన్నింటినీ చెల్లించలేని పరిస్థితి ఉంటే పర్సనల్ లోన్ చెల్లింపులకు ఎక్కువ ప్రాధాన్యత ఇవ్వమంటున్నారు. వేతనం పడే కొద్ది రోజుల్లోనే చెల్లింపు తేదీ ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలంటున్నారు. ఇలా చేయడం వల్ల ఇతర ఖర్చులకు డబ్బును వినియోగించే ముందే చెల్లింపులు పూర్తవుతాయ ంటున్నారు. అలా కాకుండా ఈఎంఐ తేదీ ఆలస్యం అయితే అనుకోని ఖర్చుల వల్ల బ్యాంకులో తగినంత నగదు ఉండకపోవచ్చని.. అప్పుడు పేమెంట్స్ చేయడానికి అవకాశం ఉండదని అంటున్నారు.ఒకటికి మించి ఎక్కువ రుణాలు ఉన్నప్పుడు అన్నింటికి ఒకటే వడ్డీ రేటు ఉండకపోవచ్చని చెబుతున్నారు. ఒక రుణంపై తక్కువ వడ్డీ రేటు ఉంటే, మరొకదానిపై ఎక్కువ వడ్డీ రేటు ఉండొచ్చంటున్నారు. ఇలాంటప్పుడు, ఆఫీసులో పండుగలకు బోనస్, టార్గెట్ కంప్లీట్ చేసినందుకు ఇచ్చే ఇన్సెంటివ్‌లను అనవసరంగా ఖర్చులు పెట్టకుండా, ఆ డబ్బుతో ఎక్కువ వడ్డీ రేటు ఉన్న రుణాన్ని ముందుగా తీర్చేయమంటున్నారు. దీనివల్ల అదనపు వడ్డీ భారంతో ఉన్న రుణాల ఒత్తిడి తగ్గుతుందని, ఇంకా, తక్కువ బ్యాలెన్స్ ఉన్న రుణాన్ని గడువుకు ముందుగా చెల్లించడానికి అదనపు నగదును ఉపయోగించొచ్చని చెబుతున్నారు. అది కూడా పూర్తయ్యాక, మరొక తక్కువ బ్యాలెన్స్ ఉన్న రుణాన్ని లక్ష్యంగా చేసుకోమంటున్నారు. ఇలా తీర్చేసే ప్రతీ రుణం మిమ్మల్ని ఆర్థిక స్వేచ్ఛ వైపు వెళ్లేలా చేస్తుందని అంటున్నారు. అయితే ఇంటి రుణం తీర్చే ముందు దానిపై పన్ను మినహాయింపులు ఉంటాయనే విషయాన్ని గుర్తుంచుకోవాలని చెబుతున్నారు.ఒకటికి మించి ఎక్కువ రుణాలు ఉన్నప్పుడు సహజంగానే ఒత్తిడి ఉంటుంది. అయితే ఈ రుణాల ఒత్తిడితో కొంతమంది క్రెడిట్ కార్డు బకాయిని తదుపరి బిల్లింగ్ సైకిల్‌కు తీసుకెళతారని.. కానీ ఇలా చేయడం వల్ల వడ్డీ భారం బాగా పెరుగుతుందంటున్నారు నిపుణులు. బ్యాంకులు ముందుకు తీసుకువెళ్లిన క్రెడిట్ కార్డు బకాయిలపై నెలకు 3.50% వరకు వడ్డీ రేటును వసూలుజేస్తాయంటున్నారు. అందువల్ల, క్రెడిట్ కార్డు బిల్లు విషయంలో మొత్తం బకాయిని చెల్లించలేకపోతే, దాన్ని తక్కువ వడ్డీ రేటుతో జువీ×లుగా మార్చుకోవడం మేలంటున్నారు. ఇలా ఈఎంఐలుగా మార్చుకోవడం వల్ల వడ్డీ 12 నుంచి 14 శాతం వరకు ఉండొచ్చంటున్నారు. దీనివల్ల వడ్డీ భారం తగ్గడమే కాకుండా, ఒకేసారి చెల్లించే బాధ్యత కూడా తప్పుతుందని అంటున్నారు. ఆర్థికంగా ఇబ్బందులు ఎదురైనప్పుడు, జువీ×లు చెల్లించడానికి స్నేహితులు, కుటుంబ సభ్యులు లేదా బ్యాంకుల నుంచి కొద్ది మొత్తంలో మరొక రుణం తీసుకోవాలనే ఆలోచన వస్తుంది. కానీ, ఇలా చేయడం వల్ల మరింత అప్పుల పాలయ్యే అవకాశం ఉందని నిపుణులు అంటున్నారు. ఇటువంటి పరిస్థితిని ఎదుర్కోవడానికి, ఖర్చులను సాధ్యమైనంత వరకు తగ్గించుకోవడం మంచిదని, ఇంకా అదనపు ఆదాయ మార్గాలను అన్వేషించాలంటున్నారు. అలా కాకుండా, ప్రతీ అవసరానికి లోన్ తీసుకోవడం వల్ల ఆర్థిక పరిస్థితి మరింత దిగజారడమే కాకుండా, జువీ×ల వల్ల కలిగే ఆలస్యం మీ క్రెడిట్ స్కోరుపై కూడా ప్రభావం చూపుతుందని చెబుతున్నారు. దీనివల్ల, భవిష్యత్తులో రుణం కోసం దరఖాస్తు చేసినప్పుడు ఆమోదం పొందడం చాలా కష్టంగా మారుతుందని అంటున్నారు.

# “ఇల్లు” అమ్మే ఆలోచనలో ఉన్నారా

**ఇలా చేస్తే “పన్ను” తగ్గించుకోవడానికి ఛాన్స్!**

**అమ్మకందార్లు ‘క్యాపిటల్ గెయిన్స్ టాక్స్’ గురించి తెలుసుకోవాల్సిందే!**

**లేదంటే నష్టపోవడం గ్యారెంటీ అంటున్ననిపుణులు!**




స్థిరాస్తి విక్రయించడమనేది ఒక పెద్ద ఆర్థిక లావాదేవీ. ముఖ్యంగా తమ ఆదాయపు పన్ను రిటర్న్‌లను దాఖలు చేయనివారికి, స్థిరాస్తి అమ్మకంపై వచ్చిన లాభాలపై పన్ను కట్టాల్సి ఉంటుందనే విషయం మనలో చాలా మందికి తెలిసిఉండకపోవచ్చు. అందుకే, అమ్మకందార్లు ప్రాపర్టీ అమ్మకంపై మూలధన లాభాల పన్ను వర్తిస్తుందని తప్పక తెలుసుకోవాలంటున్నారు నిపుణులు. అయితే, స్థిరాస్తి అమ్మకాలపై మీరు ట్యాక్స్ పే చేయకుండా తప్పించుకోలేకపోయినప్పటికీ, పన్ను భారాన్ని తగ్గించుకోవచ్చంటున్నారు. మీరు కొన్ని వ్యూహాలు పాటించడం ద్వారా పన్ను ఆదాతో పాటు పన్ను చెల్లింపులపై ఇతర ప్రయోజనాలు పొందడానికి ఛాన్స్ ఉంటుందని చెబుతున్నారు. మరి, పన్ను ఆదా చేసే ఆ వ్యూహాలేంటో ఇప్పుడు చూద్దాం.ఒక ప్రాపర్టీని అమ్మినప్పుడు దానిపై వచ్చిన లాభాలపై పన్ను విధిస్తుంది ప్రభుత్వం. దీన్నే క్యాపిటల్ గెయిన్స్ టాక్స్(మూలధన లాభాల పన్ను) అని అంటారు. ఒక నివాస స్థలాన్ని దాని కొన్న ధర కంటే ఎక్కువ ధరకు విక్రయించినప్పుడు, అమ్మకపు ధర, కొన్న ధర మధ్య ఉన్న వ్యత్యాసం మూలధన లాభాల రూపంలో ఉంటుందంటున్నారు నిపుణులు. ప్రస్తుత పన్ను చట్టాల ప్రకారం పన్నుకు ఈ లాభం లోబడి ఉంటుందని చెబుతున్నారు. బహుమతిగా పొందిన లేదా పూర్వీకుల నుంచి వచ్చిన ఆస్తిని మీరు అమ్మినా సరే, ఆ ప్రాపర్టీపై క్యాపిటల్ గెయిన్స్ టాక్స్ చెల్లించాల్సి ఉంటుందని గుర్తుంచుకోవాలి.స్థిరాస్తిపై స్వల్పకాలిక మూలధన లాభాలు, దీర్ఘకాలిక మూలధన లాభాలు అంటూ రెండు రకాల మూలధన లాభాలుంటాయి. మీరు ఒక ప్రాపర్టీని ఎంతకాలం కలిగి ఉన్నారనే దానిపై ఈ మూలధన లాభాలను నిర్ణయిస్తారు. ఒక స్థిరాస్తిని కొన్న రెండేళ్లలోపు అమ్మినట్లయితే స్వల్పకాలిక మూలధన లాభాలు ఉంటాయి. అప్పుడు మూలధన లాభాలపై 20% టాక్స్ పే చేయాల్సి ఉంటుంది. అదే, రెండేళ్ల కంటే ఎక్కువ కాలం కలిగి ఉన్న తర్వాత స్థిరాస్తిని విక్రయిస్తే, అప్పుడు సంపాదించిన లాభాలను దీర్ఘకాలిక మూలధన లాభాలుగా చెబుతారు. ప్రస్తుతం, స్వల్పకాలిక మూలధన లాభాలపై ఇండెక్సేషన్ ప్రయోజనాలతో 20% స్థిర రేటుతో లేదా ఇండెక్సేషన్ బెనిఫిట్స్ లేకుండా 12.50% చొప్పున పన్ను విధిస్తుంది ఆదాయ పన్ను శాఖ.మీ కుటుంబ సభ్యుడు లేదా ఫ్రెండ్‌తో ఉమ్మడి యాజమాన్య ప్రాతిపదికన ఒక స్థిరాస్తిని కొన్నట్లయితే, ఆ తర్వాత దాని అమ్మకం నుంచి వచ్చిన మూలధన లాభాలను సహ-యజమానుల యాజమాన్య వాటా ఆధారంగా వారితో షేర్ చేసుకోవచ్చు. దీనివల్ల మీలో ప్రతి ఒక్కరూ ప్రాథమిక మినహాయింపుల పరిమితిని యూజ్ చేసుకుని, పన్నును తగ్గించుకోవచ్చంటున్నారు నిపుణులు. ప్రాపర్టీపై మూలధన లాభాలను లెక్కించినప్పుడు మీరు పునరుద్ధరణ, అమ్మకం ఖర్చులు వంటి కొన్ని ఖర్చులను మినహాయించుకుని కూడా టాక్స్‌ను ఆదా చేసుకోవచ్చని చెబుతున్నారు.ఉదాహరణకు, మీ ఇంటిని రూ. 50 లక్షలకు అమ్మారనుకుందాం. కానీ, అమ్మకం విషయంలో బ్రోకరేజ్ ఫీజులు, చట్టపరమైన ఖర్చులు, ఇంటి ఆధునీకరణ, ప్రకటనల ఖర్చులు వంటి వాటికి మొత్తం రూ.4 లక్షలు ఖర్చు చేశారనుకుందాం. మీరు అమ్మకం ధర నుంచి ఈ మొత్తాన్ని మినహాయించుకోవచ్చు. కాబట్టి, పన్ను పరంగా చూస్తే మీ ఇంటి విక్రయ ధర రూ. 46 లక్షలు మాత్రమే అవుతుంది, దానిపైనే టాక్స్ వర్తిస్తుందంటున్నారు నిపుణులు.ప్రాపర్టీ అమ్మకంపై టాక్స్ తగ్గించుకోవడానికి మరొక సమర్థవంతమైన మార్గం, మూలధన లాభాలను తిరిగి పెట్టుబడిగా పెట్టి మరో నివాస ఆస్తిని కొనడం. మీరు కొన్ని రూల్స్ ఫాలో అయినట్లయితే, ఆదాయపు పన్ను చట్టంలోని సెక్షన్ 54 ప్రకారం, ఇంటి అమ్మకం ద్వారా వచ్చే దీర్ఘకాలిక క్యాపిటల్ గెయిన్స్ టాక్స్‌పై పన్ను మినహాయింపు పొందొచ్చంటున్నారు నిపుణులు.మీరు స్థిరాస్తిని అమ్మగా వచ్చిన డబ్బును ఇంకో ఇల్లు కొనడానికి లేదా నిర్మించడానికి యూజ్ చేయాలి. ఆస్తి అమ్మకం జరిగిన ఒక సంవత్సరం ముందు లేదా రెండు సంవత్సరాల తర్వాత కొత్త ఇల్లు కొన్నా పర్వాలేదు. రిజిస్ట్రేషన్ చార్జీలు, స్టాంప్ డ్యూటీ, బదిలీ ఛార్జీలు మొదలైనవి కొత్త ఇంటి ఖర్చులో చేర్చొచ్చని చెబుతున్నారు.కొత్త ఇల్లు కట్టాలనుకుంటే పాత ఇల్లు అమ్మిన తేదీ(సేల్ డీడ్ తేదీ) నుంచి మూడేళ్లలోపు నిర్మించాలి. ఈ పన్ను మినహాయింపులు కేవలం ఒక ఇంటి కొనుగోలు లేదా నిర్మాణానికి మాత్రమే పరిమితమని గమనించాలి. మీరు కొనుగోలు చేసే నివాస ఆస్తి ఇండియాలోనే ఉండాలి.ఒక ఇల్లు అమ్మినప్పుడు వచ్చిన మూలధన లాభాలను మరో ఇల్లు కొనుగోలు లేదా నిర్మాణం కోసం తిరిగి పెట్టుబడిగా వద్దనుకుంటే, కొన్ని రకాల బాండ్లలో కూడా మీరు వాటిని పెట్టుబడిగా పెట్టొచ్చంటున్నారు నిపుణులు. “నేషనల్ హైవే అథారిటీ, రూరల్ ఎలక్ట్రిఫికేషన్ కార్పొరేషన్, రైల్వే ఫైనాన్స్ కార్పొరేషన్” వంటి కొన్ని నిర్దిష్ట ఆర్థిక సంస్థల బాండ్లలో మూలధన లాభాలను ఇన్వెస్ట్ చేయొచ్చు. ఇలా ప్రభుత్వం జారీ చేసిన బాండ్లలో ఇన్వెస్ట్ చేయడం ద్వారా, మీరు టాక్స్ మినహాయింపును పొందవచ్చంటున్నారు. అయితే, ఈ బెనిఫిట్‌ను క్లెయిం చేయడానికి, మీరు ఆస్తి అమ్మకం కంప్లీట్ అయిన రోజు నుంచి ఆరు నెలలలోపు ఈ బాండ్లలో ఇన్వెస్ట్ చేయాలి. ఈ బాండ్లు ఐదు సంవత్సరాల కాలపరిమితిని కలిగి ఉంటాయి. అయితే, వీటిపై వచ్చే వడ్డీపై పూర్తిగా పన్ను వర్తిస్తుందని గుర్తుంచుకోవాలి. ఈ వ్యవధిలో వీటిని నగదుగా మార్చుకోవచ్చు లేదా నగదు అవసరాలకు తాకట్టు కూడా పెట్టవచ్చు, కానీ, అలా చేస్తే పొందిన పన్ను మినహాయింపులు రద్దవుతాయని గమనించాలంటున్నారు.ప్రాపర్టీ విక్రయాలపై మూలధన లాభాల పన్నును ఆదా చేయడానికి మరొక మార్గం ‘క్యాపిటల్ గెయిన్స్ అకౌంట్ స్కీం’ (జ+ూూ)లో పెట్టుబడి పెట్టడం. ఆదాయపు పన్ను రిటర్న్ దాఖలు చేయడానికి ముందే కొత్త స్థిరాస్తిలో ఇన్వెస్ట్ చేయలేనివారికి ఈ స్కీమ్ చాలా అనుకూలంగా ఉంటుంది. పన్ను చెల్లింపుదారులకు ఇది గొప్ప ఉపశమనాన్ని అందిస్తుందంటున్నారు.మీరు ఈ పథకంలో మూడు సంవత్సరాలు పెట్టుబడి పెట్టవచ్చు. ఈ వ్యవధిలో మీరు నివాస గృహాన్ని కొనుగోలు చేయడానికి లేదా నిర్మించడానికి ఆ మూలధన లాభాలను వాడుకోవచ్చు. ఆదాయపు పన్ను రిటర్న్‌ను దాఖలు చేయడానికి లేదా నమోదు చేయడానికి ముందే ఈ జ+ూూ అకౌంట్‌లో డిపాజిట్ చేయాలి. ఈ అకౌంట్‌ను నిర్దేశిత బ్యాంకుల్లో మాత్రమే ఓపెన్ చేయాలి. అలాగే, జ+ూూ పెట్టుబడి వివరాలను ఆదాయపు పన్ను రిటర్న్‌లో తప్పనిసరిగా పేర్కొనాలని చెబుతున్నారు నిపుణులు.

# ఈ20 పెట్రోల్‌పై మహీంద్రా క్లారిటీ.. పాత కార్ల యజమానులకు గుడ్‌న్యూస్

**ఈ20తో తమ కార్లు సేఫ్ అన్న మహీంద్రా**


**కొత్త మోడళ్లను ప్రత్యేకంగా తయారు చేసినట్లు వెల్లడి**

**పాత కార్లలోనూ ఈ20 ఇంధనం**

**వినియోగించుకోవచ్చని స్పష్టీకరణ**

**మైలేజ్‌లో స్వల్ప మార్పు ఉండొచ్చని వివరణ**

**ఇంజిన్‌కు నష్టం ఉండదన్న కంపెనీ**



ఈ20 పెట్రోల్‌పై దేశవ్యాప్తంగా పెద్ద ఎత్తున చర్చ జరుగుతోంది. చాలా మంది దీనివల్ల వాహనాలపై ప్రతికూల ప్రభావం ఉంటుందని వాదిస్తున్నారు. సోషల్ మీడియాలో చాలా మంది పోస్ట్‌లు పెడుతున్నారు. కేంద్ర ప్రభుత్వ వాదన మాత్రం భిన్నంగా ఉంది. ఈ20 వల్ల కేవలం మైలేజ్ మాత్రం కాస్త తగ్గుతుందని చెబుతోంది. అంతకు మినహా వాహనాలపై ఎలాంటి ప్రభావం ఉండదని స్పష్టం చేస్తోంది. తాజాగా ఈ వివాదంపై ప్రముఖ వాహన తయారీ సంస్థ మహీంద్రా స్పందించింది.తమ పెట్రోల్ కార్లలో ఈ20 ఇంధనాన్ని సురక్షితంగా ఉపయోగించవచ్చని కంపెనీ స్పష్టం చేసింది. అయితే 2025 ఏప్రిల్ 1 తర్వాత తయారైన కొత్త మోడళ్లు ఈ20కు అనుగుణంగా ప్రత్యేకంగా రూపొందించినట్లు తెలిపింది. సోషల్ మీడియాలో ఓ కస్టమర్ అడిగిన ప్రశ్నకు మహీంద్రా స్పందించింది. ప్రస్తుతం అమల్లో ఉన్న పెట్రోల్ ప్రమాణాలకు అనుగుణంగా తమ ఇంజిన్లు రూపొందించామని పేర్కొంది. అన్ని మహీంద్రా పెట్రోల్ వాహనాలు ఈ20 ఇంధనంతో సురక్షితంగా నడుస్తాయని వెల్లడించింది.2025 ఏప్రిల్ 1 తర్వాత తయారైన వాహనాల్లో ఇంజిన్‌ను ప్రత్యేకంగా క్యాలిబ్రేట్ చేసినట్లు కంపెనీ తెలిపింది. దీంతో ఈ20 పెట్రోల్‌తో మెరుగైన యాక్సిలరేషన్, ఇంధన సామర్థ్యం లభిస్తుందని పేర్కొంది. అంతకుముందు తయారైన వాహనాలు కూడా ఈ20తో ఎలాంటి ఇబ్బంది లేకుండా నడుస్తాయని స్పష్టం చేసింది. అయితే డ్రైవింగ్ విధానం, రహదారి పరిస్థితులను బట్టి మైలేజ్ లేదా యాక్సిలరేషన్‌లో స్వల్ప మార్పులు కనిపించవచ్చని వివరించింది.ఇటీవల ఈ20 పెట్రోల్‌పై సోషల్ మీడియాలో పలు సందేహాలు వ్యక్తమవుతున్నాయి. ఈ నేపథ్యంలో వినియోగదారుల ఆందోళనలను తగ్గించేందుకే మహీంద్రా ఈ వివరణ ఇచ్చినట్లు భావిస్తున్నారు. ఇటీవల కేంద్ర ప్రభుత్వం నిర్వహించిన సమావేశంలో టయోటా, మారుతీ సుజుకీ, హీరో మోటోకార్ప్, హ్యుందాయ్ ప్రతినిధులు కూడా ఈ20 ఇంధనం వాహనాలకు పూర్తిగా సురక్షితమేనని చెప్పారు. మైలేజ్‌లో స్వల్ప తగ్గుదల ఉండొచ్చని, కానీ ఇంజిన్‌కు ఎలాంటి నష్టం ఉండదని స్పష్టం చేశారు.

# నాలుగు రోజుల లాభాలకు బ్రేక్ స్వల్పంగా నష్టపోయిన సూచీలు

**స్వల్ప నష్టాలతో ముగిసిన సెన్సెక్స్, నిఫ్టీ సూచీలు**

**మెటల్, రియల్టీ రంగాల బలహీనతతో మార్కెట్లపై ఒత్తిడి**

**ఐటీ, కన్జ్యూమర్ రంగ షేర్లు మార్కెట్లకు మద్దతు**

**ఇక మార్కెట్ దృష్టి త్రైమాసిక ఫలితాలు, రుతుపవనాలపైనే**



నాలుగు సెషన్లుగా కొనసాగుతున్న స్టాక్ మార్కెట్ల లాభాల జోరుకు నేడు బ్రేక్ పడింది. మెటల్, రియల్టీ రంగాల షేర్లలో అమ్మకాల ఒత్తిడి పెరగడంతో దేశీయ సూచీలు స్వల్ప నష్టాలతో ముగిశాయి. ఐటీ, కన్జ్యూమర్ రంగ షేర్లలో కొనుగోళ్ల మద్దతు లభించినప్పటికీ, అది మార్కెట్లను పూర్తిగా నష్టాల నుంచి బయటపడేయలేకపోయింది. ఇన్వెస్టర్లు లాభాల స్వీకరణకు మొగ్గు చూపడంతో సూచీలు ఫ్లాట్‌గా ముగిశాయి.ఈరోజు ట్రేడింగ్ ముగిసే సమయానికి.. బీఎస్ఈ సెన్సెక్స్ 104.35 పాయింట్ల నష్టంతో 78,180.72 వద్ద స్థిరపడింది. అలాగే, ఎన్ఎస్ఈ నిఫ్టీ 31.65 పాయింట్లు స్వల్పంగా తగ్గి 24,398.70 వద్ద ముగిసింది. రోజంతా సూచీలు పరిమిత శ్రేణిలోనే కదలాడాయి.రంగాల వారీగా చూస్తే.. నిఫ్టీ ఐటీ సూచిక మిగతా మార్కెట్‌ను అధిగమించి మంచి పనితీరు కనబరిచింది. నిఫ్టీ కన్జ్యూమర్ డ్యూరబుల్స్, నిఫ్టీ ఎఫ్ఎంసీజీ సూచీలు కూడా సానుకూలంగా ముగిశాయి. అయితే, నిఫ్టీ మెటల్, నిఫ్టీ రియల్టీ సూచీలు అత్యధికంగా నష్టపోయి మార్కెట్లపై ఒత్తిడి పెంచాయి. నిఫ్టీ షేర్లలో టైటాన్ కంపెనీ, టెక్ మహీంద్రా, హెచ్‌సీఎల్ టెక్ షేర్లు టాప్ గెయినర్స్‌గా నిలిచాయి. మరోవైపు బ్రాడర్ మార్కెట్‌లోనూ అమ్మకాల ఒత్తిడి కనిపించింది. నిఫ్టీ మిడ్‌క్యాప్ ఇండెక్స్ 0.3%, స్మాల్‌క్యాప్ ఇండెక్స్ 0.55% చొప్పున నష్టపోయాయి.ప్రస్తుతం అమెరికా-ఇరాన్ ఉద్రిక్తతలు, వాణిజ్య సుంకాలకు సంబంధించిన ఆందోళనలు తగ్గడంతో మార్కెట్ దృష్టి కార్పొరేట్ కంపెనీల మొదటి త్రైమాసిక ఫలితాలు, రుతుపవనాల పురోగతిపైకి మళ్లుతోందని నిపుణులు చెబుతున్నారు. విదేశీ సంస్థాగత పెట్టుబడుల (ఎఫ్ఐఐ) ప్రవాహం మెరుగుపడటం, రూపాయి విలువ స్థిరంగా ఉండటం వంటి అంశాలు స్వల్పకాలంలో మార్కెట్‌కు మద్దతునిస్తాయని వారు భావిస్తున్నారు.

## నెలలో మరోసారి పెరిగిన ట్రయంఫ్ 350సీసీ బైక్‌ల ధర

**ఏప్రిల్ విడుదల తర్వాత రెండోసారి రేట్ల సవరణ**

**1.22% నుంచి 5.03% వరకు పెంపు , స్పీడ్ టీ4పై రూ.10 వేలు పెంపు**

**స్పీడ్ 400 ధర రూ.6 వేలు పెరిగింది , ట్రాకర్ 400పై అతి తక్కువగా రూ.3 వేల పెంపు**

**అమల్లోకి వచ్చిన కొత్త ధరలు**



ట్రయంఫ్ 350 సీసీ బైక్‌ల ధరలు మరోసారి పెరిగాయి. ఏప్రిల్‌లో ఈ సిరీస్‌ను మార్కెట్లోకి తీసుకొచ్చిన కంపెనీ.. జూన్‌లో ఒకసారి ధరలు పెంచింది. నెల కూడా గడవకముందే తాజాగా మరోసారి రేట్లు సవరించింది. దీంతో కొత్త బైక్ కొనాలనుకునే వారికి అదనపు భారం పడనుంది.350 సీసీ ఇంజిన్‌తో ఈ మోడళ్లను ట్రయంఫ్ ఏప్రిల్‌లో విడుదల చేసింది. 18 శాతం జీఎస్‌టీ ప్రయోజనం వినియోగదారులకు అందించాలనే ఉద్దేశంతో ఈ నిర్ణయం తీసుకుంది. ప్రారంభంలో ధరలను పెద్దగా మార్చలేదు. అయితే జూన్‌లో స్పీడ్ టీ4, స్పీడ్ 400, స్క్రాంబ్లర్ 400 ఎక్స్‌సీ, థ్రక్స్‌టన్ 400 ధరలను పెంచింది. తాజాగా 350 సీసీ శ్రేణిలోని అన్ని మోడళ్ల ధరలను మరోసారి సవరించింది. ఈసారి పెంపు 1.22 శాతం నుంచి 5.03 శాతం వరకు ఉంది.అన్ని మోడళ్లలో స్పీడ్ టీ4 ధరనే అత్యధికంగా పెరిగింది. ఈ బైక్‌పై రూ.10 వేల పెంపు ప్రకటించారు. దీంతో దీని ధర రూ.1.99 లక్షల నుంచి రూ.2.09 లక్షలకు చేరింది. విడుదలైనప్పటి ధరతో పోలిస్తే ఇప్పుడు ఇది రూ.14 వేలు ఎక్కువైంది. స్పీడ్ 400 ధర రూ.2.34 లక్షల నుంచి రూ.2.40 లక్షలకు పెరిగింది.ట్రాకర్ 400 ధరపై అతి తక్కువగా రూ.3 వేల పెంపు ప్రకటించారు. దీంతో దీని ధర రూ.2.46 లక్షల నుంచి రూ.2.49 లక్షలకు చేరింది. స్క్రాంబ్లర్ 400 ఎక్స్ ధర రూ.2.59 లక్షల నుంచి రూ.2.65 లక్షలకు పెరిగింది. థ్రక్స్‌టన్ 400 ధర రూ.2.70 లక్షల నుంచి రూ.2.75 లక్షలకు చేరుకుంది. స్క్రాంబ్లర్ 400 ఎక్స్‌సీపై కూడా రూ.5 వేల పెంపుతో కొత్త ధర రూ.2.99 లక్షలకు చేరింది.ట్రయంఫ్ బ్రిటన్‌కు చెందిన ప్రముఖ ప్రీమియం మోటార్‌సైకిల్ తయారీ సంస్థ. 1902లో దీన్ని స్థాపించారు. ఈ కంపెనీ స్పోర్ట్స్, అడ్వెంచర్, క్లాసిక్ శైలి బైక్‌లకు ప్రపంచవ్యాప్తంగా ప్రసిద్ధి చెందింది. భారత్‌లో ట్రయంఫ్ తన బైక్‌లను బజాజ్ ఆటో భాగస్వామ్యంతో తయారు చేసి విక్రయిస్తోంది. స్పీడ్ 400, స్క్రాంబ్లర్ 400 ఎక్స్ వంటి మోడళ్లను బజాజ్‌తో కలిసి అభివృద్ధి చేసింది.

## యూపీఐ హిస్టరీ మీ ఖర్చుల అసలు కథ చెబుతుంది

**ఇలా చెక్ చేయండి**

**యూపీఐ హిస్టరీతో ఖర్చుల అలవాట్లు తెలుసుకోవచ్చు**

**గత 30 రోజుల చెల్లింపులను పరిశీలించాలని సూచన**

**ఒకే చోట పదేపదే చేసిన ఖర్చులపై దృష్టి పెట్టాలి**

**ఖర్చులను విభాగాలుగా వర్గీకరించాలి**

**చిన్న మార్పులతోనే ఎక్కువ పొదుపు సాధ్యం**

రోజూ కూరగాయలు కొనడం నుంచి కాఫీ తాగడం, ఫుడ్ ఆర్డర్ చేయడం, క్యాబ్ బుక్ చేసుకోవడం వరకు దాదాపు ప్రతి చెల్లింపూ ఇప్పుడు యూపీఐ ద్వారానే జరుగుతోంది. అయితే నెలాఖరులో డబ్బు ఎక్కడ ఖర్చైందో అర్థం కాక ఇబ్బంది పడేవారు చాలామందే. ఆర్థిక నిపుణులు మాత్రం మీ యూపీఐ హిస్టరీనే మీ ఖర్చుల అద్దమని చెబుతున్నారు.ముందుగా గత 30 రోజుల యూపీఐ హిస్టరీని పరిశీలించాలని సూచిస్తున్నారు. ఎంత మొత్తం ఖర్చు చేశారనేది కాకుండా.. ఏ షాప్, ఏ యాప్, ఏ సేవకు ఎక్కువసార్లు చెల్లింపులు చేశారో గమనించాలని చెబుతున్నారు. ఒక్కోసారి రూ.200, రూ.300 పెద్దగా అనిపించకపోయినా.. అదే ఖర్చు పదేపదే చేస్తే నెలాఖరుకు వేల రూపాయలు అవుతాయని గుర్తు చేస్తున్నారు.వారాంతాల్లో చేసే ఖర్చులను కూడా ఒకసారి పరిశీలించాలని నిపుణులు సూచిస్తున్నారు. అలాగే ఒత్తిడి, బోర్, ఆనందం వంటి భావోద్వేగాల కారణంగా అనవసరంగా షాపింగ్ లేదా ఫుడ్ ఆర్డర్లు చేస్తున్నామా అనేది కూడా గుర్తించాలన్నారు. అవసరాలు, జీవనశైలి ఖర్చులు, హఠాత్తుగా చేసే ఖర్చులు అనే మూడు విభాగాలుగా ఖర్చులను విభజిస్తే ఎక్కడ డబ్బు ఆదా చేయవచ్చో సులభంగా అర్థమవుతుందని చెబుతున్నారు.ఖర్చులను పూర్తిగా ఆపేయాలని కాకుండా.. ప్రతి నెల మూడు అనవసర చెల్లింపులను తగ్గించే లక్ష్యం పెట్టుకుంటే సరిపోతుందని నిపుణులు సూచిస్తున్నారు. చిన్న చిన్న మార్పులే దీర్ఘకాలంలో పెద్ద మొత్తంలో పొదుపుకు దోహదపడతాయని పేర్కొంటున్నారు.



# సందీప్ రెడ్డి వంగా బ్యానర్‌లో ‘రోమాంచకం’.. ఆసక్తికరంగా ఫస్ట్ గ్లింప్స్

‘అర్జున్ రెడ్డి’, ‘యానిమల్’ వంటి బ్లాక్‌బస్టర్ చిత్రాలతో ఇండియన్ సినిమాను షేక్ చేసిన స్టార్ డైరెక్టర్ సందీప్ రెడ్డి వంగా సమర్పణలో ఒక సరికొత్త యూత్‌ఫుల్ లవ్ స్టోరీ రాబోతుంది. భద్రకాళి పిక్చర్స్ బ్యానర్‌పై ప్రణయ్ రెడ్డి వంగా అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న ఈ చిత్రానికి ‘రోమాంచకం’ అనే ఆసక్తికరమైన టైటిల్‌ను ఖరారు చేశారు. ‘మేమ్ ఫేమస్’ చిత్రంతో యూత్‌లో మంచి క్రేజ్ తెచ్చుకున్న యంగ్ హీరో సుమంత్ ప్రభాస్, ‘8 వసంతాలు’ ఫేమ్ అనంతిక సనిల్ కుమార్ ఈ సినిమాలో లీడ్ రోల్స్ పోషిస్తున్నారు. నూతన దర్శకుడు వేణుగోపాల్ రెడ్డి రూపొందిస్తున్న ఈ క్రేజీ ప్రాజెక్ట్‌కు సంబంధించిన అధికారిక గ్లింప్స్‌ను మేకర్స్ తాజాగా విడుదల చేశారు. ప్రేమ, హాస్యం, ఉత్కంఠ అనే ట్యాగ్‌లైన్‌తో వచ్చిన ఈ గ్లింప్స్ ప్రస్తుతం ఆకట్టుకుంటోంది. ప్రారంభంలో సముద్ర తీరం బ్యాక్‌డ్రాప్‌లో హీరో హీరోయిన్ల మధ్య సాగే బైక్ రైడ్స్, రొమాంటిక్ సీన్స్ ఎంతో ఆహ్లాదకరంగా సాగగా.. అంతా ప్రశాంతంగా సాగుతుందనుకున్న తరుణంలో గ్లింప్స్ ముగింపులో దర్శకుడు ఒక ఊహించని మైండ్ బ్లోయింగ్ ట్విస్ట్ ఇచ్చారు. హీరో హీరోయిన్లు ఇద్దరూ ఒకరినొకరు గట్టిగా చెంపదెబ్బలు కొట్టుకుంటూ ‘ఐ హేట్ యూ’ అని అరుచుకోవడం అందరినీ ఆశ్చర్యానికి గురిచేస్తోంది. అంతవరకు కూల్‌గా సాగిన వాతావరణం, ఒక్కసారిగా ఇంటెన్స్ ఎమోషనల్‌గా మారిపోవడంతో ఈ ప్రేమకథలో సందీప్ రెడ్డి వంగా మార్క్ గట్టిగానే ఉండబోతోందని స్పష్టమవుతోంది. ఇక వైవిధ్యమైన కంటెంట్‌తో ప్రేక్షకుల ముందుకు రాబోతున్న ఈ యూత్‌ఫుల్ ఎంటర్‌టైనర్ చిత్రాన్ని సెప్టెంబర్ 3, 2026న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో గ్రాండ్‌గా విడుదల చేయనున్నట్లు చిత్ర బృందం అధికారికంగా ప్రకటించింది.

# జైలర్ 2 బిజినెస్‌కు భారీ క్రేజ్.. రిలీజ్‌కు ముందే మలయాళంలో రికార్డు డిమాండ్




సూపర్ స్టార్ రజినీకాంత్ నటించిన ‘జైలర్’ సినిమా బాక్సాఫీస్ వద్ద సృష్టించిన సంచలనం గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదు. దర్శకుడు నెల్సన్ దిలీప్‌కుమార్ తెరకెక్కించిన ఈ యాక్షన్ ఎంటర్‌టైనర్ తమిళంతో పాటు తెలుగు, మలయాళం, కన్నడ, హిందీ భాషల్లోనూ భారీ విజయాన్ని అందుకుంది. ముఖ్యంగా మలయాళ మార్కెట్‌లో ఈ చిత్రం అనూహ్యమైన వసూళ్లు సాధించి రజినీకాంత్ కెరీర్‌లోనే అత్యంత విజయవంతమైన చిత్రాల్లో ఒకటిగా నిలిచింది. ఇప్పుడు ఈ బ్లాక్‌బస్టర్‌కు సీక్వెల్‌గా రూపొందుతున్న జైలర్ 2 పై ఇప్పటికే భారీ అంచనాలు నెలకొన్నాయి. ఇటీవల విడుదలైన రిలీజ్ డేట్ గ్లింప్స్ సినిమాపై ఉన్న హైప్‌ను మరింత పెంచింది. సోషల్ మీడియాలో ఆ వీడియోకు విశేష స్పందన లభించడంతో అభిమానుల్లో అంచనాలు రెట్టింపయ్యాయి. తాజా సమాచారం ప్రకారం, జైలర్ 2 విడుదలకు ఇంకా సమయం ఉన్నప్పటికీ, సినిమా థియేట్రికల్ హక్కుల కోసం ఇప్పటికే మలయాళ మార్కెట్‌లో పోటీ మొదలైనట్లు తెలుస్తోంది. ముఖ్యంగా కేరళలో ప్రముఖ డిస్ట్రిబ్యూషన్ సంస్థలు ఈ సినిమా హక్కులను దక్కించుకోవడానికి ఆసక్తి చూపుతున్నాయని సినీ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. మొదటి భాగం కేరళలో అద్భుతమైన వసూళ్లు సాధించడంతో పాటు, మలయాళ స్టార్ మోహన్‌లాల్ ప్రత్యేక పాత్రలో కనిపించడం అక్కడి ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకుంది. దీంతో రెండో భాగంపై కూడా ట్రేడ్ వర్గాల్లో భారీ అంచనాలు ఏర్పడ్డాయి. ‘జైలర్’ తొలి భాగంలో మోహన్‌లాల్ ప్రత్యేక పాత్రకు ప్రేక్షకుల నుంచి మంచి స్పందన వచ్చింది. అదే తరహాలో ‘జైలర్ 2’లో కూడా ఆయన పాత్రకు ప్రాధాన్యత ఉంటుందనే ప్రచారం జరుగుతోంది. అయితే దీనిపై చిత్రబృందం ఇప్పటివరకు అధికారికంగా ఎలాంటి ప్రకటన చేయలేదు. అయినప్పటికీ, రజినీకాంత్‌తో పాటు మోహన్‌లాల్ క్రేజ్ కూడా మలయాళ మార్కెట్‌లో సినిమాకు అదనపు బలం చేకూరుస్తుందనే అభిప్రాయం ట్రేడ్ వర్గాల్లో వ్యక్తమవుతోంది. ప్రస్తుతం వినిపిస్తున్న సమాచారం ప్రకారం, ‘జైలర్ 2’ థియేట్రికల్ బిజినెస్ ఊహించిన దానికంటే పెద్ద స్థాయిలో జరిగే అవకాశాలు కనిపిస్తున్నాయి. ముఖ్యంగా దక్షిణాది మార్కెట్‌లో ఈ సినిమాకు భారీ డిమాండ్ ఉండటంతో పంపిణీ హక్కుల కోసం తీవ్ర పోటీ నెలకొనే అవకాశం ఉందని సినీ విశ్లేషకులు భావిస్తున్నారు. అయితే ఈ బిజినెస్‌కు సంబంధించిన వివరాలపై చిత్ర నిర్మాణ సంస్థ నుంచి ఇంకా అధికారిక ప్రకటన వెలువడలేదు.

# ఇది ముందే ఊహించా.. ఓటీటీ నుంచి ‘సత్లుజ్’ బ్యాన్‌పై నటుడు దిల్జీత్ దోసాంజ్ కామెంట్స్



ప్రముఖ నటుడు, సింగర్ దిల్జీత్ దోసాంజ్ ప్రధాన పాత్రలో నటించిన ‘సత్లూజ్’ చిత్రం డిజిటల్ ప్లాట్‌ఫామ్‌పై తీవ్ర సంచలనం సృష్టిస్తోంది. ఎలాంటి సెన్సార్ కోతలు లేకుండా జూలై 3న ప్రముఖ ఓటీటీ సంస్థ జీ5లో గుట్టుచప్పుడు కాకుండా విడుదలైన ఈ చిత్రం, కేవలం రెండు రోజులకే ప్లాట్‌ఫామ్ నుండి అకస్మాత్తుగా తొలగించబడింది. ఈ వివాదాస్పద పరిణామంపై దిల్జీత్ దోసాంజ్ ఇన్‌స్టాగ్రామ్ లైవ్‌లో స్పందిస్తూ, ఈ నిషేధం ఎప్పుడో ఒకప్పుడు జరగాల్సిందేనని, తాను దీన్ని ముందే ఊహించానని పేర్కొన్నారు. అయితే సోమవారం ప్రభుత్వ కార్యాలయాలు తెరిచిన తర్వాత ఈ నిర్ణయం ఉంటుందని భావించానని, కానీ ఆదివారం సాయంత్రమే తీసేస్తారని అనుకోలేదని ఆయన అన్నారు. తాము ఈ సినిమాను కనీసం ప్రమోట్ కూడా చేయకుండా అలాగే విడుదల చేశామని, ఒకవేళ ప్రమోట్ చేసి ఉంటే ఇది రెండు రోజులు కూడా ఓటీటీలో ఉండేది కాదని దిల్జీత్ వ్యాఖ్యానించారు. అయినప్పటికీ తాము ఏం చెప్పాలనుకున్నామో, ఏ విధంగా చెప్పాలనుకున్నామో అది ప్రేక్షకులకు చేరినందుకు తనకు సంతోషంగా ఉందని, ఇది ప్రేక్షకుల సినిమా కాబట్టి ఎలా వీలైతే అలా డౌన్‌లోడ్ చేసుకుని అయినా చూడవచ్చని ఆయన చెప్పుకొచ్చారు. హనీ ట్రెహాన్ దర్శకత్వంలో తెరకెక్కిన ఈ చిత్రం, పంజాబ్‌కు చెందిన ప్రముఖ మానవ హక్కుల కార్యకర్త జస్వంత్ సింగ్ ఖల్రా జీవితం ఆధారంగా రూపొందింది. ఆయన 1995లో అపహరణకు గురై, ఆ తర్వాత కనిపించకుండా పోయారు. మొదట ‘పంజాబ్ 95’ అనే టైటిల్‌తో రూపొందిన ఈ సినిమా గత మూడేళ్లుగా సెన్సార్ క్లియరెన్స్ కోసం నిలిచిపోయింది. సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ఫిల్మ్ సర్టిఫికేషన్ ఈ చిత్రానికి ఏకంగా 127 కట్స్ ప్రతిపాదించడంతో, ఆ కోతలతో సినిమాను విడుదల చేయడానికి నిరాకరించిన దర్శకుడు, హీరో నేరుగా ఓటీటీ బాట పట్టారు. భారత్‌లో ఓటీటీ కంటెంట్‌పై థియేట్రికల్ సెన్సార్ పరిమితులు నేరుగా వర్తించకపోవడంతో, మేకర్స్ దీనిని ‘సత్లూజ్’ అనే కొత్త పేరుతో అన్‌కట్‌గా జీ5లో రిలీజ్ చేశారు. అయితే సెక్యూరిటీ కారణాలు, ఐటీ రూల్స్ ఉల్లంఘనలను ఉటంకిస్తూ కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన ఆదేశాల మేరకు జీ5 ఈ చిత్రాన్ని భారత్‌లో నిలిపివేసింది. ప్రస్తుతం ఈ చిత్రం భారతదేశం వెలుపల ఉన్న జెడ్5 గ్లోబల్‌లో మాత్రమే అందుబాటులో ఉంది.





# నాగార్జున సినిమాలో విలన్‌గా అందాల భామ

టాలీవుడ్‌లో మన్మథుడు అనగానే అందరికీ గుర్తొచ్చే పేరు కింగ్ నాగార్జున. మొన్నటి వరకు కుర్ర హీరోలు సైతం అసూయ పడేలా ఆన్‌స్క్రీన్‌పై రొమాన్స్ పండించాడు. అయితే ఈ మధ్య ఆయన తన పంథాను మార్చాడు. యాక్షన్ సినిమాలపై ఫోకస్ పెట్టాడు. తన 100వ సినిమా సినిమా పూర్తిగా యాక్షన్, ఎమోషనల్ ఎంటర్‌టైనర్‌గా ఉండేలా ప్లాన్ చేసుకున్నాడు.తమిళ దర్శకుడు రా.కార్తీక్ తెరకెక్కిస్తున్న ఈ ప్రాజెక్ట్‌కు ‘కింగ్ 100’ అనే వర్కింగ్ టైటిల్ పెట్టారు. ఇప్పటికే 80 శాతం షూటింగ్ కూడా పూర్తయింది. లాటరీ నేపథ్యంలో ఈ చిత్రం ఉంటుందని భోగట్టా. అందుకే ‘లాటరీ కింగ్’ అనే టైటిల్‌ని అనుకుంటున్నారట. ఈ చిత్రంలో టబు నటిస్తున్నట్లు అధికారిక ప్రకటన వచ్చినప్పటి నుంచి మరింత అంచనాలు పెరిగాయి. గతంలో వీరిద్దరు కలిసి నటించిన ‘నిన్నే పెళ్లాడుతా’, ‘ఆవిడా మా ఆవిడే’ లాంటి సినిమాలు సూపర్ హిట్‌గా నిలిచాయి. వీరిద్దరి ఆన్‌స్క్రీన్ రొమాన్స్‌కి ప్రత్యేకమైన ఫ్యాన్ బేస్ కూడా ఉంది. 100వ సినిమాలోనూ వీరిద్దరి మధ్య రొమాంటిక్ సీన్స్ ఉంటాయని ఆ మధ్య వార్తలు వచ్చాయి. అయితే లేటెస్ట్ సమాచారం ఏంటంటే.. ఈ చిత్రంలో నాగార్జునతో టబు ఫైట్ చేయబోతుంది. ఆమె హీరోయిన్‌గా కాకుండా, నెగటివ్ షేడ్స్ ఉన్న అత్యంత పవర్‌ఫుల్ విలన్ పాత్రలో కనిపించబోతున్నారట. నాగార్జున, టబుల మధ్య వచ్చే యాక్షన్ సీన్స్ సినిమాకే హైలెట్‌గా నిలవనున్నాయని నెట్టింట ప్రచారం జరుగుతోంది. ఈ చిత్రానికి దేవిశ్రీ ప్రసాద్ సంగీతం అందిస్తున్నారు. అన్నపూర్ణ స్టూడియోస్ పతాకంపై నాగార్జున నిర్మిస్తున్నారు.

PRINTED, PUBLISHED AND OWNER BY B.JAVEED BASHA Printed at M/S Aliya Publication, #7/235 - A Maniyar Street,Near Main Bazar, Tadipatri - 515411,Anantapur District Andra Pradesh, Published at M/S Aliya Publication, #7/235-A Maniyar Street,Near Main Bazar Tadipatri - 515411 ,Anantapur District,Andra Pradesh - 515411 EDITOR B.JAVEED BASHA RNI. NO : APTEL/2022/90211, Cell : 83339 79192 , 83339 75354 , E-mail : akshratimes@gmail.com